


సినీ ప్రభ
ఆంధ్రసచిత్రవారపత్రిక
10-5-


చిత్ర విశేషాలు



భారత దేశంలోని శాస్త్రజ్ఞులు, ఇంజనీర్లు కలసి రూపొందించిన కృత్రిమ ఉపగ్రహం యిలా వుంటుంది... దీన్ని యీ ఏడాది చివర రష్యావారి సహాయంతో సోవియట్ యూనియన్ నుంచి అంతరిక్షంలోకి ప్రయోగిస్తారు.



పేడలో వంటచేసేందుకు ఉపయోగపడే ఇంధన వాయువును తయారుచేసే పరికరం బొమ్మలో మాదిరి ఉంటుంది. గ్రామాల్లో దీన్ని రైతులు తమ యిళ్లవద్ద ఏర్పాటు చేసుకోవచ్చును. దేశంలో 120 కోట్ల టన్నుల పైగా పేడ దొరుకుతుంది. 20 వేల దాకానైనా యిల్లాంటి "గ్యాస్ ప్లాంట్లు" పెట్టాలన్నది సంకల్పం.



సింథాల్ ఇచ్చే
సౌగ్ధానం...
* నిత్య నూతన సౌరభం
* సంపూర్ణ లావణ్య పోషణ
* సార్థక దుర్గంధ నివార్య రక్షణ
CINTHOL
Godrej
CINTHOL
DEODORANT AND COMPLEXION SOAP
...నిలబెట్టుకో కలిగింది సింథాల్ ఒక్కటే.
Interpub/GSC/11/74

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938 – 1972)

శుక్రవారం: 10–5–1974
(శ్రీ ఆనంద నామ సం. వైశాఖమాస బ. చవితి)

సంపుటము: 67 సంచిక: 37

స్థాపితం 1908

సంపాదకుడు:
శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-3

సంవత్సర చందా – రు. 31–20 పై.
ఆరుమాసాల చందా – రు. 15–60 పై.
విడి ప్రతి వెల 55 పైసలు

విషయానుక్రమణిక

ముఖచిత్రం:
నటి వాణిశ్రీ
(ఫోటో: శ్రీ ఉత్తర)

కథలు:

లక్ష్మి గుండు ... 6
ఒక డాక్టర్ చెప్పిన కొన్ని డాక్టర్ కథలు ... 16
కత్తి ... 27
పెట్టిపుట్టని వాళ్ళు (పెద్దకథ) ... 32
ఆటలూ–అంతస్తులూ ... 40

సీరియల్ కథలు:

మమతల వంతెన ... 12
బంగారు కలలు ... 17

వ్యాసాలు, శీర్షికలు:

ఉత్తరాలు—లోకం పోకడ— 3, దేశోద్ధారకుని 107వ జయంతి, వారఫలం—4, హైదరాబాద్ నోట్‌బుక్—5, చిన్నారి చిలిపి చేష్టలు—6, ఇంటింటి చిట్కాలు—7, డాక్టర్ సలహాలు—10, నేపాల్ ప్రజలు, సినిమా — 22, ధర్మపథం—36, ప్రశ్నావళి—39, యువతరం—42, అవీ—ఇవీ—అన్నీ—44.

మనలో మాట

ఈ వారం మధ్య పేజీలలో 'నేపాల్' గురించి క్లుప్తమైన వ్యాసం ఒకటి వేశాము. వ్యాసకర్త జియోలజీలో ఆచార్య పట్టం పొందిన వారు. నేపాల్ రాజధాని 'ఖాట్మండు'లో 'ఇండియన్ కో ఆపరేషన్ మిషన్'లో అధ్యాపకునిగా వుంటున్నారు.

కొంత కాలంపాటు గ్రంథ సమీక్ష శీర్షిక క్రింద సుదీర్ఘమైన సమీక్షలు వేయటం – కొత్త శీర్షికలు; రెండు సీరియల్ కథలు – మొదలైనవాటి ఒత్తిడి దృష్ట్యా అసాధ్యం అనిభావిస్తున్నాము. కనుక కేవలం 'గ్రంథ స్వీకారం'గా అప్పుడప్పుడు పుస్తక పరిచయాలను మాత్రం అందించే ప్రయత్నం చేస్తాము. ఈ సంగతి ముఖ్యంగా సమీక్షార్థం పుస్తకాలు అంటూపంపేవారు గుర్తించాలనిమనవి.

సంతోషమే సగం బలం, చిత్రాల్లో విశేషాలు, సినీ బొమ్మలకొలువు లాంటి శీర్షికలు అడపాతడపా వేయాలనే ప్రయత్నంలో వున్నాము.

ఉత్తరాలు

బ్యాలట్

తేది 26—4—74 నాటి సంచిక "ఉత్తరాలు" శీర్షికలో శ్రీ డి. ఎస్. జయప్రకాశరావు (కోవెలకుంట్ల) పాఠకుని పుత్తరం చూసిన తరువాత ఈ వుత్తరాన్ని వ్రాయకుండా వుండలేకపోతున్నాము. "సినిమా బ్యాలట్" నిర్వహించింది మీరైనా, అందులో పాల్గొని "ఉత్తమ నటుల"ను ఎన్నుకున్నది మాలాటి పాఠకులేనని శ్రీ రావుగారు గ్రహించాలి. ఇందులో హాస్యాస్పదమంటూ ఏమీలేదు.

సి. ఆర్. కె. వసంత, జడ్చర్ల.

కథలు

"మీరు—మీరే—మేము మేమే." అంతే వుప్పెనలా లేచింది ఉద్యమం. అమాయక జీవులు వందలకొద్ది బలైపోయారు. ఏమీపోకపోతే ఆత్మార్పణ అదీ యిదీ చేసుకుంటామన్న నాయకులు గడ్డితిన్న గొర్రె చందాన పట్టాభిషేకాలు చేసుకుని "మీరు—మేము అంతా ఒకటే" అన్నారు. వుప్పెన ఆగిపోయింది. అంతే అంతే అంటూ జీవులు తోకాడించాయి. జై ఆంధ్రా ఉద్యమానికి చక్కటి ప్రతిబింబం "పట్టాభిషేకం" కథ.

అడబాల నాగేశ్వరరావు, (వెంటమూర్లంక.) ●

—లోకంపోకడ————ఊమెన్—



దేశోద్ధారకుని 107 వ జయంతి


దేశోద్ధారక, కళాప్రపూర్ణ, విశ్వదాత, కాశీనాథుని వాగేశ్వరరావుపంతులుగారి 107వ జయంతి సభ ఏప్రిల్ 19న హైదరాబాద్‌లోని ఆంధ్రపత్రిక కార్యాలయంలో జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రధాన న్యాయమూర్తి శ్రీ గోపాలరావుఏక్బోటే ఈ సభకు అధ్యక్షత వహించారు.

పంతులుగారు తెలుగుజాతికి, దేశానికి చేసిన బహుముఖ సేవలని ప్రస్తుతిస్తూ రాష్ట్ర ఆర్థికమంత్రి శ్రీ నూకల రామచంద్రారెడ్డి, కార్మిక శాఖ మంత్రి శ్రీ లుకలాపు లక్ష్మణదాసు, సహకార శాఖ మంత్రి శ్రీ బత్తిన సుబ్బారావు, ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ వీరమాచనేని వెంకట నారాయణ, శ్రీ అనుముల రామనాథశాస్త్రి, శ్రీ వేలూరి సహజానంద, శ్రీ ఉప్పులూరి కాళిదాసు గార్లు ప్రసంగించారు.

శ్రీ పుచ్చా సుబ్రహ్మణ్యశాస్త్రి ప్రార్థనతో సభ ప్రారంభమయింది. ఆంధ్రపత్రిక ప్రధాన విలేఖరి శ్రీ పి. వి. ఆర్. శర్మ స్వాగతం చెప్పారు. ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు, ఉపముఖ్య మంత్రి శ్రీ బి. వి. సుబ్బారెడ్డి, సభాపతి శ్రీ పిడతల రంగారెడ్డి, డాక్టరు చెన్నారెడ్డి గార్లు పంపిన సందేశాలని శ్రీ పి. వి. ఆర్. శర్మ చదివారు.

ప్రధాన న్యాయమూర్తి శ్రీ ఏక్బోటే పంతులు గారి చిత్రపటానికి పుష్పమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనేక మహాత్ములని తమలో విలీనం చేసుకున్న పుణ్యపురుషులు, ఆంధ్రజాతిని రాజకీయంగా చైతన్యవంతం చేసి, స్వాతంత్ర్య సమరంలో దూకడానికి ప్రేరేపించిన మహా నాయకులు ప్రజలని జాగృతం చేసిన మహామనిషి పంతులు గారని ఆయన తన అధ్యక్షోపన్యాసంలో పేర్కొన్నారు.

హైదరాబాద్ అమృతాంజన్ బ్రాంచి మేనేజరు శ్రీ వెంకటరమణ ఆ సంస్థ సిబ్బంది తరఫున పంతులుగారి చిత్రపటాన్ని పూలమాలలతో అలంకరింజారు.



హైదరాబాద్‌లో దేశోద్ధారకుని 107వ జయంతి సభలో ఆర్థికమంత్రి శ్రీ నూకల రామచంద్రారెడ్డి ప్రసంగిస్తున్న ఫోటో. చిత్రంలో మంత్రి శ్రీబత్తిన, పి. సి. సి. అధ్యక్షులు శ్రీవీరమాచనేని, శ్రీ రామనాథశాస్త్రి, ప్రధాన న్యాయమూర్తి శ్రీ గోపాలరావు ఏక్బోటే, మంత్రి శ్రీ లక్ష్మణదాసు ప్రభృతులు వున్నారు.

నా గే శ్వ రా !

" మ న శ్రీ "

'భారతి' వంటి సత్పత్రికల్ స్థాపించి
సాహితీ శుశ్రూష సలిపినావు
భారతాంబిక దాస్యబంధ విముక్తికై
బ్రిటిషు వారల నెదిరించినావు.
అడిగిన లేదని నుడువక, దారిద్ర్య
బాధితుల వెతల బాపినావు
గణనీయ గుణగణ కలితుడవై, ఎల్ల
వారల మెప్పులన్ బడిసినావు
ఆంధ్ర భాషామతల్లికి, నాంధ్రులకును
నీ వొనర్చిన యుపకృతి నిరుపమమ్ము
నిన్ను బోలిన కొమరుని గన్న తెనుగు
తల్లి జన్మము నైతము ధన్యమాయె.

వారఫలం

మహేష్

10-5-1974 శుక్రవారం మొదలు 16-5-1974 గురువారం వరకు

మేషం :— వృత్తి వ్యాపారలు బాగుంటాయి. రావలసినడబ్బు సమయానికి అందుతుంది. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. మీరు యిదివరకు చేసిన ప్రయత్నాలు యిప్పుడు ఫలించ గలవు. స్త్రీలకు—అనుకూలమైన వార్తలను వింటారు. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

వృషభం :— కొంతమంది వ్యక్తులు మిమ్మల్ని మోసం చేయడానికి ప్రయత్నిస్తారు. ప్రయాణాల్లో శ్రమ కలుగు తుంది. వారం మధ్యలో మీ కార్యక్రమాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. స్త్రీలకు — ఆరోగ్యం బాగుండదు. వినోదకాలక్షేపాల్లో పాల్గొంటారు.

మిథునం :— మీ ప్రయత్నాలు సులువుగా నెరవేరతాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. వారం మధ్యలో ఆందోళన కలుగు తుంది. సాహసికవ్యవహారాల్లో నష్టం రాగలదు. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు తిరిగి బాగుంటాయి. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. బంధుమిత్రులను కల్సుకొంటారు.

కర్కాటకం :— మీ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. వ్యాపారంలో శ్రమ మీద అనుకూలత లభిస్తుంది. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. మీ ఆలోచనలు ఫలిస్తాయి. వారం ఆఖరులో అనవసరమైన శ్రమకు గురికావలసి వస్తుంది. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. బంధువులకు చికాకులు యేర్పడతాయి.

సింహం :— వ్యాపారంలో ఆదాయం బాగుంటుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు. రాజకీయ వ్యవహారాల్లో చికాకులుయేర్పడతాయి. ప్రయాణాలు వాయిదా పడతాయి. సమయానికి యేదోఒక విధంగా డబ్బు చేతికి వస్తుంది. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. సాహిత్య.కళా రంగాల్లో ఖ్యాతిలభిస్తుంది.

కన్య :— అన్ని వ్యవహారాల్లోను ఫలితం సామాన్యంగా వుంటుంది. సాటివారిలో గౌరవం బాగుంటుంది. మిత్రుల సహాయం లభిస్తుంది.

హైదరాబాద్ నోట్ బుక్

— తిరుమల రామచంద్ర

నిర్ణయం మంచిదే !

పరీక్షా కేంద్రాలలో జరుగుతున్న దురన్యాయాలను, వెలుపలవారి జోక్యాన్ని ప్రభుత్వం పరిశీలించి, ఆ కేంద్రాలలోని నిరీక్షకులకు, తగిన రక్షణ కల్పించడానికి నిర్ణయించడం చాలా మంచిదే. పరీక్షా కేంద్రాలలో జరిగే దురన్యాయాలవల్ల విద్యార్థులపాడుగాను, నైతిక స్థాయే పతనమై జాతి నిర్వీర్యమవుతుంది. కాని ఒక్క సంగతి : ప్రభుత్వం ఎంత రక్షణ కల్పించినా, నిరీక్షకులూ (ఇన్ విజిలేటర్సు) ధైర్యంతో వుండాలి. ఒకమారు వరంగల్లు పరీక్షా కేంద్రంలో కాపీకొట్టే అభ్యర్థి కత్తిచూపి "బైటకురా, తర్వాత చూద్దాం?" అనిబెదిరిస్తే, "తర్వాత ఎందుకు బే? ఇప్పుడేరా చూద్దాం బలా బలాలు !" అని ఎదిరించే డాక్టర్ బిరుదురాజు రామరాజులు నూరార్లు, వెయ్యార్లు మనకు కావాలి.

ఎందుకు మార్చరు ?

నేను యాభై సంవత్సరాలుగా వింటున్నాను "విద్యా విధానం మారాలి!" అనే కేకను, నినాదాన్ని అందాము. అప్పుడేమో పరాయి ప్రభుత్వం. జాతీయవాదులు పై కేక వేసేవారు. ఇప్పుడేమో మనవారే వేస్తున్నారు. విద్యామంత్రులూ ఇదే నినాదం, విద్యాశాఖ నిర్దేశకులూ ఇదే నినాదం. కులపతులూ ఇదే నినాదం. కేంద్రన్యాయశాఖామంత్రి శ్రీ గోఖలేకూడ ఏప్రిల్ 14 న వివేకవర్ధినీ కళాశాల స్నాతకోత్సవంలో ప్రసంగిస్తూ ఇదే నినాదం చేశారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దగల నూతన విద్యావిధానం నేడు అవసరమన్నారు. అధికారం తమది, పార్టీబలం తమది. శాసన నిర్మాణ సభలలో బలం తమది. ఇక మార్పు చేయడానికి అడ్డేమిటి? యాభై సంవత్సరాలుగా ఈ నినాదంవిని మార్పు జరుగక పోవడాన్నిబట్టి, నేటి విద్యావిధానం మార్చగలిగి, నవ విద్యావిధానం తేగలవారు విద్యార్థులేనేమో అని నాకు నమ్మకం కలిగింది.

కుర్వంత విశ్వమార్యం :

శ్రీ సిరిపురం రాజేశ్వగుప్త ఏప్రిల్ 14 న తన కుమారునికి ఆర్య సమాజ పద్ధతిని పండిత రుద్రదేవశాస్త్రితో, మంత్రి శ్రీ నూకల రామచంద్రారెడ్డి, శ్రీ వందేమాతరం రామచంద్రారావు, శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, మహాపండిత శ్రీ రాచర్ల రాఘవాచార్యులు మొదలయిన ప్రముఖుల, విద్యాంసుల సన్నిధానంలో ఉపనయ సంస్కారం జరిపినప్పుడు వేదఘోష అందరి నోటి నుంచి వెలువడి ఆదర్శనగర్ ప్రాంతాన్ని ప్రతిధ్వనించినప్పుడు, కులమతనిర్మూలనకు ప్రపంచం ప్రసవించిన తొలిసాహిత్యమైన వేదాన్ని అనుసరించడమేశరణ్యమనిపించింది. ఋగ్వేదం ప్రాచీనతమ సాహిత్యం. దానిలో కులమత, వర్ణ ప్రసక్తి లేదు.

మాడర్న్ ప్రింట్స్ ప్రదర్శనం :

లలితకళా అకాడమీ, అమెరికన్‌కాన్సలేట్ సంయుక్త యాజమాన్యాన కళాభవన్‌లో మార్చి 29 నుండి రెండు వారాలపాటు జరిగిన మాడర్నుప్రింట్స్ ప్రదర్శనం కళాభిమానులను వూహాలోకాలకు తీసుకుని వెళ్ళింది. దీనిలో పికాసో మైరో, మాటిస్సీ, భాగల్, రాస్చెన్‌బర్గ్, డికూనింగ్, ఆల్బెర్స్, బస్కిన్ మొదలయిన 24 మంది విశ్వవిఖ్యాత కళాకారుల 50 అసలు గ్రాఫిక్కులు, చిత్రాలు ఉన్నాయి. దీనిని చూచిన తర్వాత నాకు విచారం, తక్కువ తనంకలుగలేదు. ఆంధ్రప్రదేశ్ గ్రాఫిక్ చిత్రాల ప్రదర్శనాలు చూచిన నాకు, "మన తెలుగువారికి మరికొంత అవకాశం ఇస్తే, మరికొంత కలిసి కట్టుతనం మన కళాకారులలో ఏర్పడితే, మనంకూడా పికాసో అంతటివారు కాకపోయినా, అతనికి దగ్గర చేరగలమనే నమ్మకం కలిగింది. ఇది మనసులోని మాట—థింకింగ్ ఎ లౌడ్ !

"సాహిత్య చైతన్య" బిరుదం :

కొందరు ఉత్సాహానందాలతో తొణికిసలాడుతూ, తమ పరిసరాలను ఉత్సాహానందాలతో నింపివేస్తారని, కొందరు అభాగులు నిర్వేదనైశ్యాలతో కుంగిపోతూ తమ పరిసరాలను కుంగదీస్తారని క్షేమేంద్రుడు అన్నదానిలో మొదటి పరిశీలన మిత్రులు శ్రీ పోతుకూచి సాంబశివరావుకు పూర్తిగా అన్వయిస్తుంది. ఉత్సాహతుందిలుడు, స్నేహశీలి, నవ్యసాహితీసమితి, ఆంధ్రవిశ్వసాహిత్యాది సంస్థల మూలపురుషుడు, నిర్వాహకుడు, అనేకానేకయువజనులకు రచనలో మార్గదర్శకుడు అయిన శ్రీ పోతుకూచి రచనా రజతోత్సవాన్ని మిత్రులు ఇటీవల సారస్వత పరిషత్తులో న్యాయమూర్తి శ్రీ ఆవులసాంబశివరావు అధ్యక్షతన జరిపినప్పుడు ఆనందించిన మొదటివారిలో నేనొకణ్ణి.

విద్యామంత్రి శ్రీ మండలి వెంకటకృష్ణారావు, రచనా రజతోత్సవం ప్రారంభించగా, శ్రీ దేవులపల్లి రామానుజరావు, డాక్టర్ దివాకర్ల, డాక్టర్ అక్కినేని రమాపతిరావు, శ్రీ నూర్ల అప్పారావు, శ్రీ భోయిభీమన్న, శ్రీమతి కృష్ణవేణి సంజీవయ్య ప్రశంసించగా, "సాహితీచైతన్య"బిరుదం శ్రీ పోతుకూచికి ఇవ్వడంతో ఉత్సవం సమాప్తమైంది.

ఉపశ్రుతి :

"సాయుధ విప్లవం వర్ధిల్లాలి !
పోలీసు దళాలు తొలగించాలి !"

అనే గోడల మీద నినాదాలలో పూర్వాపర విరోధం లేదండీ ! —అన్నాడు ఒక ద్రష్ట. "ఈ ప్రపంచమే పూర్వా పరవిరోధం"అన్నాడు మరొక ద్రష్ట. ●

వృత్తిలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. వారం ఆఖరులో యితరుల నిమిత్తము శ్రమకు గురికాగలరు. స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది. పుణ్యకార్యాలు చేస్తారు.

తుల :— వృత్తిలో అనుకూలవార్తలను వింటారు. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. వారం ఆఖరులో మీ కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. స్త్రీలకు —వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. బంధు మిత్రులను కలుసుకొంటారు.

వృశ్చికం:— మీ శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో మీమంచితనమే మీకు యిబ్బందిని కలిగిస్తుంది. స్త్రీలకు —ఆరోగ్యం బాగుంటుంది. సంతోషకరమైన సమాచారం అందు తుంది.


ధనుస్సు — మీ కార్యక్రమాలు బాగుంటాయి. వృత్తిలో ఆదాయం పెరుగు తుంది. ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణించగలదు. సాహసముతో కూడిన వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు — కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. సాటివారిలో గౌరవం లభిస్తుంది.

మకరం :— మీరు శ్రమ పడినా, ఫలితందక్కదు. వ్యతిరేకమైన వార్తలను వింటారు. వారం మధ్యలో ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపారంలో ప్రయోజనంగల సంభాషణలను జరుపగలరు. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. శుభకార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

కుంభం :— వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వారం మధ్యలో అధిక వ్యయం జరుగు తుంది. మీ తాలూకు వస్తువులు పోవచ్చును. వారం ఆఖరులో మీ కార్యక్రమాలు అనుకూలంగా ఉంటాయి. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు.

మీనం :— మీ కార్యక్రమాలు ఒడుదుడుకులు లేకుండా నెరవేరతాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. విద్యావైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. వారం ఆఖరులో మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. స్త్రీలకు — ఆరోగ్యం బాగుం[illegible] అనుకూలమైన వార్తలను వింటారు. ●

—చిన్నారి చిలిపి చేష్టలు



ప్రహ్లాదుడి పంతం

మా పసివాడి పేరు ప్రహ్లాద్. వాడికి ఏమిటో చిన్నతనం నుంచి అభిమానం జాస్తి. వాడి మనసుకు ఏమాత్రం కష్టం కలిగినా యిట్టే బాధపడి పోతాడు. ఎవరితో నూ మాటాడడు. ఆపూట ఇక అన్నం తినని మంకుపట్టు పట్టి కూచుంటాడు.

ఓ రోజున వాళ్ల నాన్నగారికి కోపం వచ్చి కసురు కున్నారు. అంతే! వాడు భీష్మించు కున్నాడు. అన్నం తినని అలిగి కూర్చున్నాడు. ఆరోజు వాడికి యిష్టమైన 'కోఫ్తా' కూర వండింది వాళ్ల నాయనమ్మ. మనసు ఉండ బట్టలేక ఇంటిల్లి పాదిమీ వెళ్లి అన్నం తినమంటూ ప్రతిమి లాడాము. వాడు ససేమిరా అన్నాడు. వాళ్ల నాన్నగారికి కోపంవచ్చి "ఆకలేస్తే వాడే తింటాడు. అన్నం పెట్టమని అడిగేవరకూ ఎవ్వరూ భోజనం పెట్టవద్దు." అంటూ నిజంగానే హుకుం జారీ చేశారు.

ఎంతయినా తల్లినిగదా! వాడి దగ్గరగా వెళితే "అమ్మా... అన్నం పెట్టు!'' అంటాడేమోనని, గదిలోకి వెళ్లాను. వాడు నన్ను చూసి ముఖం అటు తిప్పుకున్నాడు. నాకు నవ్వూ, కోపమూ వచ్చాయి. 'పెంకె వెధవా! వేలెడంత లేవు. ఇప్పటినుంచే నీకింత మంకు పట్టా?'' అనుకుని మాట్లాడ కుండా వంటింట్లోకి రాబోతున్న నాదృష్టి తెల్లని ముగ్గుల్లా ఉన్న గచ్చుమీది గీతల మీద పడింది. ఆ గచ్చు మీద మావాడు సుద్ద ముక్కతో ఇలా రాశాడు "అన్నానికి మరొక సారి పిలవండి వస్తాను'' అని.

అదిచూసి నేను పరుగున వెళ్లి మా అత్తగార్ని, శ్రీవార్ని పిలిచాను. వచ్చి చూద్దుంగదా — గదంతా వంకర టింకర అక్షరాలే! వాడు మళ్లీ పిలవమని యిచ్చిన తాఖీదులే!

సరే! "కోఫ్తా" వాసన ధర్మమా అని మావాడారోజు అలకమాని భోంచేశాడు.

—శ్రీమతి రాధా బాలసుబ్రహ్మణ్యం.
(బొలారం)



—— పై వారమే ——

జీవితమూ — నటనా

—— పెద్ద కథ ——

ఇల్లాలికి ప్రత్యేకం

★ టమాటోలు రాత్రంతా, ఉప్పునీటిలోవేసి వుంచితే మరునాటికి తాజాగా వుంటాయి.

★ దోసెచేసి పప్పుడికోసం వెలుక్కునేబదులు, తేనెవేసుకుని తింటే చాలా బావుంటాయి.

★ వంకాయలు, బెండకాయలు ముదిరిపోకుండా వుండాలంటే వాటి ముచ్చికలు తీసివేస్తేసరి

★ కత్తిపీట పదునుపోతే, వుల్లిపాయరసం రాసి వుల్లిపాయ తరిగారంటే పదునుగా వుంటుంది.

★ కుక్కర్‌వాడగా లోపలంతా నల్లగావుంటుంది. ఆ నలుపు పోవాలంటే బంగాళదుంపలతోలు అల్లం రుబ్బి, నిమ్మకాయ ముక్కలుగా తరిగివేస్తే ఆ నల్లని డాగులు పోతాయి.

★ పట్టుచీరెల మీద నూనెపడితే కంగారు పడకండి. నూనె మరక మీద, టాల్కమ్ పౌడరుగాని విభూతి గానివేసి, అరగంట అయిన తరువాత దులిపి వేస్తే మరక కనపడదు.

★ వెండిసామాన్లు యినుపపెట్టెలోగాని,ఇనుప బీరువాలోగానీ పెట్టటంవలన నల్లగా తయారవుతాయి. వాటిని విభూతితోతోమితే మిలమిలమెరుస్తాయి. లేదా బంగాళదుంప వుడకబెట్టిన నీళ్ళలో వేసినా మెరుస్తాయి.

★ రాళ్ళదిద్దులు నీరు దిగినట్లయితే,టాల్కమ్ పౌడరులోవేసి తుడుస్తే, మెరుస్తాయికొత్తవిలా.

★ బట్టలకి పురుగులుచేరకుండా పెట్టెఅడుగువ కాగితంక్రింద వేపాకువేస్తే పురుగులు చేరవు.

★ మునగాకు, బచ్చల, తోటకూర మొదలగు ఆకుకూరలు వాడిపోకుండా వుండాలంటే ఉప్పునీళ్ళలో కాడలు మునిగేటట్లు వుంచితే, మరుసటి రోజుకు కూడా తాజాగా వుంటాయి.

★ సాంబ్రాణి కడ్డీలు వెలిగించుకుని పెట్టెలు అవతల పారవేస్తాం. అవి చీరెల్రక్రింద పెడితే, మంచి వాసనవస్తాయి. పెట్టెలోకి పురుగులు చేరవు.

★ పాలుపొంగకుండా వుండాలంటే, గిన్నెఅంచులకు కొంచెం వెన్నరాస్తే పొంగవు.

సూర్యం కలిసి సినిమాకి వెళ్లారు. కింద తరగతుల్లో హాలు కిటకిట లాడి పోతోంది గాని వీళ్ల క్లాస్‌లో ఇరవై పుంజీలకి లోపుగానే ఉన్నారు జనం.

రామ సూర్యాలకి ముందు వరసలో రెండు కుర్చీల అవతల నున్నటి గుండు తల ఆసామీ కూర్చున్నాడు. సినిమా యింకా మొదలు కాలేదు. రామారావుకి ఏంతోచడం లేదు.

"ఒరేయ్ సూర్యం నీకు చేతనైతే ఆ గుండుమీద ఒక్క టెంకిజెల్ల ఇచ్చుకో. ఐదురూపాయలు ప్రెజెంట్!" అన్నాడు కొంటె చూపుతో సూర్యాన్ని ఉసిగొలుపుతూ.

"ఐదురూపాయలు పోగొట్టుకుంటావ్రా రాముడూ! ఇదుగో క్షణంలో నీ కోరిక తీరుస్తా"నంటూ వెళ్లి గుండుమీద తపీమని చరిచి,

"ఇంకా గుండు చేయిస్తూనే ఉన్నావురా జోగినాథం ...? నన్నడిగితే నీ మొహంలా ఉందనుకో ఈ వెధవస్టైల్ ...! ఎప్పుడొచ్చావు పిఠాపురం నుంచి...? మా యింటికి రాలేదేం? అందరూ క్షేమమేనా!" అంటూ వడవడ వాగేస్తున్నాడు.

గుండువాడు గతుక్కుమని తెల్లబోయి చూశాడు వెనక్కి తిరిగి బుర్ర తడుముకుంటూ. మరుక్షణం అతని మొహం కోపంతో ఎర్రబడింది.

"నాపేరు జోగినాథమూ కాదు. నేను పిఠాపురం నించీ రాలేదు. నువ్వెవరో నాకసలు తెలీదు." అన్నాడు తీక్షణంగా.

"ఏమిటీ ...? జోగినాథం కాదూ ...! అరరె ... పొరపాటైంది. క్షమించాలి. కాని ఎంతపోలిక మీకూ మావాడికీని! నా కళ్లని నేనే నమ్మలేకపోతున్నానంటె నమ్మండి...!!" అంటూ తిరిగివచ్చి "ఒరేయ్ మన ఐదిల్లా పారెయ్" అని రామారావు దగ్గర్నించి ఐదు రూపాయలు వసూలు చేసుక్కూచున్నాడు.

సినిమా మొదలైన తర్వాత ఇరవై నిమిషాల్లోనే కరెంటు పోయింది. గాలీ వెలుతురూ కోసం తలుపులన్నీ తెరిచేశారు. రామారావు బద్ధకంగా ఆవలించాడు.

సూర్యంగాడు అతిసింపుల్‌గా ఐదురూపాయలూ లాగేశాడు. వాడికి శాస్తి చెయ్యడమెలాగా అని ఆలోచించాడు కాసేపు.

"ఒరేయ్ సూర్యం! ఇంకోసారి టెంకిజెల్ల యిచ్చుకున్నావంటే నీకు మరో ఐదు ప్రెజెంటుకో...! చూస్కో నీ లక్ మరి...!" అని అన్నాడు కళ్లెగరేసి నవ్వుతూ.

"ఓరి దాందేవుందిరా సిద్ధంగా ఉంచు ఐదూను" అంటూ ముందుకెళ్లి తపీమని పించాడు గుండుమీద మళ్లీని.

"హోరి...! ఎంత నాటకమాడావురా ... జోగినాథాన్నే కానంటూనూ...! నన్నేబుట్టలో వేశావు గదరా గుండూ...! హ...!ఎంత పట్టి కొట్టించావురా నన్ను...! తస్స—"

"జోగినాథాన్ని కాను మొర్రో అంటె వినిపించుకోవే ...? మాట వినిపించుకోకుండా ఆదేరంధా...మరిని...ఒళ్లు మండిపోయేట్టు" అన్నాడు గుండువాడు సూర్యం మాటలని తుంచిపారేసి కోపంతో ఊగిపోతూ.

"అరె...! నిజంగానె...! జోగినాథం కానే కాదూ...! అరె! నన్ను చంపినా నమ్మలేకపోతున్నాను...! ఎంత అద్భుతం! ఎంత పోలిక...! నన్ను...క్షమించండి...!" అన్నాడు సూర్యం గుండువాణ్ణి అనుమానంగా చూస్తూ.

రామారావు రెండోసారి ఐదు రూపాయలు యిచ్చుకోవలసి వచ్చింది. సూర్యంగాడి సమయస్ఫూర్తిని మెచ్చుకోడం కంటె తనదగ్గర పదిరూపాయలు లాగినందుకు వాడికేదైన శాస్తి చేసితీరాలని పట్టుదల పెరగసాగింది. కాని యింతలో కరెంట్ రావడమూ ఆట వెంటనే మొదలవడంతో ఊరుకోవలసి వచ్చింది అప్పటికి.

ఇంటర్వెల్‌లో ఇద్దరూ బయటికివచ్చారు. గుండువాడు టీ తాగుతున్నాడు. వాణ్ణిచూడగానె రామారావు మరొకఛాన్సు తీసుకుని చూడాలనుకున్నాడు.

"ఒరేయ్. మరో ఐదు ప్రెజెంట్...! చూస్కోమరి! ఇప్పుడే వాడికి మరో జెల్లకాయి...!"

"ఓస్...! అదెంతపని...!" అంటూనే వెళ్లి టీ తాగుతున్నవాడి గుండుని తపీమనివేసి

"ఒరే జోగీ... నువ్వనుకొని హాల్లో ఎవడి బుర్రమీదనో ఇల్లానె అలవాటుకొద్దీ వేశాన్రా! బలే చీకాకైంది... బహు కోపించుకున్నాడు. క్షమాపణలు చెప్పుకోలేక చచ్చాననుకో... ఇంతకీ...!"

"కట్టు కట్టవయ్యా నీ సొద...! నాకు తిక్కరేగిందంటే ఈ టీగ్లాస్ నీ నెత్తిన పగలేస్తాను... ఏమనుకున్నావో...? హాల్లో ఎవడ్నో వేశానంటావేమిటి మతి లేకండగా...! నన్నే నువ్వు వేసింది...! నీ తాట వలుస్తాను నా జోలికొచ్చావంటే...'జోగి జోగి' అనుకుంటూ నా వెంట బడ్డావేమిటీ... దిక్కుమాలిన సంత...!"

"అయ్యో...! మిమ్మల్నేనా నేన్జరిచింది! ఎంత పొరపాటు... ఎంత అపరాధం...! నన్ను క్షమించండి. హాల్లో కనుచీకట్లో సరిగ్గా గుర్తుపట్టలేక పోయాను. ఇక్కడ ఈ వెలు

గుతో స్పష్టంగా...కొట్టొచ్చినట్టు జోగినాథం లానె కన్పిస్తున్నారు మీరు!''అన్నాడు ఎంతో యిద్దై పోతున్న మొహం పెట్టి.

''వెలుగులో సుబ్బరంగ చూశావు కద...! ఇహనా జోలికి రాకు...! అయినా నీకు తెలిసిన జోగినాథం అనిపిస్తే మాత్రం అందుకోసం బుర్ర వాయించడ మెందుకూ...! అదేం పరసం...!యేరకమ్మైన స్నేహం...! ఈ పాటి కిహ దయచెయ్యి... !'' అన్నాడు వినుగ్గా సూర్యం మాటలని ఈసడించుకుంటూ తుంచేసి గుండువాడు.

సూర్యం మరో ఐదు సంపాదించేశాడు. రామారావు ఆశ్చర్యానికి అంతేలేదు...! ఎప్పటి కప్పుడు ఇన్ని తన్నులు ఎలా తడుతున్నాయి వీడికి...! ఆ గుండువాడి మొహంచూస్తే యే కోశానా నెమ్మదైనవాడనిపించడమే లేదు. అయినా సద్దుకుంటున్నాడు వీడితో...! ఎన్ని మాట్లని సద్దుకుంటాడు...! దీని అంతు చూడాల్సిందే. పట్టుదల హెచ్చిపోయింది రామానికి.

''ఒరేయ్...! మరోటి...మరో ఐదు...!'' అనేశాడు.

తాగిన టీకి డబ్బులిస్తున్న గుండువాడి బుర్రని మరోసారి 'ఠఫ్' మనిపించేశాడు సూర్యం.

''హోరి...! యిప్పటికర్థమైందిరా నీ కోపానిక్కారణం—! జోగినాథవని పిల్చాననే కదూ...అవును. నీకా పేరే నచ్చేది కాదు. కాని మీ వాళ్ళు పెట్టినపేరు మరి. కృష్ణ మోహన్‌గా మార్పించేసుకున్నావన్నమాట చివరికి. అది గదూ నీకిష్టమైనపేరూ...! అయితే గెజెట్ నోటిఫికేషన్ కూడా అయిం దన్న మాటేగా...! హోరి...! మట్టి బుర్రరా నాది ! యేరకం సరసం... యేరకం స్నేహం అని నువ్వు యిద్దై పోతూంటే తట్టనేలేదు నీ బాధేమిటోనూ ... మీ బామ్మ పోయిందన్న మాట. అందుకే మార్చేసుకున్నావు పేరు. బతికుంటె మార్చుకోనిచ్చేదంటావా...? చిన్న ప్పటినుంచీ స్నేహితులం...! జోగి అని పిల్చి నందుకు కోపం తెచ్చుకుని నన్నెరగనంటం న్యాయమేనట్రా—''

గుండువాడు వొళ్ళెరగని కోపంతో ఊగి పోతున్నాడు. ఆవేశంవల్ల మాటలు రావడం లేదు నోటంట. ముక్కు పుటాలెగరేస్తు న్నాడు. పెదవులదిరిపోతున్నాయి. మొహం కందగడ్డలా ఎరుపెక్కి పోయింది.''ఎవడ్రా... నువ్వు ...! నీ మొహం బోర్లేసి యీడ్చ...! చంపుకుతినేస్తావేమిటి నన్ను ... ! జోగినాధ వైంది...! ఇప్పుడు కృష్ణమోహనని మార్చు కున్నానంటావు ... ? తుంటరి వెధవకాన... చీరుస్తా నిన్ను ... !'' ఎగస్వాస దిగశ్వాసలతో ఆయాసపడి పోతున్నాడు, గుండువాడు గట్టిగా అరుస్తూ.

జనం పోగయ్యారు, ఆ కేకలకి ''యేమి టేమి''టంటూను.

''అబ్బే, యేవీలేదు. మా జోగినాథాని క్కోపమొస్తే వొళ్ళెరగడు. వేళాకోళానికి జోగీ, జోగీ అని పిలిచి గుండుమీద చిటికె వేసినందుకు తిక్కరేగింది వాడికి. తప్పునాదే. మావాడి సంగతెరిసుండీ నేనే ఓవర్ డూ చేశాను, సినిమా చూస్తున్న హుషార్‌లో. అయిందేదో ఐంది నాతప్పు క్షమించమని యింతమందిలో అడుగుతున్నాను గదురా ...! ఇంకా నీ కోపం తగ్గకపోతే నన్ను ఒకటిచ్చుకో గాని ఇంత మంది మధ్య అల్లరెందుకూ ... పద ... పోయి కూచుందాం...!'' సూర్యం దిగాలుపడి పోయిన మొహంతో, బతిమా లుతూ గుండువాడి చెయ్యి పట్టుకో బోయాడు.

''ఛీ ... ! దూరంగా పో ...! నాదగ్గిరకి రాకు. నాపేరసలు జోగినాథం కాదు. ఎవరయ్యా పెద్దమనుషులు ... ! వీడెవరో నేనసలెరగను. అయినా జోగినాథం జోగినాధ మంటూ నావెంటపడి నా బుర్ర సాడించేస్తున్నాడు దొంగ వీ గుండువాడు జీరపోయిన అరుస్తూ.

జనానికి వీళ్ల తగా ... ట్రెంస్ట్ సన్నగిల్లి పోయింది. వెళ్లి ఉన్న వాళ్ళలో ఒకడు ''యేంగాకనుపోతే, ఎరక్కపోతే, ఎందుకు రామకీర్తనకి ఒప్పుకున్నావు యిప్పటి దాకాను... ? యే తగూలాడుకున్న అరవ కోడ వెందుకు స్నేహితులై యుండీని ... ! చూడబోతె ఇద్దరూ చదూకున్నవాళ్లు... ! ఒహాళ్లు చెప్పాలా మీకు ? '' అనేసి జారు కున్నాడు.

గుండువాడికి మతిపోయింది ... ! జుట్టుంటే పీక్కునేవాడే ! లేదుమరి. ఏదో తిడుతున్నాడు. జీరబోయిన గొంతుతో. సూర్యం లోపలికి పదమని చేతులు పట్టుకు బతిమాలుతున్నాడు. చివరికి గుండువాడు విదిలించేసుకుని వెళ్లి తన పాతసీటు వొదిలేసి పెడగా గేటుదగ్గిరసాకూచున్నాడు ధుమధుమ లాడిపోతూ.


సూర్యం జేబురుమాలుతో మొహం తుడుచుకుంటూ రామం పక్కన చతికిల బడ్డాడు. హాల్లో రికార్డులు మోతెత్తి పోతున్నాయి. ఇంకా ఆట మొదలెట్టలేదు.


''సూర్యం...! మళ్లీ కొట్టగల ధైర్యం ఉందిరా నీకు...?'' అడిగాడు రామం ఆశ్చర్య పడుతూ

''సందేహ మెందుకురా నీకు? మరో ఐదు నాలుస్తానంటే తగిలించేస్తాను.ఏమంటావు?''

కుతూహలమూ, పట్టుదలా ప్రోత్సహిం చగా రామం ''సరే'' అనేశాడు. సూర్యం లేచి

(10వ పేజీ చూడండి)





సిల్వర్ ప్రిన్స్–క్షౌరం చేసుకొన్న ప్రతిసారి ఆనందానుభూతినిచ్చేందుకు

సిల్వర్ ప్రిన్స్ స్టెయిన్‌లెస్ స్టీల్ బ్లేడ్‌తో శుభ్రమైన నున్నని క్షౌరాలు వీలవుతాయి. ప్రతి సిల్వర్ ప్రిన్స్ బ్లేడ్ పురోగమించిన భారత దేశ సాంకేతిక విజ్ఞానంతో, దిగుమతి చేయబడిన



స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారుచేయబడుతుంది. ఈ కారణాలవల్ల క్షౌరం చేసుకొనేటప్పుడు మీకు అపూర్వమైన ఆనందానుభూతి కలుగుతుంది. సిల్వర్ ప్రిన్స్ బ్లేడ్‌తో క్షౌరం గొప్పహాయినిస్తుంది

Grant.5.TL

లక్ష్మి గుండు

ఉత్సాహంగా ముందుకడుగేశాడు. గుండువాడు చటుక్కున వెనక్కి తిరిగి, సూర్యం తన వైపుకి రావడం చూశాడు. ఇక ఆలోచనకి వ్యవధి లేదు వాడికి. గభీమని లేచినుంచుని బయటికి పరుస్తున్నాడు. సూర్యం చెకచెక అందుకోడానికి ప్రయత్నించాడు కూడాను. సూర్యం తొందర గ్రహించిన గుండువాడి కాళ్లలో వేగం ఎక్కువకాగా ఇంచుమించుగా చీకట్లోకి పరిగెత్తి పారిపోయాడు. సూర్యం హతాశుడై తిరిగి వచ్చేశాడు.

"జారిపోయాడ్రా రామం...!" అన్నాడు విచారంగా.

గుండువాడి పరుగును చూసిన రామారావు ఆపుకోలేక నవ్వేశాడు.

"వాడి బుర్రవాయించేస్తుంటే ఎంత సేపని భరిస్తాడు...! పారిపోయాడు మరి...! ఐనా నీకు విచార మెందుకూ...! అయినకాడికి వాణ్ణి వాయిస్తివి ... నా దగ్గర యిరవై కాజేస్తివి...!

"లక్ష్మిగుండురా వాడిది. 'ఠప్' మన్నప్పు డల్లా [illegible] రూపాయలు రాలాయి. మనకీ వున్నాయి [illegible] బుర్రలు వెంట్రుకలతోసహా. అవైనా రాలవు మనకి. పైగా రాల్చిన వాడికి మనం దబ్బిచ్చుకోవాలి. అలాంటిలక్ష్మి గుండు చేజారి పోయిందని నా విచారం."

"నేర్చుకు పోయావులేరా వెధవకాన. నీకు లక్ష్మి గుండే...! మరి నాకో...? ఇరవై పోయాయి వాడివల్ల. లక్ష్మిగుండుట...లక్ష్మి గుండు...!" అన్నాను ఈసడింపుగా.

డాక్టర్ సలహాలు

—డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

వి. ఎస్. అనకాపల్లి.

మా పాపకు 8 నెలలు నిండినవి. శరీరములో ఏవిధమయినమార్పురాలేదు. పుట్టినప్పుడు ఏ విధంగా ఉందో అట్లాగే ఉంది. ఇప్పుడు అమూల్ స్ప్రే ఇస్తున్నాము. దీనిబదులు ఏమి ఇవ్వాలో తెలియ చేయండి.

పిల్లల శరీరములో మార్పులు కలుగకపోవటానికి సరి అయిన పోషణ, ఆహార విధానము మొదలగు వాని పై ఉంటుంది. ఉదా: పాప ఆహారము వయసు బట్టి కాక బరువునిపట్టి ఇవ్వవలసి ఉంటుంది. ఈ విధంగా డాక్టర్ల సలహా ప్రకారము ఇస్తే పాప ఆరోగ్యంగా పుష్టిగా పెరగటానికి సహాయపడతాయి.

ఇవిగాక, పుట్టుకతోనే వచ్చే కొన్ని రోగాలు, ప్రైమరీ కాంప్లెక్స్, కడుపులో క్రిములుఉండటం బరువు పెరగక పోవటానికి కొన్ని ఇతర కారణాలు. వీటిని వైద్యులు పరీక్ష చేసి నిర్ణయించవలసి ఉంటుంది.

సి. ఎమ్. సి. ఆర్. మద్రాసు–85.

మా వారి వయస్సు 40 సం. లు. మాకు ముగ్గురు పిల్లలు. మావారు 6 నెలల క్రితం వేసక్టమీ చేయించుకొన్నారు. ఇది వరకటిలా తృప్తి కలగటం లేదు. డాక్టర్లు టెస్‌టెక్స్ మాత్రలు వాడమని చెప్పారు. వాడినా ఫలితం లేదు. రివర్స్ ఆపరేషను చేయించుకొంటే ఫలితం ఉంటుందంటారా?

ఆపరేషన్ చేయించుకున్న తర్వాత కొద్ది రోజులు లేక నెలలు అలాగే ఉండటంలో తప్పులేదు. అయినా 40 సం. లు వచ్చిన తర్వాత సాధారణంగానే మునుపటి శక్తి తగ్గటం సహజం. తొందరపడి 'రీకెనలైజేషన్' చేయించుకోవలసిన అవసరం లేదు. 1 సం. ఆగి తర్వాత తిరిగి ఆలోచించండి.

జి. ఆర్. అమలాపురం.

నాకు ఇద్దరు పిల్లలు. 6 సం. ల ముందు ఆపరేషను చేయించుకొన్నాను. (వేసక్టమీ). తరువాత ఇద్దరు పిల్లలు అకస్మాత్తుగా చనిపోయినారు. తిరిగి పిల్లలు పుట్టుటకు ఏదైనా మార్గము చూపుతారని ఆశిస్తున్నాను.

ఇది నిజమైతే, రీకెనలైజేషన్ ఆపరేషన్ కొన్ని వైద్య కేంద్రాలలో చేస్తారు. ఇలా చేయుటం వల్ల తిరిగి పిల్లలు పుట్టే అవకాశం వున్నది. అయినా ఆపరేషన్ చేసుకున్న తర్వాత, పిల్లలు అకస్మాత్తుగా చనిపోవటం చాలా విచారింప వలసిన విషయం. సరి అయిన వైద్య సదుపాయం సకాలంలో అందజేస్తే ఇంతబాధ తప్పేది కదా!

ఎస్. ఆర్. హైద్రాబాదు.

చంకలో 'ఏక్సిలరీగ్లాండ్స్' ఎందువలన వస్తుంది. ఇది ఎక్కువ రోజులు ఉండుటవలన ఏదైనా ఇతర రోగములు రావటానికి అవకాశం ఉందా . . .


మానవులలో నెత్తురుతో సమానమయిన 'లింఫ్' అనే ద్రవమును తీసుకు వెళ్లే నాళములు కొన్ని ప్రదేశములలోని లింఫ్‌గ్రంథులలో అంతమవుతాయి. అక్కడినుండి వేరే నాళముల ద్వారా, ఇతర లింఫ్ గ్రంథులకు అక్కడనుండి ఒక గొట్టముద్వారా రక్తములో కలవటం జరుగుతుంది. వీటిని మన మురుగు కాలువలతో పోల్చవచ్చును. శరీరంలో క్రిములు చేరినప్పుడు వాటిని ఈ గ్రంథులు పట్టి వేస్తాయి. ఈ క్రిములు ఎక్కువగా వీటిలో చేరటం వల్ల, ఇవి వాయటం జరుగుతుంది. ఏక్సిలరీ గ్రంథులు వాయటం— చేతులు, జబ్బలు మొదలగు వాటిలో సూక్ష్మ క్రిములు చేరినప్పుడు వాస్తాయి.

కె. ఆర్. ఆర్. అనంతపురం.

నాకు చిన్నప్పటి నుంచి చెవులో చీము వస్తున్నది. ఎన్ని మందులు వాడినను తగ్గలేదు. మందులు వాడినప్పుడు 15 రోజుల పాటు లేకుండా ఉండి మళ్లీ వస్తున్నది.

* చెవులలోనుంచి చీము చాలా రోజులుగా రావటాన్ని క్రానిక్ సప్యురేటివ్ ఆటైటిస్ మీడియా అంటారు. చెవులలోని మధ్య భాగములో చీము చేరటంవల్ల ఇలా జరుగుతుంది. ఎక్కువ రోజులుగా ఉన్నప్పుడు చెవుల వెనుక భాగంలోని మాస్టాయిడ్ అనే ఎముకకు ఈ చీము విస్తరించి నిరంతరంగా చీము కారటం జరుగవచ్చును.

చీమును పరీక్ష చేసి, యాంటీబయాటిక్ సెన్సిటివిటీ చెప్పు తర్వాత ఈ మందులు వాడితే తిరిగిరావడానికి అవకాశం తక్కువ. చెవులలో మాత్రమేగాక, మాత్రల ద్వారా లేక ఇంజక్షన్‌ల ద్వారా కూడా యాంటిబయాటిక్‌లను వాడటం అవసరం.




ఆమె మృదువైంది, దృఢమైంది, సౌందర్యం
సంతరించుకున్నది... అందుకే ఆమె పరిపూర్ణ స్త్రీ...
పట్టువంటి టాల్క్... అనురాగ పూరితమైనది. మిమ్మల్ని అలరించేది. సరికొత్త సువాసనతో మిమ్మల్ని రంజింపచేసేది. అదే మీ వీయిల్ ఆఫ్ లౌ. హేలో వారు మాత్రమే సమర్పించగలేది. గాలిలో తేలియాడే సుఖానుభూతిని మీకు కలించేది. హేలో కోసమే ప్రత్యేకించిన సువాసనల శృంగారానుభూతిని అనుభవించండి. ప్రతి క్షణం మరువలేని మధురానుభూతిని కల్గించేందుకుకే. వీయిల్ ఆఫ్ లౌతో అలంకరించుకోండి. హేలో మాత్రమే వెదజల్లు సువాసన గల పన్నీటిజల్లు.
హేలో వీయిల్ ఆఫ్ లౌ టాల్క్
హేలో మాత్రమే వెదజల్లు సువాసనలు... అనురాగ వల్లరులు
ఆమెకోసమే
హేలో
వీయిల్ ఆఫ్ లౌ
టాల్క్
NEW
Halo
VEIL OF LOVE
TALC
HLG.4.TL (R)

సీరియల్.....



(గత సంచిక తరువాయి)

కుసుమకి లోలోపలి నుండి కోపం పడగవిప్పి బుసకొట్టే పాములా పైకి వచ్చింది.

"వాళ్లు చాలా గొప్పవాళ్లు బాబాయ్. నువ్వంతకన్న గొప్పవాడివి. ఇంతేనా నాసంగతి నీవు తెలుసుకున్నది ? వాళ్లకి నువ్వే పరిస్థితుల్లో డ్రయివరు పనిచేశావో నచ్చ చెప్పమన్నాను. ముహూర్తాలు కూడాపెట్టుకున్నాక పెళ్లి తప్పిపోతే ఆడపిల్ల బ్రతుకేమవుతుందో వాళ్లని ఆలోచించుకోమని చెప్పమన్నాను నిన్ను. అంటే నిన్ను సర్ది చెప్పమన్నాను వాళ్లకి. అంతేకానీ డబ్బు పడేసి ఎద్దుల బేరం చేసుకు రమ్మన్నానా ? ఆగు...మరేం చెప్పకు. అంత చెప్పినా వాళ్లు ఒప్పుకోలేదంటావు. అంతేగా. ఒప్పుకోకపోతే ఇచ్చిన పదివేలు పట్టుకుని చక్కగా వెనక్కి వచ్చేసి వుండవలసింది. నేను చాలా సంతోషించి వుండేదాన్ని.

నేను చచ్చినా ఈ పెళ్లి చేసుకోను. జీవితాంతం పెళ్లి లేకుండా సన్యాసినిలా బ్రతుకుతాగానీ ఆ చచ్చు పెళ్లికొడుకు చేత నా మెడలో పుస్తెమాత్రం కట్టించుకోను. ఏమిటి బాబాయ్ ? అలాచూస్తావు. పౌరుషం వున్న ఏ ఆడపిల్లా ఆపని చేయదు. మరో అయిదువేలిస్తే నువ్వు డ్రయివరుగా పనిచేసిన సంగతి వాళ్లు మర్చిపోతారా? రేపు పెళ్లయింతర్వాత 'మరో అయిదువేలిస్తేగాని అమ్మాయిని మా అబ్బాయితో కాపరం చెయ్యనివ్వం' అంటారు. అప్పుడేం చేస్తావు? ఇస్తావు. అలా ఎన్నాళ్లు? ఎన్నేళ్లు? ఎన్నిరోజులు నెలలు జరిగినా నువ్వు ఒకప్పుడు డ్రయివరువి, ఆ వంశంలో పుట్టినదాన్ని నేను అన్నది ఆ మూర్ఖుల మనసులో చెరిగిపోదు. డబ్బుతో చెరిపేద్దాం అన్నది తెలివి తక్కువ.

మనిషికోసం, మనసుకోసం అయినప్పుడు ఏపనైనా చేయొచ్చుగానీ డబ్బుతో ముడి పెట్టుకునే వంశంలోకి చచ్చినా వెళ్లను బాబాయ్. తర్వాత నీ యిష్టం"

ఆ ఆవేశాన్ని చూస్తున్న కృష్ణకి ఏం చెయ్యాలో తోచలేదు. ఏలాగో కుసుమకు నచ్చ చెప్పాలి.

"పెదపాపా, ఇప్పుడందరూ డబ్బు పుచ్చుకుంటున్నారు. తప్పేమీ లేదు. ఒక్క పది వేలు ఇచ్చుకున్నాక మరో అయిదు వేలివ్వడం కష్టమేమీకాదు మనకి. డబ్బు ఎలా వస్తుందని నువ్వు బాధపడుతున్నావేమో! దాన్ని గురించి నువ్వేం బెంగ పడకు. విషయం అర్థం చేసుకో. ముహూర్తంకూడా పెట్టేసుకున్నాం. బావుండదు. ఆవేశం తగ్గించుకుని తెలివిగా ఆలోచించు. పెళ్లంటే నూరేళ్ల పంట" నచ్చచెబుతున్న రాధాకృష్ణని మధ్యలో ఆపేసింది కుసుమ.

"అదే బాబాయ్! నేను చెప్పేదికూడా. పెళ్లంటే ఒక్కనాటి సౌభాగ్యం కాదు. నూరేళ్ల పండగ. నేను ఆవేశంలో ఏదో మాట్లాడుతున్నా ననుకుంటున్నావేమో! పొరబాటు. ఎంత ఆవేశంలోవున్నా వివేకం పోగొట్టుకోను బాబాయ్. నువ్వన్నది నిజమే. ఇప్పుడందరు కట్నం పుచ్చుకుంటున్నారు. కట్నం పుచ్చుకునే మగాణ్ణి పెళ్లి చేసుకోనని నేనేమీ వీరనారిలా శపథం చేయలేదు. నీకు తెలుసుకదా! కట్నం పదివేల రూపాయలు వాళ్లకు ఇచ్చినట్లు నాకు తెలుసు. కట్నం పుచ్చుకోవటం గొప్పపనేమీ కాదని నాకు తెలుసు. అయినా నాన్న డబ్బు ఇచ్చినట్లు తెలిసి, నాకిష్టంలేకపోయినా, వూరుకున్నాను. ఎందుకు? నేనేమీ చెయ్యలేని పరిస్థితి. కట్నం పుచ్చుకోటం ఒక దురాచారంగా మన సాంప్రదాయంలో స్థిరపడి పోయింది.

నేనొక్కదాన్నీ కంకణం కట్టుకుని ఎదురు నిలిచి పోరాడలేను. అలాచేసి నాన్నను, తాతయ్యను కష్టపెట్టదలుచుకోలేదు. ఒప్పుకున్నాను. అంతతో అది ఆగలేదు. ఏదో ఒక వంకతో మళ్లీ కొంతడబ్బు లాగుదామని వాళ్ల ఉద్దేశం. వారి మనసులో వున్న ఉద్దేశం తెలిశాక, ఇంత స్పష్టంగా తెలిశాక ఇంకా ఎలా ఒప్పుకోమంటావు? ఇదికేవలం సాంప్రదాయం కోసం కట్నం పుచ్చుకోడంకాదు. ఎదుటి వారి బలహీనతని ఆసరాగాచూసుకుని డబ్బు గుంజుదామని చూడటం. అది తెలిసీ, అటువంటి మనసులమధ్య నేను నిలవలేను బాబాయ్! అంతే నేను చెప్పేది. ఇది కేవలం నాబ్రతుకు సమస్య. డబ్బు పడేసి మీరు, పెద్దవాళ్లు చెయ్యిదులిపేస్తే కాదు. అసలు తతంగం అంతా ఆ తర్వాతే ప్రారంభమవుతుంది. నాకు తెలుసు. వద్దు బాబాయ్. ఆ జాతి, ఆవంశం వద్దు...ఇంక ఈ విషయంలో మీరెంత చెప్పినా నేను వినను."

ఢంకా మీద దెబ్బకొట్టినట్లు చెప్పికుసుమ ఇంట్లోకి దూసుకుపోయింది. రాధాకృష్ణ నీరుకారిపోయాడు. నవనాడులు చనలరహితమయ్యాయి. కుసుమ దృఢనిశ్చయం తెలుసుకున్న అతను లోలోపల ఆమెని అభినందించకుండా వుండలేక పోయాడు. ఎంత ఎదిగిపోయింది పెదపాప! తన మంచేదో చెడేదో వివేకంగా తెలుసుకోగలిగిన స్థితికి వెళ్లింది! నిజానికి రాధాకృష్ణకి కుసుమ అలానిర్భయంగా మనసులో వున్న మాటేదో చెప్పెయ్యడంచాలా నచ్చింది. తనకు మాత్రం ఏం బావుందీ ?

జరిగిన కథ : 10 రిట్రెంచ్‌మెంట్ వల్ల నిరుద్యోగి అయిన జూనియర్ ఇంజనీరు రాధాకృష్ణ డాక్టర్ శివరాం దగ్గర డ్రైవరుగా చేర్తాడు. డాక్టర్‌కి పక్షవాతంవచ్చి ఆయన కుటుంబం కాకినాడ వెళ్లిపోతుంది. మోహన్ ఆత్మహత్యా ప్రయత్నాన్ని వివరిస్తూ ఆనంద్ రాసిన జాబు అందుకున్న రాధాకృష్ణ వాల్తేరు వెళ్తాడు. మిత్రులు ముగ్గురూ కలసి వ్యాపారం ప్రారంభిస్తారు. మోహన్ వివాహితుడని తెలియని లత అతనికి దగ్గరవుతుంది. రాధాకృష్ణ ద్వారా విషయం తెలుసుకొని మోహన్ జీవితంలో నుంచి తప్పుకోవడానికి నిశ్చయించు కుంటుంది. రాధాకృష్ణకి తిరిగి ఉద్యోగం వస్తుంది. కుసుమకి వచ్చిన సంబంధం రాధాకృష్ణ ఒకప్పుడు డ్రైవర్‌గా పనిచేశాడన్న వంకతో తప్పిపోయే పరిస్థితి వస్తుంది. మరో అయిదువేలు ఎక్కువయివ్వడానికి సిద్ధపడి రాధాకృష్ణ ఆ సంబంధాన్ని ఖాయపర్చుకు రావడం కుసుమకి చాలా బాధని కల్గిస్తుంది.

సంబంధం తండ్రి, అన్న కుదుర్చుకొచ్చిన సంబంధం తన మూలాన విడిపోతోంది కాబట్టి వాళ్లక్కావలసిందేదో ఇచ్చి సరిచేద్దామను కొన్నాడు. అంతే.

సరే... ఇప్పుడీ విషయం ఇంట్లో ఎలా చెప్పడం ? ఆలోచనల్లో పడిపోయాడతను. కానీ ఆ బాధ్యతకూడా రాధాకృష్ణమీద పెట్టి అతన్ని ఇబ్బందిలో పెట్టలేదు కుసుమ. రాధాకృష్ణ గదిలోంచి దూసుకుపోయిన కుసుమ సరాసరి తాతగారి గదిలోకి వెళ్లి అక్కడేవున్న తండ్రికి కూడా వినిపించేటట్లు తన అభిప్రాయం చెప్పేసింది.

రంగనాథం, వీరభద్రయ్య తెల్లబోయారు.

"ఏమిటి పెదపాపా ? నీ ఉద్దేశం ఏమిటి ?"

తండ్రిగొంతు గట్టిగా వినబడింది. ఎప్పుడూ తన ఎదురుగా వచ్చి మాటయినా మాట్లాడని కుసుమ ఇప్పుడు, ఇలా ఇంత ధైర్యంగా తనతో మాట్లాడ్డం రంగనాథానికి విపరీతమైన ఆశ్చర్యాన్ని కలగచేసింది.

"అవును. నేనీ పెళ్లి చేసుకోను" మరో మారు చెప్పింది కుసుమ.

"అదే ఎందుకని? బాబాయ్ ఎంత కష్టపడి తెచ్చుకొచ్చిన సంబంధం. ఇప్పుడు కాదంటావా ? ఎలా ఇప్పుడు ?"

"బాబాయ్ కష్టానికి తగిన ప్రతిఫలం తర్వాత నేనిచ్చుకుంటాను. ఆ రుణం ఎలాగో లాగ తప్పక తీర్చుకుంటాను. కానీ ఇప్పుడీ పెళ్లిమాత్రం నే చేసుకోను."

"కుదరదు...ఇప్పుడు కాదంటే కుదరదు" గట్టిగ అరిచాడు రంగనాథం.

"ఎందుకు కుదరదు ? దాని కిష్టం లేనప్పుడు ఎలా చేస్తారు?" అప్పుడే గదిలోకి వచ్చిన శాంత మాటందుకుంది. మామగారి దగ్గర కెళ్లి తెచ్చిన కాఫీ గ్లాసు బల్లమీద పెట్టింది.

"ఏమిటే నువ్వనేది? ముహూర్తం పెట్టేసిన సంబంధం. ఇప్పుడు కాదంటే ఏం బావుంటుంది?" భార్యవంక తీక్షణంగా చూస్తూ అడిగాడు రంగనాథం.

"అందుకని పిల్లదాని నూరేళ్ల బ్రతుకు బుండలు చేస్తారా? ఏం ఫర్వాలేదు. పీటలమీద పెళ్లిళ్లు తప్పిపోతున్నాయి."

భగవంతుడా ! ఈతల్లీ కూతుళ్లకి మంచీ మర్యాద తెలిసినట్లు లేదు అనుకుని తల పట్టుకు కూర్చుండిపోయాడు రంగనాథం.

వీరభద్రయ్య అప్పటికి కొంచెం తేరుకున్నాడు. ఆయన ఈ రకమైన పరిస్థితి ఎప్పుడూ ఎదుర్కొనలేదు. ఊహించుకోలేదు కూడా. కుసుమంటే, ఆయనకి ఎంతో అభిమానం, ప్రేమ. ఎప్పుడూ పెద్దలెవర్నీ ఎదిరించి పల్లెత్తు మాటనలేదు. ఆ పిల్ల ఆణిముత్యం మంచి మనసు. విచక్షణాజ్ఞానం, వినయవిధేయతలున్న అమ్మాయి. అలాంటి కుసుమని ఏమంటాడాయన ? 'ఈ నిర్ణయం చాలా ఆలోచించే చేసుంటుంది పెదపాప' అనుకున్నాడు.

'పెదపాపా' పిలిచాడు.

దగ్గరకొచ్చింది. కుసుమకి తాతగారంటే ఎనలేని ఆపేక్ష, గౌరవం, ప్రేమ. ఆ అభిమానం ఆసరాగా తీసుకుని ఈ పెళ్లి చేసుకోమంటాడేమో తాతయ్య అని కుసుమకు భయం వేసింది. దాంతో ఏడుపు పైకి వచ్చేసింది ఆపినా ఆగకుండా.

"నువ్వేమయినా చెప్పు వింటాను తాతయ్యా. కానీ, కానీ...ఈ పెళ్లి మాత్రం చేసుకోను. చేసుకోమని బలవంతం చెయ్యకు నన్ను" అంది కన్నీళ్లతో.

"ఒద్దమ్మా ... ఒద్దు ... ఏడవకు. నిన్ను ఇంత కష్టపెట్టి మేంమాత్రం ఏం సుఖపడతాము...ఏడవకు...రంగా ! కృష్ణను పిలు" అన్నాడాయన.

'కృష్ణా' అంటూ రంగనాథం పొలికేక వేశాడు. పొలంకేకలు... పొలాల్లో పనిచేసే వారికది మామూలు.

లోపలికి వచ్చిన కృష్ణతో వీరభద్రయ్య "చూడు కృష్ణా ! పెదపాప... " ఆయన ఆపైన మాట్లాడలేక ఆగారు.

"అవును. నాన్నా...పెదపాప ఇష్ట ప్రకారమే కానిద్దాం" రాధాకృష్ణ అన్నాడు.

శాంతా, కుసుమ తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు.

"కృష్ణా, నువ్వుకూడా అలాగే అంటావా?" రంగనాథం దిగులుగా అన్నాడు.

"అవునన్నయ్యా. ఈరోజే కాకినాడ వెళ్లి విషయం చెప్పి వాళ్లకిచ్చిన కట్నం డబ్బులు



వెనక్కి తెచ్చేస్తాను. ఇంతకంటె మంచి సంబంధం వస్తుంది. ఇంక ఈ విషయం వదిలేయండి'' అన్నాడు రాధాకృష్ణ.

కుసుమ సుఖం కంటె పరువు ప్రతిష్టలు ముఖ్యం కావనే విషయం వాళ్ళందరికీ అర్థమయింది.

"ఎంత తెలివైన పిల్ల మీ కుసుమ ?" అందిలత విషయమంతావిని ముచ్చటపడుతూ.

"అదృష్టవంతురాలు. ఆడపిల్లలు ఆ మాత్రం పౌరుషం చూపాలి. నిజంగా మీరు గర్వపడాలి కృష్ణా" అని ప్రశంసించాడు రఘు.

డాక్టరు శివరాంకిమాత్రం ఎందుకోమనసు బాధపడింది. తండ్రి హృదయం. పాపం! ఆ తలిదండ్రులెంత బాధపడుతున్నారోనని ఆయన దిగులు పడ్డాడు.

"పోరా, నువ్వలాగే అంటావు. నిశ్చయం చేసుకున్న సంబంధం. తప్పిపోయిందంటే మాటలా ? చిన్నపిల్ల ఏదో అన్నా నువ్వు సర్దిచెప్పవలసింది కృష్ణా"

తండ్రి మాటలకు రఘుకు ఒళ్ళు మండింది. అయినా తండ్రి కెదురు చెప్పడం అతనికి ఎప్పుడూ అలవాటులేదు.

"లాభంలేదండీ. కుసుమ తెలివైనది. ఊరికే నిర్ణయానికి వచ్చేమనిషి కాదు. ఏది చేసినా ఆలోచించి చేస్తుందండి. పెళ్లి లేక పోతే జీవితాంతం సన్యాసినిలా వుండిపోతాగానీ ఆ పెళ్లి మాత్రం చచ్చినా చేసుకోనని కళ్ళ నీళ్ళు పెట్టుకుంటె ఎవరు మాత్రం ఏం చెబుతారండీ ?" అన్నాడు రాధాకృష్ణ.

అతని మనసు మనసులో లేదు. చాలా బాధపడుతోంది. అతనికి సంబంధం తప్పి పోవడం సంతోషంగానే వున్నా మరోసంబంధం దొరుకుతుందో లేదో అన్న బాధ మనసుని తొలిచేస్తోంది ఉదయంనుండీ.

"ఏం బాధపడకండి కృష్ణా ! ఇంతకంటె మంచి సంబంధం నేను వెతికి పెడతా" అంది లత.

"నేనూ అదే చెప్పాను లతా, కృష్ణకి. సరె ...ఇంక తర్వాతి కార్యక్రమం ప్రారంభిద్దామా ?" అనంద్ అడిగాడు.

"ఏమిటది?" అన్నట్లు చూచింది లత.

"అదేనండీ. డబ్బు వెనక్కి తెచ్చు కోవద్దూ?" నవ్వుతూ అన్నాడు రాధాకృష్ణ.

"మరే...నేను మర్చేపోయా"

"పదండి కృష్ణా. నేనూ వస్తా" అన్నాడు రఘు బూట్లు తొడుక్కుంటూ.

"రఘూ! దుడుకుతనం చెయ్యకక్కడ. మెత్తగా పని జరిగేటట్లు చూడు" అన్నాడు శివరాం.

"అలాగే" నవ్వుకుంటూ ఈల వేసుకుంటూ

వాళ్ళిద్దరి వెంట బయటకు నడిచాడు రఘు.

* * *

వచ్చిన ముగ్గురిని అతి సాదరంగా ఆహ్వానించారు వీరయ్య, రమేష్...అందరూ.

'ఇంత తొందరగా తెచ్చేయ్యాలాడబ్బు? మాట మీద నడుచుకునే మనుషుల్లాగే వున్నారే మీరు?'' అన్నాడు వీరయ్య.

రాధాకృష్ణకి, ఆనంద్‌కి విషయం ఎలా మొదలు పెట్టాలో తెలియక కొంత జాగు చేశారు. కానీ రఘు వూరుకుంటాడా?

''చిత్తం! మేము మాటమీద నడుచుకునే మనుషులమే. కానీ మేము డబ్బు తీసుకు రాలేదు.''

''మరి?'' విస్తుపోయారు వీరయ్య, రమేష్.

''కాదండీ... అదికాదు'' రాధాకృష్ణ మాట ముద్దగా వచ్చింది. జేబురుమాలు తీసి మొహం తుడుచుకున్నాడు.

వీరయ్యకి కోపం ముంచుకు వచ్చింది. డబ్బు లేకుండా ఈ నాటకమేమిటి? ఎగ్గొట్టెయ్యాలని చూస్తున్నారా ఏవో వూయ మాటలు చెప్పి?

''డబ్బు లేకపోతే ఎందుకు వచ్చినట్లు? ఆ అయిదువేలు ఇవ్వకపోతే మీరీ సంబంధాన్ని వదులుకోవచ్చు'' తీవ్రంగా అన్నాడు వీరయ్య.

''శుభం. అందుకోసమే వచ్చాం'' రఘు మాట అందుకుని అన్నాడు.

''ఆ...'' వీరయ్య నోరావలించాడు.

''అవునండీ. మా కుసుమ ఈ సంబంధాన్ని ఒప్పుకోవటంలేదు''ఇప్పటికి రాధాకృష్ణకి మాట వచ్చింది.

''ఏమిటి? పెళ్లికూతురు వద్దంటోందా? ఎంత ధైర్యం? ఎంత ధైర్యం?''

రమేష్ మొహం కోపంతో ఎర్రబడింది.

పెళ్లికూతురు పెళ్లివద్దనడం విడ్డూరం కాదూ? అందులో తాము ఒప్పుకున్న తర్వాత. ఆవిడకంత పొగరేమిటి? రమేష్‌కి తల కొట్టేసినంత పని అయింది.

''నన్ను వద్దందా? ఎందుకు? డబ్బు ఇవ్వలేకనే' అడిగాడు రమేష్.

''కాదండీ. డబ్బు రెడీగావుంది'' ఆనంద్ చెప్పాడు.

''మరి?'' ఇంకా ఆశ్చర్యపోయాడు రమేష్. అవమాన భారం మోయలేక పోతున్నాడు.

''మరో అయిదువేలివ్వడం ఆవిడకిష్టం లేదండీ'' రాధాకృష్ణ అన్నాడు.

''అదేమిటీ? మీరు ఒప్పుకున్నారుగా?'' రమేష్ అడిగాడు.

''పెళ్లిచేసుకునేది ఆవిడ కదండీ. డబ్బు పుచ్చుకునే సంబంధం ఆవిడకిష్టం లేదట'' రఘు మాట అందించాడు.

''ఓహో కట్నం లేకుండానే మీరు పెళ్లి చేసుకుంటారా?''

''నేను పుచ్చుకునేది ఆ అమ్మాయిని. డబ్బుకాదు'' నవ్వాడు రఘు.

అతని నవ్వు చూసిన వీరయ్యకు ఒళ్లు భగభగమంది.

''ఆహా. అయితే ఇంకెందుకు ఆలస్యం? కానివ్వండిమరి''

''అలాగే కానిస్తాం! ముందు మీరు పుచ్చుకున్నడబ్బు రాధాకృష్ణగారికిచ్చేయండి''

అవమానం ఒకవైపు, రోషం ఒకవైపు రమేష్‌ని తినేస్తున్నాయి.

''ఇచ్చేయ్యండి నాన్నా ముష్టి డబ్బు. ఏడుస్తూ ఇచ్చిన డబ్బు శుభం చేకూర్చదు. మనల్నింత అవమాన పరిచారు. తగిన శాస్తి జరుగుతుంది'' శాపాలు పెడుతూ రమేష్ వెళ్లిపోయాడు.

''ఎందుకు జరగదు? శాస్తి తప్పకుండా జరిగి తీరుతుంది. పెళ్లి నిశ్చయమై వెనక్కి వెళ్లిందని తెలిస్తే ఏనాడిదా దానిమెళ్లోపుస్తె కట్టడు'' అంతవరకు ఓర్చుకున్న రాధాకృష్ణ ఇంక నిలవలేకపోయాడు. వెంటనేలేచి

''వీరయ్యగారూ! పుస్తె కట్టకపోతే పోతాడు. మాబాధలేవో మేం పడతాం. మీరు మాత్రం మర్యాదగా మాట్లాడండి''

''ఆహా. మర్యాదట. మర్యాద. ఆపిల్లనెవరు చేసుకుంటారో చూద్దాం''

''ఏం? బెదిరిస్తున్నారా?''ఆనంద్ హుంకరించాడు.''

''వీరయ్యగారూ! మంత్రాలకి చింతకాయలు రాలవండీ. మంచి హృదయం వున్నవాళ్లెవరైనా ఆ అమ్మాయిని చేసుకుంటారు'' రఘు తీవ్రంగా అన్నాడు.

''ఆ వంశంలోని పిల్లను...'' ఏదో అనబోయాడు వీరయ్య.

''వంశం. వంశం అంటూ అన్నిసార్లెందుకంటారు?ఏమయింది మా వంశానికి.ఒకప్పుడు ఎప్పుడో నేను డ్రయివర్‌గా పనిచేస్తే వచ్చిన నష్టమేమిటి? అంతతో మా వంశ ప్రతిష్ఠ నాశనమయినట్లేనా?''


''కాక... ఉన్నమాట చెబుతున్నాను. ఆ పిల్లనెవరూ ఇంక చేసుకోరు.''

''ఎందుకు చేసుకోరండీ'' రఘు అడిగాడు గట్టిగా.

''ఎందుకు చేసుకుంటారు? డబ్బులివ్వడంలో నస. వంశంలో... ఎందుకులే మళ్లీ ఇవన్నీ. ఇన్ని కబుర్లు చెబుతున్నావు? నువ్వు చేసుకుంటావా? మీ నాన్న ఒప్పుకుంటాడా? అంత మంచి వంశమే అయితే నువ్వు చేసుకోకూడదూ ఆ పిల్లని?'' ఎగతాళిగా అడిగాడాయన రఘుని.

శ్రోతలు ముగ్గురు నిశ్చేష్టులయ్యారు. రఘుకి నోటమాట రాలేదు. రాధాకృష్ణకి,

[38 వ పేజీ చూడండి]



ఒక 'డాక్టర్' చెప్పిన కొన్ని 'డాక్టర్ కథలు'

పెద్దింటి రామమూర్తి-లక్ష్మణ్

సుబ్బారావు మొత్తం మీద డాక్టర్ సుబ్బారావని పించుకున్నాడు. డాక్టరన్న వాడికి ఓపికన్నది చాలా ముఖ్యమన్న సిద్ధాంతాన్ని గట్టిగా నమ్మినవాడు. అందుకే ఏడేండ్ల చదువు రాముడి వనవాసంలా పద్నాలుగేళ్లు చదివాడని ప్రతి పక్షాలవారు ఆరోపిస్తూ వుంటారు.

అతను చూస్తుండగానే కొత్త విద్యార్థులు పుట్టడం తన కళ్లముందే డాక్టర్లయి వెళ్లి పోవటం చూశాడు. తను రెండో సంవత్సరం చదువుతున్నప్పుడు మొదటి సంవత్సరపు కుర్రాళ్లను "బాగున్నావా తమ్ముడూ?" అని పలకరించేవాడు. ఆ తరువాత సుబ్బారావు ఆ తమ్ముళ్లు ఒకే క్లాసులో కూర్చుని పాఠాలు వినే స్థితికి వచ్చినప్పుడు "హలో బ్రదర్" అనటం అలవాటు చేసుకున్నాడు. వాళ్లు తనను దాటి వెళ్లిపోయినప్పుడు గౌరవంగా "గురువు గారూ" అనేవాడు.

"అనాటమీ"లో "ఆటాప్సీ" కావాలని వాదించి అక్కడే వుండిపోయాను కాని లేకుంటే ఈపాటికి సూపరింటెండెంటుగా వుండవలసిన వాడిని!" అంటూంటాడు సుబ్బారావు.

అసలు సుబ్బారావు డాక్టరయ్యేవాడు కాదు కాని వినుకొండను విక్రమార్కుడిలా రోజుకో శవాన్ని భుజంమీద వేసుకుని ల్యాబ్‌లో తిరిగే సుబ్బారావు ఫలితం లేదని పాసుచేసారని కొందరంటే — సుబ్బారావు పాసవ్వకుండా పోతూంటే — చివరకు ఏదో ప్రొఫెసరో ఎవరు ఎవ్వార్నో తెలియకుండా పోతున్నదని ప్రొఫెసరుగారే సర్టిఫికేటులో గట్టిగా వాదించి బయటకు నెట్టారని మరో వదంతి!

ఏమైతేనేం ఓ శుభముహూర్తాన మెయిన్ రోడ్డులో డాక్టర్ సుబ్బారావు ఎం. బి. బి. యస్. అన్న బోర్డు ప్రత్యక్షమైంది! పొద్దున్న ఎనిమిది గంటలనుంచి డిస్పెన్సరీలోనే కూర్చున్నాడు సుబ్బారావు. ఎవరైనా వస్తే తను లేకుంటే బావుండదని భోజనంకూడా అక్కడకే తెప్పించుకున్నాడు.

సాయంత్రమవుతూండగా ఒకాయన వచ్చారు.

నవ్వును మొహం నిండా పులుముకున్నాడు.

'రండి రండి' ఆహ్వానించాడు.

'ఇక్కడదాక వచ్చిన వాడిని లోపలకు రానా' అన్నాడాయన విసురుగా.

చురుక్కుమంది సుబ్బారావుకు. అయినా పట్టించుకోలేదు.

'బాగున్నారా?' సహజ ధోరణిలో అడిగాడు.

'బాగుందయ్యా ప్రశ్న. బాగుంటే ఇక్కడి కెందుకొస్తాను?' కస్సుమన్నాడు.

నాలుక కర్చుకున్నాడు సుబ్బారావు.

'ఏమిటి కంప్లైంట్?' నెమ్మదిగా అడిగాడు.

'అదినేనుచెప్పాలిసుంటేనీడాక్టర్లెందుకు?'

సుబ్బారావుకు సహనం సన్నగిల్లింది. వచ్చినప్పటి నుంచి తనమీద అయినదానికి కాని దానికి విరుచుకు పడుతున్నాడు.

'ఎందుకండీ అలా విసురుతుంటారు. నే నేమన్నానని?' గట్టిగానే అన్నాడు సుబ్బారావు.

ఒక్కమారు అంతెత్తు ఎగిరిపడ్డాడు వచ్చినాయన.

బయట బోర్డు పెట్టి రోజన్నా కాలేదు. అప్పుడే కళ్లు నెత్తి కెక్కాయన్నమాట. "ఈ వీధిలో నీ ప్రాక్టీస్ ఎలా నడుస్తుందో నేనూ చూస్తాను." అంటూ చరచరా వెళ్లిపోయాడు!

సుబ్బారావుకు మతి పోయినంత పనైంది. ఆయన ముక్కూ మొహం కూడా తెలియదే...! ఎందుకలా విరుచుకు పడ్డాడో. ఆ ప్రశ్నకు జవాబు తర్వాత స్నేహితులు చెప్పేదాక తెలియలేదు సుబ్బారావుకు...

ఆ వచ్చినాయన ఆ వీధిలోనే పనిచేస్తున్న మరో డాక్టరట!! ఆ వీధిలో మకుటంలేని మహారాజుగా వెలుగుతున్న ఆయనకు పోటీగా మరొకరొచ్చారని—వెళ్లగక్కిన అక్కసు అది. కాని ఆ ముసలి డాక్టరు అంతటితో వదలలేదు. తన దగ్గరకు ఓ రహస్య జబ్బు ట్రీట్‌మెంటుకై వచ్చే ఓ మున్సిపల్ కౌన్సిలరును పట్టుకొని ఆ వీధి చివరన వుండే 'పెంటకుండీ'ని సుబ్బారావు ఇంటి యెదుట వేయించాడు. దాంతో ఆగాలి, పీల్చి పీల్చి డాక్టరే రోగిగా మారుతాడని అతగాడి ప్లాను. రోజులు గడుస్తున్నాయి. రోగులు వచ్చి వెళుతున్నారు. కాని అదేం ప్రారబ్ధమోగాని అతని సంపాదన మాత్రం అంతంతగానే వుంది.

దిగులుపడ్డ స్నేహితుడికి సలహా ఇచ్చాడు మరో స్నేహితుడు. 'డాక్టరుగా బోర్డు కట్టే ముందు, పూర్వకాలం రాజకుమారుడిలా లోకం చుట్టి జ్ఞానం సంపాదించాలి. అందుకని నువ్వుకూడా నాలుగూర్లు తిరిగి ఆవూరి పెద్ద డాక్టర్లు అంత వాళ్లెలా అయ్యారో తెలుసుకో! ఫో' అన్నాడు.

ఇది బాగానే వుందనిపించింది సుబ్బారావుకు.

'అయితే ఒక్కటి మాత్రం గుర్తుంచుకో' అన్నాడు.

'ఏమిట'న్నట్లు చూసాడు.

'ఏదన్నా హోటలుకు వెళ్లి ఫలానా తినుబండారం చాలా బావుంది. ఎలా తయారు చేసారని అడుగు. చస్తే చెప్పరు వాళ్లు. అలాగే ఇదికూడా. నువ్వు డాక్టరన్న విషయం బయట ఎక్కడా తెలియకూడదు.'

'సరే'నన్నట్లుగా తలూపాడు సుబ్బారావు.

* * *

ఆ వూర్లో ఆ డాక్టరు పేరుమోసినాయన. ప్రస్తుతం ఆయన కన్సల్టింగ్ రూములో వున్నాడు సుబ్బారావు.

'మీ పేరు?'

చెప్పాడు.

'ఏమిటి రోగం?'

'జబ్బుని అడగ కూడదూ' పళ్లు నూరుకున్నాడు సుబ్బారావు లోలోనే...

'దగ్గు' అన్నాడు కొంచెం దగ్గి కుర్చీలో అటు ఇటు కదిలి...

'దగ్గా?' నన్నాడు ఆయన షాక్ తిన్నట్లు.

'అహా దగ్గే...' నన్నాడు సుబ్బారావు కాదనగలవా? అన్నట్లు!

'ఒకసారి దగ్గి చూపించండి' అన్నాడు అపనమ్మకంగా డాక్టర్.

దగ్గాడు సుబ్బారావు...

'అలా కాదు. ఫ్రీగా'

అయిదునిముషాలపాటు అనర్గళంగా దగ్గాడు సుబ్బారావు.

(29 వ పేజీ చూడండి)

బంగారు కలలు

యద్దనపూడి సులోచనారాణి

(గత సంచిక తరువాయి)

ఖరీదైన కారులో, మెరవుతీగెలా, వంటరిగా కూర్చునివున్న సరోజని చూసేసరికి శేషగిరికి మతి పోయినంత పనైంది!

రోజీ ఎక్కిన కారు నంబరుని ఎక్కడ మర్చి పోతానో అన్నట్టు గబగబా నాలుగైదుసార్లు వల్లె వేసుకున్నాడు.

గడ్డం మాసి, బట్టలు దుమ్ము కొట్టుకుని, బికారిలా వున్న శేషగిరిని సరోజ చూడలేదు! చూసినా గుర్తుపట్టగలిగేది కాదేమో! తన జీవితంలో, దురదృష్టం మరోసారి పిశాచంలా వికటంగా నవ్వుతోందని తెలియని సరోజ, కూతురు భవిష్యత్తు గురించిన నిశ్చింతతో, ఆనందంతో, మనసు తేలికగా అవగా, సంతృప్తిగా, వెనక్కు జారగిలబడి కూర్చుంది!

23

గదిలో మంగమ్మ సరోజ చీరెలు యిస్త్రీ చేస్తోంది! క్షణం క్రితం ఆ గదిలో నుంచి కూనిరాగం తీస్తూ, హుషారుగా వెళ్లిన సరోజ, వున్నట్టుండి భీతహరిణిలా పరుగెత్తుకు వచ్చింది! తల్లిని చేరిన లేగదూడలా, చప్పున మంగమ్మని పట్టుకుంటూ, 'మంగమ్మా! త్వరగా వాకిట్లోకి వెళ్లు! అతనితో, అతనడిగే పేరు గలవాళ్లు ఎవరూ యిక్కడ లేరని చెప్పు! త్వరగా! ఊ!' అంటూ తొందర చేసింది.

సరోజ ముఖంలో భయం చూసి మంగమ్మ ఆశ్చర్యపోయింది.

'ఎవరమ్మా అతను?' అంది.

'ఎవరా? నా పాలిట భూతం! అతన్ని లోపలకు రానివ్వకు మంగమ్మా! నేను యిక్కడ వున్నానని తెలియనీయకు! ఎలాగైనాసరే! యిది అతను అనుకునే యిల్లు కాదని తెలియచెప్పి పంపేసెయ్యి.'

'అలాగేనమ్మా!' అంటూ మంగమ్మ బైటకి వచ్చింది.

ముందు హాల్లో, సోఫాలో, కాలుమీద కాలు వేసుకుని, దర్జాగా, శేషగిరి కూర్చునివున్నాడు.

'ఎవరు కావాలి మీకు?' అంది మంగమ్మ కాస్త కరుగ్గానే.

'సరోజని పిలు.'

'సరోజా! ఆ పేరు గల వాళ్లెవరూ లేరే యిక్కడ! యిది మిస్. రోజీ యిల్లు!'

'అదేలే! శ్రీమతి సరోజ మిస్. రోజీ అయింది! నే నావిడకి కావల్సినవాడినిగాని, నువ్వెళ్లి శేషగిరి వచ్చాడు రమ్మంటున్నాడని చెప్పు!'

'బాబూ! మీ రెవరోగానీ —'

'షటప్! అధిక ప్రసంగం చేయకు! ఆవిడ అసలు పేరు, వూరు నాకు బాగా తెలుసు! నే నామె భర్తని! వెతుక్కుంటూ వచ్చానని, ఆవిడని చూడందే వెళ్లనని చెప్పు.' అని ఆజ్ఞాపించాడు.

మంగమ్మకి ఒళ్లు మండింది.

'మీ రెవరైనా కానీయండి! అమ్మగారు యింట్లో లేరు! యిప్పుడు రారు!'

'అబద్ధాలాడావంటే పళ్లు రాల్తాయి! సరోజ యింట్లో వుంది! నేను చూసాను! పిలు బైటకి! ఆవిడ రాకపోతే నేనే లోపలకి వస్తానని చెప్పు.'

మంగమ్మ యిక ప్రసంగం పెంచటం యిష్టం లేక, లోపలకి వెళ్లింది.

శేషగిరి ఆతురతగా యిల్లంతా కలియచూసాడు! ఆ హాలులో వున్న సామాను, ఆ వైభవం చూసేసరికి అతనికి పరమానందం వేసింది! జేబులో నుంచి సీసా తీసి ఒక గుక్క తాగి, మళ్లీ జేబులో పెట్టుకున్నాడు. 'ఫర్వాలేదు! బాగానే సంపాయించినట్టుంది! ఏం జాతకం! తంతే బూర్లగంపలో పడ్డట్టు, యింట్లోంచి గెంటితే, వచ్చి యింతచక్కటి మేడలో రాణివాసం వెలగబెడుతోంది! అదృష్టవంతులు ఎప్పుడూ అంతే! వాళ్ల సుడే అంత! కష్టాలే సుఖాలు అయిపోతాయి! కాస్త కాళ్లా వేళ్లా బడి, లెంపలేసుకుని, మంచి చేసుకుంటే నేను సుఖంగా బ్రతకవచ్చు!' అనుకున్నాడు.

ఇంతలో వాకిట్లో టాక్సీ వచ్చి ఆగింది. అందులోనుండి రవి దిగాడు. గబగబ లోపలకు వెళుతున్న రవి, హాలులో సోఫాలో కూర్చునివున్న శేషగిరిని చూసి ఆగిపోయాడు. గడ్డం మాసివున్న అతన్ని వెంటనే గుర్తుపట్టలేకపోయాడు.

'ఎవరూ?' అన్నాడు.

'నేను రవీ! శేషగిరిని! సరోజ భర్తని!'

'నువ్వా!'

'అవును నేనే! ఈ రూపంలో మీ దగ్గరకి రావటానికి ఎంతో సిగ్గుపడుతున్నాను! కానీ ఏం చెయ్యను! తప్పలేదు! అయితే — సరోజ నీ అండలోనే బ్రతుకుతోందన్నమాట! పోనీలే! సరోజని సమర్థురాలిని చేసావు.'

రవి ఆగ్రహం నిగ్రహించుకున్నాడు.

'ఎందుకొచ్చావు?' అన్నాడు.

'భలే మాట అడిగావు! ఎందుకొస్తాను? భర్త భార్య దగ్గరకి ఎందుకు వస్తాడు?'

'భార్య! యిన్నాళ్లూ ఎక్కడికి పోయిందా భార్య! ఇంట్లోంచి తన్ని తగిలేసినప్పుడు ఏమైందా భార్య?'

'క్షమించు రవీ! అంతా నా ఖర్మ! అప్పుడు తాగిన తిమ్మిరిలో ఏదేదో చేసాను. కానీ సరోజమీద నాకు ప్రేమ లేదంటావా? సరోజ వెళ్లిపోయిన తర్వాత ఎంత ఏడ్చాననుకున్నావు? అప్పటినుంచీ కళ్లలో వత్తులేసుకుని గాలిస్తూనే వున్నాను! నా సరోజకి ఏ బాధా లేకుండా చెయి భగవంతుడా అని కన్పించిన చెట్టుకీ—పుట్టకీ మొక్కుతూనే వున్నాను! నువ్వు సరోజకి చెప్పు రవీ! ఒక్కసారి ఆ దేవత కాళ్లమీద పడి, ప్రాయశ్చిత్తం చేసుకుంటాను! రవీ! నేనప్పటి శేషగిరిని కాను! సరోజ వెళ్లిపోయిన తర్వాత జీవితంలో చాలా దెబ్బలు తిన్నాను! మారిపోయిన నన్ను సరోజ అర్థం చేసుకునేట్టు చెయ్యి. మా కాపురం నిలబెట్టి పుణ్యంకట్టుకో!' అంటూ కన్నీళ్లతో రవి చేతులు పట్టుకున్నాడు.

రవి అతని చేతులు విడిపించుకుని లోపలకి వెళ్లాడు.

లోపల సరోజ దిండులో ముఖం దాచుకుని ఏడుస్తోంది. మంగమ్మ అనునయిస్తోంది.

'ఎందుకు సరోజా ఏడుపు?' అన్నాడు రవి.

'ఎందుకా! యిన్నాళ్లకి భర్త తిరిగివచ్చినందుకు! నామీద ప్రేమ ఒలకబోస్తూ మాట్లాడుతున్నందుకు ఆనందంగా వుంది!' సరోజ లేచి కూర్చుంది.

'రవీ! నువ్వా మాటలన్నీ నిజమేనని నమ్ముతున్నావా?'

'అతను చాలా మారినట్టున్నాడు సరోజా!'

'ఎంత అమాయకుడివి! పులి పుట్టుకతో వచ్చిన చారలు మార్చుకోగలదా! నీకు తెలియదు అతని స్వభావం! నాకు బాగా తెలుసు.'

'అతను మారినప్పుడు, ఆదరించటం నీ ధర్మం సరోజా!'

'అతను జన్మలో మారడు. అతను ఇక్కడకు రావడంలో గల అర్థం ఏమిటో నాకు బాగానే తెలుస్తోంది. ఈ యిల్లు, ఈ వైభవం చూసి, నేనేదో

జరిగిన కథ: 9 రవి, వేణు పురుషోత్తంగారి కుమారులు. సరోజ, డాక్టర్ ప్రసాద్‌లు కూడా పురుషోత్తంగారివద్ద పెరిగారు. స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీస్‌లో ఉద్యోగానికి హైదరాబాద్ వెళ్లిన రవి పురుషోత్తంగారి చిన్ననాటి స్నేహితుడు రాజారావుగారినీ, వారమ్మాయి జ్యోతి మొదలైనవారిని కలుసుకుంటాడు. ప్రేమించిన శేషగిరిచే మోసగింపబడి ఆత్మహత్యకు పూనుకున్న సరోజ ఎలా క్లబ్ డాన్సర్‌గా మారిందీ రవికి చెప్తుంది. చిదంబరం ఇంట్లో చదువుకని ఉంచితే, రాధతో చనువు పెంచుకుంటుంటాడు వేణు. సరోజ కూతురు ఉమని పెంచటానికి తీసుకు వెళ్తాడు రవి. రాజారావుగారి సహాయంతో ఫ్రూట్ కానింగ్ ఇండస్ట్రీ స్థాపిస్తాడు రవి. జైలు నుంచి విడుదలయిన శేషగిరి కారులో వెళ్తున్న సరోజని చూస్తాడు.

బాగా సంపాయించి వుంటావని, అది పీక్కుతిందామని వచ్చాడు.'

'ఒకసారి ప్రయత్నించి చూడు! కనీసం ఉమకోసమైనా!'

'ఉమకోసమే నేను జాగ్రత్తపడుతున్నాను.'

ఇంతలో శేషగిరి లోపలికి రానేవచ్చాడు. అప్పటికే అతను జేబులో వుంచుకున్న సీసా ఖాళీ చేసాడేమో — మనిషి తూలుతున్నాడు. మాట తడబడుతోంది!

'నేను మారాను సరోజా! నన్ను క్షమించి నీ దగ్గర వుండనీ!' అంటూ చేతులు జోడించాడు.

సరోజ చప్పున కళ్ళు తుడుచుకుంది.

'మారారా! రవి అదేమాట యిప్పుడే చెబుతున్నాడు! రండి! మీరు రావటం నా అదృష్టం! నేను చాలా ఆపదలో వున్నాను! బహుశా దేవుడే మిమ్మల్ని యిలా నన్ను ఆదుకోటానికి పంపాడు కాబోలు.' అంది సరోజ నటిస్తూ.

'ఆపదలా! నీకేం ఆపదలు? డబ్బున్నవాళ్ళకేం బాధలు?' అతను ముఖం చిట్లించాడు.

'నాకేం బాధలున్నాయో మీకేం తెలుసు? అన్నీ సమస్యలే అయిపోయినాయి! విలాస జీవితానికి అలవాటుపడి, ఒళ్ళు తెలియకుండా, వచ్చినదంతా విచ్చలవిడిగా ఖర్చుపెట్టేసాను! పీకలవరకూ అప్పుల్లో మునిగిపోయాను! ఈ యిల్లు, సామానుతో సహా నిన్ననే వాళ్ళు స్వాధీనం చేసుకున్నారు. ఖాళీ చేయటానికి నాకు రెండు రోజులు గడువు యిచ్చారు. రవి ఏదయినా మార్గం చూపిస్తాడేమోనని పిలిపించాను! ఇంతలో మీరే వచ్చారు. యిక నాకు దిగులేముంది? రవీ! నీ ఫాక్టరీలో శేషుకి ఏదయినా వుద్యోగం చూపించు! వచ్చిన తృణమో పణమో, పెట్టుకుని, కలో, గంజో తాగుతూ బ్రతుకుతాం!'

శేషగిరి ముఖంలో రంగులు మారాయి.

'ఏమిటీ! ఈ యిల్లు అప్పులవాళ్ళు స్వాధీనం చేసుకున్నారా?'

'అవునండీ! మనం కాపురం పెట్టాలంటే కుంపటితోసహా అన్నీ కొత్తగా కొనుక్కోవాల్సిందే!'

'ఈ యిల్లు ఒక్కటేనా నీకుంది? నువ్వు యింకా చాలా సంపాయించావని విన్నానే? అదంతా ఏమైంది?'

'చెప్పానుకదండీ! అంతా ఖర్చయిపోయింది!'

'నోర్మూయ్! ఖర్చుట! ఖర్చు! నేనంత వెర్రి వెంగళాయిని అనుకున్నావా? నీ డబ్బంతా యీ రవికి తినబెట్టి వుంటావు! వాడు తినేసి, హాయిగా ఫాక్టరీ కట్టుకుని, నీకు జోలె యిచ్చినట్లున్నాడు.'

'గిరీ!' రవి కోపంగా అరిచాడు.

'ఏం నా మాట అబద్ధమా? నువ్వు ఫాక్టరీ పెట్టలేదూ? నీకు హఠాత్తుగా అంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? దానికి మొదటి నుంచీ నీ మీద మోజే!'

'యిప్పుడేగా సరోజ నా భార్య అన్నావు! దేవత అన్నావు!' రవి పళ్ళ బిగువున అడిగాడు.

'అవును! అన్నాను! ఎందుకు? ఏమైనా — కాస్తో — కూస్తో వుందేమోనని! భార్యట! భార్య! ఎవడిక్కావాలి యీ చెడిపోయిన భార్య! వున్నదంతా

బంగారు కలలు

మువ్వు కాజేసి, దాని చేతికి చిప్ప యిచ్చి నా మెడకి అంటగట్టాలని నువ్వు చూస్తున్నావా! మీ చావు మీరు చావండి! మధ్య నా కెందుకు!'

'అయితే నడు బైటకి!'

'నడుస్తాను! నడుస్తాను! కానీ — రవీ! యిదిమాత్రం బాగా గుర్తు వుంచుకో! నా భార్య చేత బాగా డబ్బు సంపాయించి, అదంతా నువ్వు కాజేసి కులుకుతూవుంటే, చూస్తూ వూరుకునే దద్దమ్మని అని మాత్రం అనుకోకు! జాగ్రత్త! ఎప్పటికైనా, నీ గోళ్ళూడకొట్టి అదంతా లాక్కోపోతే నా పేరు శేషగిరే కాదు!' అంటూ గుండెల మీద చరుచుకుంటూ వెళ్ళిపోయాడు.

'చూసావుకదూ రవీ! అతని అసలు స్వరూపం!'

'ఛీ—ఛీ! ఏం మనిషి!'

'రవీ! వున్నదంతా స్కూలుకి విరాళం ఇచ్చేసాను! నాదగ్గర యిప్పుడేమీ లేదంటే, ఎవరూ నమ్మటంలేదు! శేషు నన్ను చూసాడు! యిక వెంటాడక మానడు! చావు ఒక్కటే నాకు శరణ్యంలా వుంది.' అంటుండగానే సరోజ కళ్లలో గిర్రున నీళ్లు తిరిగాయి.

'ఛీ—ఛీ! ఏం మాటలవి సరోజా! ఈ కాస్త దానికే అంత బెంబేలుపడితే ఎలా? నువ్వు మారావు! నిజమే! కానీ నీ పరిసరాలు మారలేదు! నువ్వు యిట్లా వున్నంతకాలం లోకం నిన్ను రోజీగానే చూస్తుంది!'

'నేనేం చెయ్యను రవీ!'

'నేను చెబుతానుగా! ప్రసాద్‌తో మాట్లాడాను! అతను నిన్ను నర్స్ ట్రెయినింగ్‌కి పంపిస్తానన్నాడు! ట్రెయినింగ్ అయి వచ్చిన తర్వాత తన నర్సింగ్ హోమ్‌లోనే నిన్ను నర్స్‌గా తీసుకుంటానన్నాడు! యిక నీ భవిష్యత్తు గురించి నువ్వు దిగులుపడాల్సిందేమీ లేదు!'

ప్రసాద్ పేరు వినగానే సరోజ త్రుళ్లిపడింది.

'రవీ—' సంశయంగా చూసింది.

'ఇందులో నువ్వు అభిమాన పడాల్సిందేమీ లేదు సరోజా! ప్రసాద్ చాలా మంచివాడు! ముఖ్యంగా నా ప్రాణమిత్రుడు! ఈ పరిస్థితుల్లో నీకు నాలా చూసేవాళ్ల అండ చాలా అవసరం! మన పరిచయం అజ్ఞాతంగానే వుండాలంటే — నువ్వు ప్రసాద్ దగ్గర వుండటమే మంచిది!'

'నీ యిష్టం రవీ!' అంది సరోజ మెల్లగా.

24

డాక్టర్ ప్రసాద్ క్లినిక్!

అందులో అడుగు పెట్టగానే చూసేవారికి మొట్టమొదట పురుషోత్తంగారి ఫోటో కనిపిస్తుంది. ఎవరైనా ఆ ఫోటో ఎవరిదని అడిగితే ప్రసాద్. 'నాకీ చదువు చెప్పించిన దైవం!' అని కృతజ్ఞతగా సమాధానం చెప్పేవాడు.

ప్రసాద్ ప్రాక్టీసు మూడు పువ్వులూ, ఆరు కాయలూ అన్నట్టుగా వర్ధిల్లుతోంది. ఎప్పుడు చూసినా క్షణం తీరని డాక్టరు అయాడతను. నలుగురిలో, సమర్థుడూ, మంచివాడు అనే పేరు తెచ్చుకున్నాడు. వూళ్లో ధనిక కుటుంబాలవారిలో, ఆడపిల్లలున్న తలితండ్రులు అతనితో పరిచయం పెంచుకోటానికి తహతహ లాడుతున్నారు.



ఆ రోజున – ప్రసాద్ రోగులని పరీక్ష చేస్తున్నాడు. ఇంతలో రవి లోపలకు వచ్చాడు.

రోగికి అవసరమైన ప్రిస్క్రిప్షన్ వ్రాస్తున్న ప్రసాద్, తలెత్తి రవిని చూడగానే, 'రా! రా!' అంటూ ఆహ్వానించాడు.

గదిలో వున్న మరో పేషెంట్‌ని కూడా, పరీక్ష చేసి పంపేయగానే, ప్రసాద్ వచ్చి కూర్చుంటూ, 'ఏం రవీ? ఏదీ నువ్వు చెప్పిన అమ్మాయి? ఈ రోజు కూడా తీసుకురాలేదా? నర్సు ట్రెయినింగ్‌కి అప్లికేషన్ తెప్పించి అన్నీ సిద్ధం చేసాను.' అన్నాడు.

'థ్యాంక్స్ ప్రసాద్! నీ మేలు మరవలేను!'

'చాలించు నీ గొప్పలు! ఈ కాస్తకే నువ్వింత గొప్పగా భావిస్తే – నన్ను దగ్గరకు తీసి డాక్టర్ చదివించిన మిమ్మల్ని నేనెలా భావించాలి? యింతకీ ఆ అమ్మాయి ఎవరు?'

రవి టేబిల్ మీద వున్న కాగితాలు సర్దాడు.

'ఒకప్పుడు నీ కిచ్చి పెళ్ళి చేయాలనుకున్నాం!' అన్నాడు సీరియస్‌గా.

'వాట్!'

'అవును ప్రసాద్! నాన్న మీ యిద్దరికీ పెళ్ళి చేసి, మిమ్మల్ని భార్యాభర్తలుగా కళ్ళారా చూసుకోవాలని ఎంతగానో అనుకున్నాడు! ప్చ్! విధి వేరుగా వుంది! నాన్న కోరిక ఫలించలేదు!'

'రవీ! ఏమిటి నువ్వనేది? సరోజ సంగతి కాదుకదా నువ్వు మాట్లాడేది!'

'సరోజే! ఈరోజు నిన్ను నర్సు ట్రెయినింగ్‌కి పంపమని వేడు అర్థిస్తోంది సరోజనే!'

'సరోజా! ఏది? ఎక్కడుంది?'

'బైట కూర్చుని వుంది. యిక్కడ పేషెంట్స్ వున్నారని అక్కడ కూర్చోపెట్టి వచ్చాను. వుండు పిలుస్తాను.' రవి లేచివెళ్ళాడు.

రవి, సరోజని వెంటబెట్టుకుని తీసుకు వచ్చాడు.

ప్రసాద్ మనసంతా ఎలాగో అయింది! క్షణం సేపు నోట్లోంచి మాట రానివాడిలా అయాడు!

సరోజ కళ్ళలో అభిమానం స్పష్టంగా కనిపిస్తోంది!

ప్రసాద్‌ని చూడగానే తల దించుకుంది.

'కూర్చో సరోజా!' అన్నాడతను కుర్చీ చూపిస్తూ.

సరోజ కూర్చుంది.

'నువ్వేదో అడగాలనుకున్నావుగా! అడుగు!' అన్నాడు రవి.

'సరోజా! నువ్వీ ట్రెయినింగ్‌కి వెళ్ళేముందు ఒకటి బాగా ఆలోచించుకోవాలి! యిది చాలా సహనం కావాల్సిన వృత్తి! అసహ్యం అనేదాన్ని వదులుకోవాలి! నిస్వార్థంగా, నిష్కల్మషంగా, మానవ సేవే మాధవ సేవ అని నమ్మగలిగినవాళ్ళే ఈ వృత్తిలోకి అడుగుపెట్టాలి! నీ కిష్టమేనా?' అన్నాడు.

సరోజ తల దించుకునే అంగీకారంగా తల వూపింది.

ప్రసాద్ టేబిల్ సొరుగు లాగి, అందులో నుంచి అప్లికేషన్ ఫారాలు తీసాడు.

'ఇదుగో! యిక్కడ సంతకం పెట్టు.' అంటూ చూపించాడు.

సరోజ పెన్ అందుకుని, సంతకం పెట్టసాగింది.

తల దించుకుని, సరోజ సంతకం పెడుతుంటే, తదేకంగా చూస్తున్న ప్రసాద్ ముఖంలో విషాదం ఆవరించుకోసాగింది. విధి ఎంత చిత్రమైనది! మనుష్యుల్ని బొమ్మల్నిగా చేసుకుని, ఆడుకుని, వినోదంగా చూస్తుంది! లేకపోతే ఏమిటిది? తన యింటికి వధువుగా, తన జీవితానికి దేవతగా రావాల్సిన అమ్మాయి! తన కలలు పంచుకోవాల్సిన సరోజ!

కొద్ది సంవత్సరాల క్రితం, చదువుకునే రోజుల్లో, రవి ఒకసారి, 'ప్రసాద్! నాన్న సరోజని నీకిచ్చి పెళ్ళి చేయాలనుకుంటున్నారు! నీ ఉద్దేశ్యం ఏమిటి?' అని అడిగినప్పుడు ఎంత సంతోషించాడు! ఎన్ని వూహించుకున్నాడు!

రవి వూరు వెళుతూ, 'నాన్నకి చెప్పి వెంటనే లగ్నం పెట్టించమంటాను.' అని వెళ్ళాడు.

కానీ – ఆ తర్వాత ఏమైందో ఏమో! ఓ రోజున హఠాత్తుగా రవి వ్రాసిన వుత్తరంలో, 'సరోజకి – వేరే అతనితో వివాహం అయింది.' అనే పిడుగులాంటి వార్త చదివి దిమ్మెరపోయాడు! తర్వాత రవి ప్రసాద్‌ల మధ్య సరోజ ప్రసక్తే రాలేదు! కానీ– ప్రసాద్ ఈ ఆశాభంగం మనసులో దాచుకుని, ధ్యానం అంతా చదువు మీదనే కేంద్రీకరించుకున్నాడు.

రవి 'ఎవరో నిర్భాగ్యురాలికి నువ్వు సహాయం చేయాల'ని కోరితే యింకెవరో అనుకున్నాడు! సహజంగా రవి అడిగినది క్షణాలమీద చేసే అతను, యీ [illegible]కి పంపటంకోసం కూడా అలాగే చేసా[illegible]

[illegible] హఠాత్తుగా, యిలా కనిపించి, ఆ[illegible] రేపుతుందని, అతను కలలో కూడా అనుకోలేదు!

25

ధరలు మండిపోతున్న ఈ రోజుల్లో, పిల్లా, జెల్లా గల తనలాంటి మధ్యతరగతి కుటుంబీకులు ఎంత బాధపడిపోతున్నారో, చిదంబరం పురుషోత్తానికి లబలబలాడుతూ చెబుతున్నాడు. 'చూడండి బావగారూ! ఈరోజు పేపరులో ఏముందో! పిల్లలకి పెళ్ళిళ్ళు చేయలేని ఒక గృహస్థు ఆత్మహత్య!' అంటూ చేతిలో వున్న పేపరు చదివి వినిపించసాగాడు.

పురుషోత్తంగారు సానుభూతిగా వింటున్నారు.

నిన్న పురుషోత్తంగారి భార్య పోయిన రోజు! హైదరాబాద్ నుంచి రవితోపాటు చిదంబరంకూడా 'బావని చూసి చాలా రోజులైంది' అంటూ వచ్చాడు. ఈరోజు మధ్యాహ్నం బస్సుకి తిరిగి వెళుతున్నాడు.

ఇంతలో ఇంటిముందు కారు ఆగిన శబ్దం అయింది.

పేపరు దండకంలా చదువుతున్న చిదంబరం ఆపి, 'ఎవరూ?' అంటూ తొంగిచూసాడు.

రాజారావుగారు కారు దిగి, విలాసంగా చేతి కర్ర వూపుకుంటూ లోపలకి వస్తున్నారు.

ఆయన్ని చూడగానే చిదంబరం ముఖం మాడి



పోయింది. చప్పున కుర్చీలోనుంచి లేచి, ఓ పక్కగ వినయంగా నిలబడ్డాడు.

'ఏరా? ఏం చేస్తున్నావు?' అంటూ వచ్చారాయన.

'రా! రా! ఏముంది చేసేటందుకు. తినడం కూర్చోవటం. కృష్ణా, రామా అనుకోవటం. ఏరా నిన్న జానకి పోయినరోజు! తప్పకుండా రా అని వ్రాస్తే యివేళ వచ్చావేమిటి?'

'ఆ గారెలు, బూరెలు తినలేమురా! అదీగా ఈరోజు ఆదివారం. అందుకని వచ్చాను 'ఏవయ్యా చిదంబరం! నిలబడ్డావేం? కూర్చో.' అన్నారు తను కూర్చుంటూ.

'చిత్తం!' అలవాటు చొప్పున అనేసాడు.

'ఇంకా ఏం చిత్తమయ్యా! నా దగ్గర ఉద్యోగం మానేసి అన్ని రోజులైనా నువ్వు యింకా యీ చిత్తాలు మానలేదేమిటి? కూర్చో. కూర్చో.'

చిదంబరం ముళ్ళమీద కూర్చున్నట్టు అక్కడున్న కుర్చీలో కూర్చున్నాడు.

ఇంతలో అక్కడికి రవి వచ్చాడు.

రాజారావుగారిని చూడగానే నమస్కరిస్తూ, 'ఎంతసేపయిందండీ వచ్చి?' అని పలకరించాడు.

'ఇప్పుడే! ఊ! ఎలా సాగుతోంది నీ ఫాక్టరీ?'

'మీ దయవల్ల బాగానే వుందిరా! అబ్బాయికి క్షణం వూపిరాడటంలేదంటే నమ్మ! తల్లి పోయిన రోజు! తప్పకుండా రమ్మనమని నేను మరీ మరీ వ్రాస్తే వచ్చాడు.' అన్నారు పురుషోత్తం.

'నేను అడిగింది నిన్ను కాదురా బడుద్ధాయి!' డబాయించా రాయన.

రవి నవ్వాడు.

'మీ దయవల్ల బాగానే వుందండీ! నిన్ననే ఫారెన్ ఎక్స్‌పోర్ట్‌కి లైసెన్స్ కూడా వచ్చింది! మీరు స్వయంగా 'కలిపించుకోకపోతే అది యింత త్వరగా దొరికేది కాదు!'

రాజారావుగారు ఆ మాట వినగానే ఏదో గుర్తుకు వచ్చినట్టుగా, జేబులు తడుముకుని అందులో నుంచి వుత్తరం ఒకటి తీసారు.

'నా మాట విని నువ్వు సాధ్యమైనంత తొందరలో సింగపూర్ వెళ్ళు. అక్కడ 'షా' అని నా ఫ్రెండ్ ఒకతను వున్నాడు. అతనికి డిపార్ట్

మెంటల్ స్టోర్ వుంది. అతనికి నీ గురించి వ్రాసాను. నిన్ననే యీ జవాబు వచ్చింది. నిన్ను పంపమని వ్రాసాడు. అతను యీ మార్కెటింగ్ బిజినెస్‌లో మంచి ఎక్స్‌పర్ట్!' అంటూ వుత్తరం అందించారు.

రవి ఆతురతగా ఆ వుత్తరం చదువుకున్నాడు. అతని ముఖం ఆనందంతో దీప్తివంతమైంది.

'థాంక్‌యూ సర్ !' అన్నాడు.

'అదుగో ! ఆ సర్ అన్న పదమే వద్దన్నాను !' అన్నారాయన.

'సారీ ! థాంక్‌యూ అంకుల్ !' అన్నాడు రవి.

'నాయనా వంట అయిందేమో కనుక్కో ! 12 గం. కావస్తోంది.' అన్నారు పురుషోత్తం.

'అలాగే నాన్నా ! మీరు మాట్లాడుతూ కూర్చోండి. నే నిప్పుడే ఆ ఏర్పాటు చేయిస్తాను.' అంటూ రవి లోపలకి వెళ్లాడు.

'వురేయ్! పురుషోత్తం! ఈ ఒక్కరోజే కాదురా ! ఎప్పుడూ నువ్వు మా యింట్లోనో, నేను మీ యింట్లోనో కలిసి భోజనం చేసేలా ఏర్పాటు చూడు.' అన్నారు.

'నాకూ యిష్టమే! ఏం చేద్దాం! యిద్దరం [illegible] పెట్టుకుందామా ?'

'అరే బడుద్ధాయీ ! నేను అంతకంటే మంచి మార్గమే ఆలోచించాను !'

'ఏమిటది ?'

'చెప్పమంటావా ?'

'చెప్పు.'

ఆయన చెప్పబోయి ఆగి సందేహంగా చూసారు.

'తీరా నేను చెప్పిన తర్వాత నువ్వు కాదనవుగా ?'

'ఏమిటీ! నువ్వు చెప్పిన మాట—నేను కాదనటమా ! అన్ని గుండెలు నాకు వున్నాయిట్రా.'

'అదీ అలా అను ! ఇదుగో అబ్బాయి పురుషోత్తం ! నేను ముక్కుకు సూటిగా పోయే మనిషినని, మిల్రటీవాడిననీ నీకు తెలుసుగా ! పాతకాలపు

బంగారు కలలు

పద్ధతులు నాకు నచ్చవు ! మధ్యవర్తులమీద నాకేమాత్రం నమ్మకం లేదు ! మా అమ్మాయి పెళ్లి విషయంలో నేనే పెళ్లిళ్ల పేరయ్యని అనుకో ! అందుకే సూటిగా అడిగేస్తున్నాను. మా జ్యోతిని మీ రవికి చేసుకుంటావా లేదా ?'

చిదంబరం అదిరిపడ్డట్టు చూసాడు !

పురుషోత్తం ఆనందంతో, ఆశ్చర్యంతో వుక్కిరిబిక్కిరి అయిపోతూ, 'వురేయ్! వురేయ్!' అన్నారు.

'ఒక్కమాట తెగేసి చెప్పు ! చేసుకుంటావా లేదా ? అవును ! కాదు ! జవాబు ఒకటేమాట !' ఆయన చూపుడువేలు చూపించారు.

పురుషోత్తం గభాల్న లేచి, రాజారావుగారు కూర్చున్న బల్లమీదకి వచ్చి కూర్చుని, స్నేహితుడిని గట్టిగా కౌగలించుకున్నారు.

'వురేయ్ ! తుపాకిగుండులా ఏమిటిరా యీ ప్రశ్న ?'

'నా పద్ధతి అంతే ! జవాబు చెప్పు !'

'నేనేమంటాను ? ఊహించరా ?'

'కష్టపడి కొడుకుని చదివించుకున్నాను. కట్నం కావాలంటావు. అంతేగా ?'

'ఉహూ !'

'మరి ? మా అబ్బాయికి మీ అమ్మాయి తగదుపోరా అంటావా ?'

'ఉహూ ! నా జన్మలో యింత సంతోషకరమైన వార్త ఎప్పుడూ వినలేదూ — వినబోనుకూడా అంటాను.'

'నిజమేనా ?'

'ముమ్మాటికీ ! అంతేకాదు ! యింత మంచి స్నేహితుడు నాకు తప్ప యింకెవరికీ వుండరని గర్వపడుతున్నానని కూడా అంటాను.' పురుషోత్తంగారు స్నేహితుడి తలకి తన మదురువేసి ఢీకొట్టారు.

ముఖం పాలిపోయినట్టు అవగా, చిదంబరం చప్పున కుర్చీలోనుంచి లేచి, మూల నున్న గొడుగు తీసుకుని, వుత్తరీయం పైన వేసుకుంటూ, 'నేను వస్తాను బావా' అన్నాడు.

'అదేమిటయ్యా ! భోజనం చేసి వెళ్లు.'

'ఉహూ ! పనుంది. వస్తాను. బస్సుకి టైమ్ అయింది.' అనేసి మరో మాట వినిపించుకోకుండా పెద్ద పెద్ద అంగలతో వెళ్లిపోయాడు.

పురుషోత్తంగారు బల్లమీద నుంచి లేస్తూ, 'వుండరా ! యిప్పుడే అబ్బాయికి చెప్పివస్తాను.' అంటూ గబగబా లోపలకి వచ్చారు.

రవి లోపల గుమ్మం దగ్గరే నిలబడివున్నాడు. అతని ముఖం చూస్తే ముందు గదిలోకి రాబోయి, ఈ మాటలు విని, సందేహంగా ఆగిపోయినట్టుగా వున్నాడు. పురుషోత్తంగారు కొడుకుని చూడగానే ఆనందంగా, 'రవీ ! రాజా ఏమంటున్నాడో విన్నావా?' అన్నారు.

'అంతా విన్నాను నాన్నా ! మీరిలా రండి.' రవి తండ్రి చేయి పట్టుకుని కాస్త పక్కకు తీసుకెళ్లాడు. 'నాన్నా ! యిప్పుడప్పుడే నాకు పెళ్లి చేసుకోవాలని లేదు ! నేను యీ మాట అంటున్నానని ఆయనకి చెప్పండి.' అన్నాడు.

'నీ కేమైనా మతి పోయిందా?' తండ్రి తెల్లబోయాడు.

'లేదు నాన్నా ! ఫాక్టరీ యిప్పుడిప్పుడే పైకి వస్తోంది ! ఒకటి రెండు సంవత్సరాలు మనం అందులో వచ్చిన ప్రతి పైసా, దాన్ని అభివృద్ధి చేయటానికే ఖర్చు చేయాలి ! మనం ఆర్థికంగా చాలా నలుగుడు పడే పరిస్థితుల్లో, మరో వ్యక్తి వచ్చి మనతో యిబ్బంది పడటం నాకేమాత్రం యిష్టంలేదు ! ఫాక్టరీ ఒడిదుడుకులు లేకుండా బాగా సాగేటంతవరకూ, పెళ్లి ప్రసక్తి వద్దంటున్నానని ఆయనకి చెప్పండి.'


కొడుకు నిశ్చలంగా చెబుతున్న యీ మాటలు వినగానే పురుషోత్తంగారి ముఖంలో ఆనందం యిట్టే ఎగిరిపోయింది.


[ఇంకా వుంది]



గజ రాజులకు రాజు

కీన్యాలోనే కాదు ఆఫ్రికా ఖండం మొత్తంమీద మేలురకం "గజరాజంగా" పేర్గాంచిన "అహ్మద్" అనే ఏనుగు యిటీవల మరణించింది. కీన్యా ప్రభుత్వం యీ ఏనుగు కళేబరాన్ని మ్యూజియంలో శాశ్వతంగా పొందుపరచాలని నిర్ణయించింది. ఏనుగు కళేబరం కంకాళంతో సజీవంగా నిలబడి వున్నట్లు తయారు చేయటానికి 'టెక్సీ డెర్మిస్టులు' తీవ్రమైన కృషి చేస్తున్నారు. 'కీన్యా'దేశపు జాతీయ వస్తు ప్రదర్శనశాలలో యీ 'ఏనుగు'ని ముందు తరాలవారు చూసి ఆశ్చెరువు చెందేలా వుంచుతారు.




Vijay

ప్రపంచంలో ఏకైక

నేపాల్

[illegible]



నేపాల్ ప్రజలు ఆరాధించే కుమారీ దేవి

నేపాల్ దేశం మంచుతో కప్పబడిన ఎత్తయిన పర్వత ప్రాంతాలు, అరణ్యాలు, లోయలు, మైదానాలతో కూడి ఉంది. ఒక్కొక్క ప్రాంతంలో శీతోష్ణస్థితి ఒక్కో రకంగా ఉంటుంది. ప్రజల అలవాట్లు, వేష భాషలు కూడా ఆయా ప్రాంతాలనిబట్టి మారుతూ ఉంటాయి.

తెగ కొక భాష

కొండ జాతుల్లో అనేక తెగలు వున్నాయి. తెగ కొక భాష వుంటుంది. జాతీయ భాష నేపాలీ. అంతా తలకి టోపీలు ధరిస్తారు. నల్లటోపీ నేపాల్ జాతీయతకి చిహ్నం.

మైదానాల్లో నివసించేవారు 'పంచలు' కడతారు. శుభా శుభ కార్యాల సమయాల్లో ధోవతిని తప్పనిసరిగా కట్టుకుంటారు.

ఆభరణాలపై మోజు

నేపాలీ స్త్రీలకి ఆభరణాలపై మోజు ఎక్కువ. వెండి, బంగారు ఆభరణాలు ధరిస్తారు. బ్రాహ్మణ, క్షత్రియ స్త్రీలు బంగారు కమ్మలు, ముక్కు పుడకలు, అడ్డిగలు, ఉంగరాలు పెట్టుకుంటారు. కొన్ని జాతులవారు ముక్కు పుడకలు మాత్రం పెట్టుకోరు. రాయ్ తెగ స్త్రీలు ఎర్రటి గాజులు, వెండి నాణెములు గల ఆభరణాలపై మక్కువ చూపిస్తారు.

ఆహార పానీయాలు : గో పూజ

ఆహార పానీయాలు కూడా తెగని బట్టి మారుతూ వుంటాయి. ఇక్కడి బ్రాహ్మణులు మాంసాహారులే అయినా పంది, కోడి మాంసమును ముట్టరు. దేవతలకి అర్పించే నైవేద్యం కూడా తెగని బట్టి మారుతూ వుంటుంది. గో పూజ అందరూ చేస్తారు. నేపాల్‌లోని ముఖ్యమైన పండుగ గోయాత్ర. ఖాట్మండూలోని ప్రజలు గిత్తలనికూడా వ్యవసాయపు పనులకి ఉపయోగించరు. ఆడ మేకని, గొర్రెని చంపకూడదనే నియమం కలవారు నేపాల్ దేశీయులు. విందులలో సారాయిని తప్పనిసరిగా పుచ్చుకుంటారు.

రెండు మతాల ఐకమత్యం

నేపాల్‌లో బౌద్ధ మతస్థులు ఎక్కువ మంది వున్నారు. హిందూ బౌద్ధ మతాల ఐకమత్యాని కిది పట్టుగొమ్మ. మహమ్మదీయులు చాలా తక్కువ. బౌద్ధులు బుద్ధుడిని, హిందువులు హైందవ దేవతలని పూజిస్తారు. మంత్ర పఠనం సంస్కృతంలో జరుగుతుంది. పూజకి ముందు నదుల్లో, స్నాన వాటికలలో స్నానం చెయ్యడం ఇక్కడివారి ఆచారం. అరటి, బిల్వ, తులసి, రావి, మామిడి వృక్షాలని కూడా పూజిస్తారు. విజయ దశమి, దీపావళి, కృష్ణాష్టమి, శ్రీరామ నవమి,

---

సినిమా విశేషాలు



"తులసి"లో కల్పన

శ్రీ కాళేశ్వరి ఎంటర్‌ప్రైసెస్!

"వింత కథ" చిత్రాన్ని అందించిన సంస్థ యిది. దీనికి చక్రధరరావు అధినేత. ఇతడు వి. ఎస్. బోసుకు దర్శకత్వం యిచ్చాడు. మొదటి చిత్రం బాగానే చేశాడు అనిపించుకున్నాడు.

బంగారు చిలక

వింత కథ తరువాత తలపెట్టిన చిత్రం పేరు యిది. ఈ కథను వి. ఎస్. బోసు వ్రాసి, సినిమా అనువాదాన్ని ఆయనే చేసి, దర్శకత్వాన్ని చేపట్టాడు. ఈ చిత్రానికి దాసం గోపాలకృష్ణ మాటలను, పుహళేంది సంగీతాన్ని, కళాధర్ కళను, కె. ఎస్. ప్రసాద్ ఛాయను నిర్వహిస్తున్నారు.

మంజుల పాత్ర

బంగారు చిలక అంటే యీమే. ఇంతవరకు గ్లామర్ తారగానే యీమెకు ప్రజలలో పలుకుబడి వుంది. ఇందులో కరుణరస ప్రధానమైన పాత్రను మంజుల పోషిస్తున్నది. ఆమెకు యీ పాత్ర పెద్ద వెరైటీ అవుతుంది. ఈ చిత్ర నాయకుడిగా మురళీమోహన్ నటిస్తున్నాడు. జగమే మాయలో నాయకుడు యీతడే. సహాయ పాత్రలను సత్యనారాయణ, అల్లు రామలింగయ్య, రావు గోపాల రావు, కె. వి. చలం, ఛాయాదేవి పోషిస్తున్నారు. 'మే' నాలుగున షూటింగు ప్రారంభం.

అక్కినేని ఎలాంటివి చెయ్యాలి?

నే నప్పుడప్పుడు ఆంధ్రదేశం వెళ్లినప్పుడు,

క హిందూదేశం

ప్రజలు వారి ఆచారాలు

హోలీ, బుద్ధజయంతి ముఖ్యమైన పండుగలు. ప్రతి సంవత్సరం భాద్రపద శుద్ధ చవితినాడు ఇంద్ర జాతర మొదలవుతుంది. ఇది 8 రోజులపాటు జరుగుతుంది. ఈ జాతరలో నేపాల్ మాత, సజీవ దైవం ఆయిన కుమారీదేవిని భైరవ, గణపతితో పాటు మూడు రోజులపాటు రథం మీద ఖాట్మాండూ వీధులలో ఊరేగిస్తారు.

వృత్తులు : వివాహాలు

నేపాల్ జనాభా సుమారు ఒక కోటి ఉంటుంది. నూటికి 95 మందికి ముఖ్య వృత్తి వ్యవసాయం. ఇక్కడ వృత్తిని బట్టి ఆ కులం పేరుతో పిలుస్తారు. బ్రాహ్మణులు పూజారులు, మఠాధిపతులుగా వుంటారు. ముఖ్య వృత్తులు ప్రభుత్వోద్యోగాలు, వ్యవసాయం. క్షత్రియులు సైన్యంలో పనిచేస్తారు. ఒకే జాతివారు అనేక వృత్తులని చేపట్టడం ఈ దేశంలోని ప్రత్యేకత.


మను ధర్మశాస్త్రంలోని ఎనిమిది రకాల వివాహాలూ ఈ దేశంలో ఆచరణలో వున్నాయి. హిందువులలో పురుషుడు పెళ్లి చేసుకోకుండా ఉండవచ్చుగానీ స్త్రీ తప్పనిసరిగా వివాహం చేసుకోవాలి. బ్రాహ్మణుల్లో రజస్వల కాకముందే వివాహం చేసే ఆచారం ఉంది. క్షత్రియులు రజస్వలానంతరం వివాహం చేస్తారు.

ఆదిమవాసుల తెగలైన తమంగ్ జాతి వారిలో స్త్రీ పెళ్లి కాకముందు గర్భవతి అయినా తప్పులేదు. కానీ పుట్టే బిడ్డని అందుకు కారణమైన వ్యక్తి తీసుకుని ఆమెకి నష్టపరిహారం చెల్లిస్తాడు. ఇలాగే గురుంగ్, రాయ్ తెగలలో కూడా పెళ్లికి ముందు గర్భం దాల్చడం అన్నది తప్పు కాదు.

నెవార్ తెగలో కన్యకి మారేడుఫలంతో మొదట వివాహం జరుగుతుంది. అది దగ్గర ఉన్నంతకాలం భర్త చనిపోయినా ఆమెకి వైధవ్యం రాదు. బ్రాహ్మణ క్షత్రియులు మాత్రం వైదిక ధర్మాన్నే అనుసరిస్తారు.

బ్రాహ్మణులు, మరికొన్ని యితర తెగల వారు చనిపోయిన వారికి దహన సంస్కారం చేస్తారు. ఇంకా కొన్ని తెగలవారు శవాలని నదుల్లో పారేయడమో, ముక్కలుగా నరికి కాకులకి గద్దలకి వేయడమో, ఖననం చెయ్యడమో చేస్తారు.

ఇక్కడి ప్రజలకి కూడా తీర్థయాత్రలు ముఖ్యమైనవి. అనేక పవిత్ర యాత్రా స్థలాలు ఉన్నాయిక్కడ. పశుపతి క్షేత్రం, నారాయణ స్థానం, స్వయంభూ స్థానం, గోదావరి, వరాహ క్షేత్రం, గోకర్ణ, మాత తీర్థం, జానకీ పురం, లుంబిని మొదలైన పుణ్య క్షేత్రాలకి ప్రజలు శ్రమ అనుకోకుండా పాదయాత్ర చేసి భగవత్ దర్శనాన్ని పొందుతారు.



మనకిక్కడ కొలనులు, కోనేరులు, ఉన్నట్లే అక్కడ దేవాలయాల్లో పురాతన స్నానవాటిక లుంటాయి బొమ్మలో అటువంటిది ఒకటి చూడవచ్చును.

విద్యార్థులను, గృహిణులను, రిక్షావాళ్లను, హోటల్ సప్లయిర్లను కలిసి మన హీరోలమీద, చిత్రాలమీదా అభిప్రాయాన్ని సేకరించే పద్ధతిని అలవాటు చేసుకొన్నాను.

నా పర్యటనలో నేనొక నిరక్షర నిజాన్ని గ్రహించాను. ఆంధ్ర ప్రేక్షకులు యిప్పటికీ నాగేశ్వరరావును అగ్రనటుడిగా పరిగణిస్తున్నారు. ఆయన ఎలాంటివి వెయ్యాలో కూడా వాళ్ల ద్వారా తెలుసుకొన్నాను.

రొమాంటిక్ ట్రాజెడీగాని, మానసిక సంఘర్షణకు లోనయ్యే పాత్రనుగాని, భక్తిరస ప్రధానమైన, కరుణరస మిళితమైన పాత్రనుగాని అక్కినేని ధరిస్తే, ఆ చిత్రాలు జనాకర్షణీయంగా వుంటాయన్న అభిప్రాయాన్ని ఎక్కువమంది వెల్లడి చేశారు.

ఆయనకు గెడ్డం పెడితే సహించలేరట. ఆయన బీద పాత్రలు ధరిస్తే ఒప్పుకోరట. చాలా రిచ్‌గా కనిపించాలట. ఆయనకి శృంగార ఘట్టాలు ఎక్కువగా వుండాలట. నలుపు—తెలుపు చిత్రాలలో ఆయన నటించకూడదట. గంతులు వెయ్యాలన్న నిబంధన లేదట. ఆయనెప్పుడూ చిరంజీవిగానే, అందగాడుగానే, మహానటుడిగానే వుండాలట.



అనంతలక్ష్మి కొత్త చిత్రం !

"ప్రేమలు – పెళ్లిళ్లు" చిత్రం తరువాత ఏమిటా అని ఆలోచిస్తున్న తరుణంలో తమిళంలో "కన్ మణి రాజా" అనే చిత్రం విడుదలయింది. ఆ చిత్రం, నిర్మాత దగ్గుపాటి భాస్కరరావుకు బాగా నచ్చింది. అదే కథను తెలుగులో నిర్మించే హక్కులను కొనడం జరిగింది.

"తల్లి ప్రేమ గొప్పదా? లేక ఇల్లాలి ప్రేమ గొప్పదా? లేక యిద్దరిదీ గొప్పదా" అనేది అంశంపై అల్లబడిన కథ యిది. కుమారుడీ అనురాగం తనకి పరిమితం కావాలి అన్న పట్టుదలపై, అన్నెం పున్నెం ఎరుగని కోడలిని యింటి నుండి వెడలగొట్టిన దృష్ట్యా పేరాశను గొన్న తల్లి, ఆమె ఆరోగ్యం దృష్ట్యా భార్యను దూరంగా వుంచిన భర్త, భర్త ఆజ్ఞను శిరసావహించిన భార్యలచుట్టూ జరిగిన సంఘటనల సంఘర్షణ సారమే ఈ కథ. ఇల్లాలి ఆగమనం తరువాత తల్లి ప్రేమలో కొంత భాగం అర్ధాంగికి అంకితమయితేనే ఇల్లు నిత్యకళ్యాణం – పచ్చతోరణంగా వుంటుందన్న నిజాన్ని చాటి చెప్పే కథ యిది.



"రాధమ్మపెళ్లి"లో ఒక సన్నివేశం

ఈ చిత్రంలో భర్త మాటను ధిక్కరించలేక, అత్తయ్య అనురాగాన్ని పొందలేక జీవితాన్ని సాగిం





చిన పాత్రలామగా శారద నటిస్తున్నది. ఈ చిత్రానికి పి. లక్ష్మీదీపక్ దర్శకుడు.

లైలా – మజ్ను

జగపతి పిక్చర్స్ ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మిస్తున్న "మంచి మనుషులు" ఫొటో ఆల్బం చూశాను. అందులో ఒకచోట అలాగే కళ్లప్పగించి చూడక తప్పిందికాదు. ఆ స్టిల్ అంతగా ఆకర్షించడానికి కారణం లేకపోలేదు. లైలాగా మంజుల, మజ్నుగా శోభన్‌బాబు కనిపించారు. ఇది చూచిన తరువాత అనిపించింది, మంచి మనుషులు కథ కూడా గాఢానురాగ బద్ధులైన ప్రేమికుల జీవిత కథ అని. ఈ చిత్రానికి ఆత్రేయ మాటలు, పాటలు వ్రాశారు.

బొంబాయి స్కేటర్సు

స్కేటింగుకు ప్రాధాన్యత వున్న 'మంచి మనుషులు' చిత్రంలో బొంబాయి స్కేటర్సు ముగ్గురు పాల్గొన్నారు. మంచుకొండలో యీ దృశ్యాలు చిత్రీకరించబడ్డాయి శోభన్‌బాబు, మంజుల మంచులో దొర్లి, పొర్లాడే శృంగార ఘట్టాలు కాశ్మీరులో చిత్రీకరించబడ్డాయి. ఈ చిత్రానికి ఎస్. వెంకటరత్నం ఛాయాగ్రాహకుడు.

యిరవై అయిదువేల పాట

ఒక పాట రికార్డింగుకు మాత్రం యిరవై అయిదువేలు అయినట్లు, నిర్మాత రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. అనుకున్న విధంగా రావడానికి మూడు సార్లు అదే పాటను రికార్డు చెయ్యడంవల్ల అంత ఖర్చయింది అన్నారాయన. ఈ చిత్రానికి కె. వి. మహదేవన్ సంగీత సారధి. భారీయెత్తున నిర్మిత మయ్యే తెలుగు చిత్రాలలో యిదొకటి. దీనికి వి. బి. రాజేంద్ర ప్రసాద్ దర్శకుడు

ఉత్తమ చిత్రాల నాయకుడు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "చెల్లెలి కాపురం,

సినిమా

కాలం మారింది" చిత్రాలను ఉత్తమోత్తమంగా పరిగణించిన విషయం మనందరికీ తెలిసినదే. అట్టి ఉత్తమ చిత్రాలలో నాయకుడిగా నటించిన ఘనత శోభన్‌బాబుకు చెందింది. ఆంధ్ర సచిత్ర వార పత్రిక నిర్వహించిన బ్యాలెట్‌లో ద్వితీయ స్థానాన్ని పొందినదికూడా శోభన్‌బాబే.

ఉత్తమ చిత్రాల నాయకుడు ఒక గట్టి నిర్ణయాన్ని తీసుకున్నాడు. వైవిధ్యం వున్న పాత్రలు గొప్ప కథలలోనే నటించగలడట. తను తక్కువ చిత్రాలలో నటించినా, ఎక్కువ కాలం ప్రజలకు ఆత్మీయుడిగా వుండగలడట.

పీనస్‌లో శోభన్ !

"పవిత్ర బంధం, మంచివాడు" చిత్రాలను నిర్మించిన వీనస్ కంబైన్స్‌కి, శోభన్‌బాబు కాల్ షీట్లు యిచ్చినట్లు తెలిసింది. అది నిజమేనని శోభన్ చెప్పడం జరిగింది. 1974 లో ప్రారంభ మయ్యే కొత్త చిత్రాల లిస్టులో యిది ఒకటి అని తెలిసింది.

వెఫ్సా నిర్వహించిన పోటీలలో బహుమతి ప్రదానోత్సవ సభలో శ్రీమతి సావిత్రికి సన్మానపత్రం సమర్పిస్తున్న వెఫ్సా అధ్యక్షులు శ్రీ జి. యస్. రెడ్డి



స్టుడియో చిత్రంలో కృష్ణ !

సారథీ స్టుడియోస్ నిర్మించిన మొదటి చిత్రంలో అక్కినేని కథానాయకుడు. నేటి అగ్రనటి అక్కినేనితో నటించిన మొదటి చిత్రం కూడా అదే.

"ఆత్మీయులు" అయిన తరువాత 'మీనా' తీద్దామనుకొన్నారు. ఇప్పుడు ప్రముఖ నవలా రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి వ్రాసిన "ఈ తరం కథ"ను చలనచిత్రంగా నిర్మిస్తున్నారు.

"ఈ తరం కథ"కు నాయకుడిగా కృష్ణ, నాయికగా వాణిశ్రీ ఎన్నుకోబడ్డారు. ఈ చిత్రానికి డి. వి. నరసరాజు రచయిత. 'మామ' సంగీతాన్ని, సెల్వరాజ్ ఛాయను చేపట్టారు. ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వం చెయ్యడానికి అంగీకరించారు.

నిప్పులాంటి మనిషి

రవి చిత్ర ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మిస్తున్న చిత్రానికి "నిప్పులాంటి మనిషి" అని పేరిడినట్లు, నిర్మాత వై. వి. రావు చెప్పారు. ఈ చిత్రానికి హిందీ జంజీర్ మూలం. అమితాబ్‌బచన్ ధరించిన వేషాన్ని ఎన్టీ రామారావు, ప్రాణ్ వేషాన్ని సత్యనారాయణ, అజిత్ వేషాన్ని ప్రభాకరరెడ్డి, పోషిస్తున్న ఈ చిత్రంలో జయభాదురిగా లత నటిస్తున్నది. ఈ చిత్రానికి ఎస్. ఎస్. లాల్ ఛాయను, ఎస్. డి. లాల్ దర్శకత్వాన్ని చేపట్టారు. హాస్యంకోసం రాజబాబును, కరుణకోసం దేవికను చూడొచ్చు ఈ చిత్రంలో. సత్యం సంగీతం సమకూర్చడంవల్ల మూడు నాలుగు పాటలు హిట్ గావచ్చు.

రఫీ తెలుగు పాట !

గోల్డెన్ వాయిస్ ఆఫ్ యిండియా అనెడి పేరును సంపాదించిన మహ్మద్ రఫీ చేత తెలుగు పాటలు పాడించారు, నిర్మాత రుక్మాంగదరావు. ఆయన పాడిన పాటను కవి దాశరథి వ్రాయ, సంగీత

సారధి రాజేశ్వరరావు స్వరం కూర్చారు. ఈ చిత్రానికి బి. ఏ. సుబ్బారావు దర్శకుడు. 'నటరత్న' ఆశీర్వాద బలంతో ఆవిర్భవించిన కొత్త సంస్థ ఇది.

గొర్రెపోతు కావాలి


ఇది సినిమా మకుటం అనుకుంటే పొరపాటు అవుతుంది. శ్రీ రమణ చిత్ర నిర్మించబోయే "డూ డూ బసవన్న" చిత్రం కోసం చెప్పినట్టు వినే మంచి గొర్రెపోతు కావాలి అని, నటుడు చలం వ్రాయమన్నారు. ఎవరివద్ద యిలాంటి గొర్రెపోతు వుంటుందో, వారి విలాసం శ్రీ రమణ చిత్ర, వుస్మాన్ రోడ్డుకు తెలియచేస్తే, ఆ యూనిట్ సభ్యులు వచ్చి గొర్రెపోతును చూచి, కొనగలరట.

జాతర

"డూ డూ బసవన్న" చిత్రంలో జాతర దృశ్యం ఒకటున్నదట. ఎక్కడ కోలాహలంగా జాతర జరుగుతుందో, ఆ చోటును తెలియచెయ్యవలసినదిగా చలం కోరుతున్నాడు.

ఆనందం... ఆశ్చర్యం

శ్రీ రమణ చిత్ర నిర్మించిన "తులాభారం" చిత్రంలో నన్ను ఆనందపరిచినది, ఆశ్చర్యపరిచినది ఒక్కటే. అదేమిటంటే, చలం నటన. ఇదివరకటి చలానికి, పబ్లిక్ ప్రాసిక్యూటరు చలానికి చాలా వ్యత్యాసం కనిపించింది. విగ్రహం, హుందాతనం చిత్రం ఆద్యంతం కనిపించింది. పతాక సన్నివేశంలో రాధ బ్రతుకు యిలా కావడానికి తానే బాధ్యుడు అని నిజం ఒప్పుకొన్న ఘట్టంలో చలం అద్వితీయంగా నటించాడు. చలం యింత గొప్పగా చేస్తాడని నేను అనుకోలేదు.



మే లో కాశ్మీరులో మకాం

గత వారం సురేష్ రామానాయుడు కాశ్మీరుకు టిక్కెట్లు కొనే ప్రయత్నంలో వున్న తరుణాన నేను వెళ్ళడం జరిగింది. ఎప్పుడో ప్రయాణానికి, అప్పుడే హడావిడి ఎందుకని ఆయన్ను అడిగాను. ముందు జాగ్రత్త చాలా అవసరము అన్నారాయన.

సురేష్ మూవీస్ రంగుల్లో నిర్మిస్తున్న "చక్రవాకం" షూటింగు మూడు షెడ్యూల్సు పూర్తయింది. దాంతో ఏడు రీళ్ల చిత్రం వచ్చినట్టు తెలిసింది.

మే ఒకటి నుండి పది వరకు కాశ్మీరులో మకాం పెట్టి, అక్కడ మూడు పాటల చిత్రీకరణ + ముఖ్య సన్నివేశాల చిత్రీకరణ చెయ్య ఆయన ప్లాను వేశారు. ముఖ్య నటు లందరూ యీ షెడ్యూలులో పాల్గొనగలరని ఆయనన్నారు.

నాయకుడు శోభన్, నాయిక వాణిశ్రీ ఆడిపాడే పాటలు, మరికొన్ని ముఖ్య ఘట్టాలు కాశ్మీరులో చిత్రీకరించబడతాయి అని తెలుసుకొన్నాను. ఈ చిత్రానికి విక్టరీ. మధుసూదనరావు + మార్కస్ బార్ట్లే + కె. వి. మహదేవన్ ముఖ్య స్తంభాలు. ప్రధాన పాత్రలను చంద్రకళ, జి. వరలక్ష్మి, కృష్ణకుమారి, రాజసులోచన, శ్రీధర్, ఎస్వీ రంగారావు, నాగభూషణం, పద్మనాభం, కె. వి. చలం పోషిస్తున్నారు.

విజయ భట్‌లో శోభన్ !

"తోడు-నీడ" చిత్రం తరువాత విజయ భట్ మూవీస్ 'భలే రంగడు' చిత్రాన్ని నిర్మించిన పిమ్మట మూడేండ్లు చిత్ర నిర్మాణం జోలికి పోకుండా వుండి, యిప్పుడు శోభన్‌బాబుతో ఒక రంగుల చిత్రాన్ని తలపెట్టింది. ఈ చిత్రాన్ని షీలాదేవి చమ్రియా నిర్మిస్తున్నది. 'తోడు—నీడ' చిత్రానికి దర్శకత్వం నిర్వహించిన ఆదుర్తి యీ చిత్రానికి కూడా అదే బాధ్యతను స్వీకరించారు. మంజుల నాయిక.

శోభన్ — మంజుల జంటగా నటిస్తున్న చిత్రాలు మూడు. ఒకటి జగపతి వారిది. రెండు సమత చిత్ర వారిది. మూడు విజయభట్ వారిది.

ప్రేక్షకాధీనం

'మరపురాని మనిషి' ఆర్థికంగా దెబ్బ తిని యుండొచ్చు. కానీ, అక్కినేని అంత గొప్పగా నటించిన చిత్రం యిటీవల రాలేదని చెప్పొచ్చు. జయాపజయాలు ప్రేక్షకాధీనాలు. వాళ్లకు కొన్ని చిత్రాలు ఎందుకు నచ్చుతాయో, మరికొన్ని ఎందుకు నచ్చవో చెప్పడం కష్టం అనిపిస్తుంది. మంచి చిత్రాలను నిర్మించాలన్న సంకల్పం వున్న వ్యక్తులకు మరపురాని మనిషి అలాంటి వుద్దేశ్యం పెట్టుకోవద్దు అన్న సలహా నిచ్చింది.



ముప్పాళ రంగనాయకమ్మ ఎన్నో నవలలను వ్రాసియున్నా, ఎక్కువ పాఠక ఆదరణ పొందిన నవల బలిపీఠం అంటే, ఒప్పుకుంటారనుకుంటాను. అట్టి నవలను రవిశంకర్ ఆర్ట్ పిక్చర్స్ అధినేత సునీల్ చవుదరి కొని, సినిమాకోసం కొన్ని మార్పులు, చేర్పులు చెయ్యడం జరిగింది. ముఖ్యంగా పతాక సన్నివేశం దాసరి చేతిలో కొత్త రూపాన్ని సంతరించుకుంది.

శోభన్ — శారద !

ఉదాత్త భావాలు గొన్న భాస్కర్‌గా శోభన్ బాబు, ఆదిలో నిష్ఠూరంగా అనిపించి, చివరికి పరితప్త హృదయంగొన్న అరుణగా శారద విమాత్నమైన పాత్రలను పోషిస్తున్నారు. ఈ చిత్రం రంగులలో నిర్మించబడుతుంది. ఈ చిత్రానికి చక్రవర్తి సంగీతాన్ని, రామారావు కళను చేపట్టారు. ముఖ్య భూమికలను సత్యనారాయణ, అల్లు రామలింగయ్య,

''కృష్ణవేణి''లో వాణిశ్రీ, కృష్ణంరాజు



సినిమా

రాజబాబు, కె. వి. చలం, రమాప్రభ, రోజా రమణి, నిర్మల ధరిస్తున్నారు.

జూన్ రెండున రికార్డింగు, జులై యిరవై అయిదున షూటింగు ప్రారంభం. ఈ చిత్రానికి దాసరి నారాయణరావు దర్శకుడు. నవయుగ విడుదల.

కొత్తవాళ్లతో చిత్రం నిర్మించే వుద్దేశ్యం తనకు లేదని, సునీల్‌చౌదరి స్పష్టం చేశారు.

రంజిత్ మూవీస్ !

ఈ సంస్థను కె. రంజిత్ కుమార్, ఎ.సూర్య నారాయణ స్థాపించారు. ఒకటవ వ్యక్తి ప్రముఖ వ్యాపారవేత్త. రెండవ వ్యక్తి సత్య చిత్ర నిర్మించిన 'తాసిల్దారు గారమ్మాయి'లో పార్టనర్. వీళ్లు తల పెట్టిన మొదటి చిత్రం ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మితమవుతుంది. కథను, కథనాన్ని, దర్శకత్వాన్ని కె. ఎస్. ప్రకాశరావు చేపట్టారు..

కృష్ణ పాత్ర !

మామూలు కృష్ణ గాకుండా వెరైటీగా ఈ చిత్రంలో ఆయన వేషం వ్రాయబడినట్టు, కథకుడు కె. ఎస్. పి. చెప్పారు. 75 సీన్లలో కృష్ణ కని పిస్తారు అని ఒక నిర్మాతయిన సూర్యనారాయణ చెప్పారు. ఒక ముఖ్య పాత్రను సత్యనారాయణ పోషిస్తున్నారు.

సిమ్లా క్యాంపు

హీరో కృష్ణ, అగ్రనటి వాణిశ్రీ మే ఒకటి నుండి ఇరవై వరకు సిమ్లా, కులువ్యాలీలో జరిగే అవుట్‌డోర్‌లో పాల్గొంటారు. చిత్రంలో సగభాగం అవుట్‌డోర్‌లో పూర్తవుతుందట. ఈ చిత్రానికి వి. ఎస్. ఆర్. స్వామి ఛాయాగ్రాహకుడు.

పద్మప్రియ వేషం !

రంజిత్ మూవీస్ యీ అమ్మాయికి ఉప నాయిక పాత్ర నివ్వడం జరిగింది. ముఖ్యత్వం వున్న వేషం గాబట్టి, ఆమె ప్రతిదినం డైలాగు రిహార్సల్, డ్యాన్స్ రిహార్సల్ చేస్తూవుంది. ఈ చిత్రంతో పద్మప్రియ అంతస్తు పెరుగుతుందట. ఈ చిత్రా నికి చక్రవర్తి, మోహన, సంగీత కళలను నిర్వ హిస్తున్నారు. లక్ష్మి ఫిలింస్ విడుదల.

డి. వి. ఎస్. లో అందాల నటుడు

ప్రేక్షక అభిమానాన్ని చూరగొన్న కొద్ది సంస్థ లలో డి. వి. ఎస్. ఒకటి. ధర్మం, వినయం, శీలం డి. వి. ఎస్. లో యిమిడివున్నది. ఇట్టి గుణాతి శయాలను గొన్న రాజును పరిశ్రమ, ప్రజ గౌరవించ డంలో ఆశ్చర్య మేమున్నది.

డి. వి. ఎస్. ప్రొడక్షన్స్ ఈసారి రంగుల చిత్రాన్ని తలపెట్టింది. ఈ రంగుల చిత్రంలో అందాల నటుడు శోభన్‌బాబు, ఆంధ్రుల అగ్రనటి వాణిశ్రీ జంటగా నటిస్తున్నారు. సహాయ పాత్రలను అల్లు రామలింగయ్య, రాజబాబు, రమాప్రభ పోషిస్తు న్నారు. మే నుండి షూటింగు ఆరంభం. ఈ చిత్రానికి అవార్డుల విన్నర్ కె. విశ్వనాథ్ దర్శకుడు.

రామలక్ష్మి కథ !

ఆంధ్ర సచిత్ర వార పత్రికలో ప్రశ్నావళి శీర్షి కను సమర్థవంతంగా నిర్వహిస్తున్న రామలక్ష్మి ఆరుద్ర వ్రాసిన ''ఆడది'' కథ, డి. వి. ఎస్. రాజు చిత్రానికి మూలం. ఈ కథకు విశ్వనాథ్ సినిమా అనువాదాన్ని, సముద్రాల సంభాషణలను వ్రాశారు. మహదేవన్ సంగీతాన్ని, కళాధర్ కళను చేపట్టారు.

ఈ చిత్రంలో కొంతభాగం వూటీలో చిత్రీక రించబడుతుంది. విజయా విడుదల.

విజయలలిత వింత కోరిక!

ఎవరూ వూహించని, సులభంగా జరగని ఒక వింత కోరిక విజయలలిత మనసులో మెదిలింది. అదేమిటంటే... తను, జయంతి ఒకే అయ్యను పెండ్లి చేసుకోవడం.

ఇద్దరూ ఒకే కళాశాల విద్యార్థినులు. అంతే గాక ఒక రూములో నివాసులు. ఒకర్ని విడిచి మరొకరు ఒక నిమిషమైన వుండలేరు. అందుకే విజయలలిత అంత విచిత్రమైన కోర్కెను కోరింది.

ఆమె అనుకొన్నట్టు యిద్దరూ ఒకే యింటికి వచ్చారుగాని ఒక వ్యక్తికి భార్యలుగా మాత్రం కాదు. అత్తాకోడళ్లుగా వచ్చారు. అదే విధి వైపరీత్యం. అలాంటి సంఘటన ఎలా జరిగిందో తెలుసుకోవా లంటే నళినిశ్రీ ప్రొడక్షన్స్‌వారి ''నిత్య సుమంగళి'' చిత్రం చూడాల్సిందే. అత్తగా జయంతి, ఆమె భర్తగా నాగభూషణం, కోడలుగా విజయలలిత, ఆమె పెనిమిటిగా కృష్ణంరాజు నటిస్తున్నారు. ఈ చిత్రంలో రాజబాబు ధరిస్తున్నది గమ్మత్తయిన వేషం. జంట లేని వేషం. ఒక విడ్డూరమైన వేషాన్ని సూర్యాకాంతం వేస్తున్నది. ఈ చిత్రానికి బి. ఎస్. ఆర్. దర్శకుడు. కథను ధర్మరాజు, మాటలను విజయరత్నం వ్రాశారు. సంగీతం రాజేశ్వరరావు చేపట్టు, పాటలు బాగుండకపోతాయా?

వేడి వేడి వార్తలు

★ జగపతి పిక్చర్సు ''మంచి మనసులు''లో మంజుల తండ్రిగా నాగభూషణం నటిస్తున్నారు.

★ ఫణి మాధవీ కంబైన్స్ ''దొరబాబు'' షూటింగు నేపాల్, కాశ్మీరులలో గాక చండీఘర్‌లో జరిగింది.

★ మమతా కంబైన్స్ ''పల్లెపడుచు''లో నటించే గోవు హిందీలో కొన్ని లక్షలను, తమిళంలో కొద్ది లక్షలను ఆర్జించిపెట్టింది.

★ సమత ఆర్ట్సుకి విక్టరీ. మధుసూదనరావు దర్శకుడు అయ్యారు.

★ కన్నడంలో 'భూతయ్య మగ అయ్యు' పెద్ద హిట్ అయింది. దీనిని ఒక పెద్ద సంస్థ హిందీ, తెలుగు, తమిళ భాషలలో నిర్మించే హక్కును కొన్నదట.

★ ఫల్గుణా కంబైన్స్ ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మించనున్న చిత్రానికి టి. కృష్ణ దర్శకుడు. ('ఖయిదీబాబాయ్' ఫేమ్.)

''ఓ సీత కథ''లో రమాప్రభ, దేవదాస్



యూనిట్ సభ్యుల చిత్రం !

నమ్ముకున్న మనుష్యులకు బంగారు భవిష్యత్తు ఏర్పరచడం కోసం జగపతి అధినేత ఒక బంగారు పథకాన్ని ఆలోచించారు. అదేమిటంటే : గత దశాబ్ద న్నరగా తన సంస్థలో పనిచేస్తున్న వారల నిమిత్తం ఒక చిత్రాన్ని నిర్మించ తలపెట్టారు. పనివారలంద రికీ భాగాలుయిచ్చి, (పెట్టుబడి నిర్మాతదే) చిత్రం ద్వారా వచ్చే లాభాలను వాళ్లకే పంచిపెట్టడానికి నిశ్చయించారు. కథనుకూడా తనే వ్రాశారు.

పి చ్చి మా రా జు

జగపతి రాజేంద్ర ప్రసాద్ వ్రాసిన కథ యిది. ఇది రంగులలో నిర్మితమవుతుంది. ఇందులో నటించడానికి నటీనటులు తక్కువ పారితోషికం తీసుకుంటారట. అలాగే సాంకేతిక వర్గంకూడా.

"బంగారు బొమ్మలు" పూర్తయిన పిమ్మట "పిచ్చి మారాజు" ప్రారంభమవుతుంది. ఈ చిత్రానికి ఆత్రేయ రచనను, మహాదేవన్ సంగీతాన్ని, వెంకటరత్నం ఛాయను నిర్వహిస్తారు. కథ, సినిమానువాదం, దర్శకత్వంను వి. బి. రాజేంద్ర ప్రసాద్ చేపట్టారు.

యూనిట్‌సభ్యులకోసం, ఒకచిత్రాన్ని నిర్మించి, వాళ్లకు సమ భాగాలిచ్చి, వచ్చే ఆదాయాన్ని పంచిపెట్టడం అనేది అందరికీ సాధ్యపడేదికాదు అది ఒక్క రాజేంద్ర ప్రసాద్‌కు మాత్రమే చేతవుతుంది.

కొత్త పాత్రలో పాతమ్మాయి

"ఎవరికివారే యమునాతీరే" చిత్రంలో నాయిక వేషానికి కొత్తమ్మాయి కావాలి అని రెండు వారాల క్రితం నేనే వ్రాశాను. ఆ వార్త వచ్చిన అయిదు రోజులకల్లా కొత్తమ్మాయికి అనుకున్న పాత్రను చంద్రకళ కిచ్చినట్టు, దర్శకుడు దాసరి చెప్పారు.

చంద్రకళ గుడ్డిపిల్లగా నటిస్తున్నది. రాజబాబు నాయకత్వం వహించే యీ చిత్రంలో సావిత్రి, దేవిక, రమాప్రభ, నిర్మల, సత్యనారాయణ, ప్రభాకర రెడ్డి, అల్లు రామలింగయ్య, మాడా, శ్రీరాజ్, చిట్టిబాబు ముఖ్య పాత్రధారులు. దిడ్డికుమార్ (శ్రీహరిరావు అబ్బాయి) నిర్మిస్తున్న యీ చిత్రానికి నారాయణరావు మాటలను రచించారు.

— శ్రీవివాస్ ●

"బంగారు కలలు"లో ఒక దృశ్యం





గంగయ్య గంగిగోవులాంటి మనిషి కానే కాదు. ఈ విషయం ఆ వూళ్లో చాలా మందికి తెల్సు. అయినా అతను ఎదరపడినప్పుడు మాత్రం గంగిగోవులా భావించి పూజిస్తారు. ఎందుకంటే అతను చాలా పలుకుబడి గలవాడు. అతనెప్పుడూ బడికెళ్లి అ ఆ లు కూడా చదువుకోలేదు. బడికెళ్లి బాగా చదువుకున్నవాడి కంటే, పలుకుబడి గలవాడే గొప్ప అని చిన్నప్పుడే ఎవరో మంత్రోపదేశం చేసి పుణ్యం కట్టుకున్నారు. అప్పట్నించి పలుకుబడికోసం రకరకాల పలుకులు పలికి, పనులు చేసి డబ్బు సంపాయించాడు.

గంగయ్య అన్నిరకాల వ్యాపారాలూ చేస్తాడు. అతనికి తెలియని వ్యాపారం లేదు. ముఖ్యంగా మనిషికి కావాల్సిన తిండి, బట్ట, ఇల్లు వాటికి సంబంధించిన వ్యాపారాలు చేస్తాడు. అన్ని సరకులూ అమ్మే పెద్ద షాపు వుంది. అలాగే ఒక పెద్ద బట్టల షాపు వుంది. కలప, పెంకు, ఇటుక, సిమెంటు, ఇలా ఒక్కోదానికి ఒక్కో కొట్టు వుంది.

గంగయ్య చాలా తియ్యగా మాట్లాడతాడు. (అతని ఒంట్లో షుగరుంది.) అతగాడి మాటల తియ్యదనానికి అవతల వాడికూ్కడా షుగర్ కంప్లయింటు వచ్చేస్తుంది. ఎంత మంచివాడిచేతనైనా సరే తియ్యటి మాటల్జెప్పి చెడ్డ పని చేయించగల సమర్థుడు. నాలుగు పలుకులు పలికి ప్రవరాఖ్యుడ్ని వరూధిని దగ్గరకు పంపేయగలడు. అర్ధరాత్రిన పెళ్లాం బిడ్డల్ని వదిలేసి వెళుతున్న బుద్ధుడ్ని వెనక్కి పిలుచుకురాగలడు. శ్రీరాముడికి మరో పెళ్లి చేయగలడు. ఏడుకొండలవాడిచేత కుబేరుడితో 'నీకు నేను దమ్మిడీ బాకీ లేను, నీ తాతతో చెప్పుకో ఫో!' అనిపించగలడు.

ఇవన్నీ చేయగలడు. గలడే కాదు, చేస్తాడు. తనకోసం, తన రాబడికోసం, పలుకుబడికోసం చేస్తాడు. అలా అన్నీ పెంచుకొని ఎన్నికల్లో నిలబడి, పదవుల నలంకరించి, పదికాలాలపాటు అతని పేరు ప్రతినోటా పలకాలని అతని ఆకాంక్ష.

గంగయ్య అచిరకాలంలోనే బాగా డబ్బు సంపాయించాడు. అలా సంపాయించిన లక్ష్మీదేవిని వివిధ రూపాల్లో (ఉదా : వజ్రాలూ, బంగారం, నోట్లు వగైరా) బంధించాడు. లక్ష్మీదేవి కూడా హాయిగా అతనింట్లో ఇనప్పెట్టెల్లోనూ, గోడ అరల్లోనూ విశ్రాంతి తీసుకుంటోంది.

లక్ష్మీదేవికి చేతులు మారాలంటే మహచిరాకు. బీదవాళ్ల దగ్గరికీ, నెల జీతాలు తెచ్చుకుని బ్రతికే మధ్య తరగతి వాళ్లదగ్గరికీ వెళ్లదు. ఎందుకంటే, వాళ్ళు లక్ష్మీదేవిని దాచిపెట్టి విశ్రాంతి తీసుకోనివ్వరు, వెంటనే పంపేస్తారు గాబట్టి. అదే బాగా ధనవంతులు యిళ్ళల్లోనయితే, బోల్డుకాలం ఎంచక్కా విశ్రాంతి తీసుకోవచ్చు. అందుకే లక్ష్మీదేవి గంగయ్యని వదిలిపెట్టదు.

గంగయ్య చిరకాలకోరిక ఏమిటంటే, ముందు చెప్పినట్టుగా ఎన్నికల్లో నిలబడి పదవి నలంకరించడం. రోజూ పేపర్లో తన ఫొటో చూసుకోడం సన్మానాలూ, సభలూ, రిబ్బన్లు కత్తిరించడాలూ, వగైరాలు చూసుకోడం. మరి దీనికి బోల్డు డబ్బుగావాలి. ముందు ఎన్నికల్లో నిలబడాలంటే బోల్డు డబ్బు కావాలికదా. డబ్బు లేకుండా ఎన్నికల్లో నిలబడతానంటే జనం వూర్కోరుగదా. కూలీ నాలీ చేసుకొని బతక్క ఎన్నికల్లో నిలబడతాట్ట, ఎన్నికల్లో అని కోప్పడతారు. డిపాజిట్టు కట్టడానికి కూ్కడా డబ్బు కావాలి, మంచి తనాన్ని డిపాజిట్టు చేయడానికి రూల్సు ఒప్పుకోవుగద మరి.

అందుచేత — గంగయ్య డబ్బు సంపాయించడం మొదలెట్టాడు. అలా బాగా బాగా సంపాయించి

ఓ విమానం అద్దెకు తీసుకొని పైనుండి తన నియోజకవర్గం మీద నోట్లు విసిరి ఓడిపోకుండా గెలవాలని అతని వుద్దేశం. మొదటిసారి గెలవకపోతే మళ్లీ నాలుగేళ్ళో అయిదేళ్లో (అతనికి సరిగ్గా తెలియదు) ఆగాలి. అందాక అతను ఆగలేడు. చాలా తొందరగా పైకి వెళ్ళిపోదా మనుకుంటున్న మనిషి మరి. కాలం వృధా చేయకూడదనే కదా అతను బళ్ళోకి కూడా వెళ్ళలేదు.

అసలు సంగతి చెప్పుకోవాలి, అదే అతను డబ్బు ఎలా సంపాయిస్తున్నాడా అన్నది.

వ్యాపారం న్యాయంగా చేస్తే దాన్ని వ్యాపారం అనరు. పరోపకారం అంటారు. అన్యాయంగా చేసేదే వ్యాపారం. కొందరు 'మరీ అన్యాయంగా' చేస్తారు వ్యాపారం. ఆ కోవకి చెందిన వాడిల్లో ప్రథముడుగా చెప్పుకోవచ్చు గంగయ్యని.

అతను వున్న సరుకు వున్నట్టుగా అమ్మడు. అసలు సరుకులో మరోటి కలిపి అమ్ముతాడు. ఏపిటేదీ అని ఎవరూ అడగరు. అడిగితే, నవ్వి 'కలియుగం అంటే కల్తీ అని అర్థం' అంటాడు.

'కల్తీ చేయకపోతే ప్రజలు ఆరోగ్యంగా వుంటారు. అప్పుడు చావులుండవు. డాక్టర్లకి పను లుండవు. కేవలం పుట్టుక లుంటాయి. దానివల్ల అసలే అర్థంకాకుండా వున్న ఆర్థిక విధానం అల్ల కల్లోలమయి పోతుంది. జనాభా ఎక్కువయి రెండు కాళ్లమీద నిలబడ్డానికి చోటులేక ఒంటి కాలిమీద నిలబడాల్సి వస్తుంది.'

'కల్తీ అనేది ముఖ్యం. ఒక్కోసారి కల్తీ బాగా పనిచేస్తుంది. ఉదాహరణకి ఒకే రక్తం మనుషులకి పెళ్లి చేస్తే పనికిరాని పిల్లలు పుడ్తారు. అదే వేరొక రక్తం మనుషులను కలిపితే మంచి తెలివైన పిల్లలు పుడ్తారు. చిన్నప్పుడు నా కాల్లో ఎముక విరిగితే మరో జంతువు ఎముక వాడారు. మామూలు కాలికన్నా కల్తీ ఎముక కాలే బలంగా వున్నట్టు అనిపిస్తుంది.

ఇలా చెపుతుంటాడు

అతనితో పనివున్నవాడు అవుననక తప్పదు. గంగయ్య కూడా తనతో పనివున్నవాడికి మాత్రమే ఈ కల్తీ సంగతులు కల్తీలేకుండా ఖచ్చితంగా మాట్లాడతాడు.

కల్తీ

గంగయ్య కల్తీ చేసేప్పుడు కొన్ని ప్రయోగాలు చేస్తాడు. అదేమిటంటే కల్తీ సరుకు (తిండికి సంబంధించిన సరకులు) తిన్న మనిషి వెంటనే అర్జంటుగా చావకుండా, రోజుకి ఓ చెంచాడు ప్రాణం బయటికిపొయ్యే విధంగా కల్తీ చేస్తాడు. అతని సరకులు తిన్నవాళ్ళు వెంటనే చస్తే ప్రమాదం గదా మరి జనాభా పెరుగుదల నివారణ నిమిత్తం అని సంజాయిషి చెప్పుకున్నా ఎవరూ వినరుగదా, అందుకన్నమాట.

మిగతావాటి గురించి ఇక్కడ అనవసరం. నూనె, నెయ్యిలో అతను చేసే కల్తీ గురించి మాత్రం ఇప్పుడు అవసరం.

మంచినూనెలో, నెయ్యిలో మరో చెడ్డనూనె, చెడ్డనెయ్యి కనిపెట్టి కలిపాడు. తన పేటలో వున్న చంద్రయ్య అనే మిఠాయి దుకాణం వాణ్ణి పిలిచాడు. సంగతి చెప్పాడు. మామూలు రేటుకన్నా సగం ధరకు, నూనె, నెయ్యి ఎట్టుకపొమ్మన్నాడు. అన్ని రకాల వంటలూ చేసి అమ్మమన్నాడు.

చంద్రయ్య కూడా పాపం పైకిరావాలని కాంక్ష గల మనిషి. అందుకనే గంగయ్య చెప్పింది విని గంగిరెద్దులా తలూపి కొత్తరకం నూనె, నెయ్యి పట్టుకుపోయి, బజ్జీల దగ్గర్నుంచీ, బాదుషా వరకు తయారుచేసి దుకాణంలో పెట్టాడు.

* * *

చంద్రయ్య మిఠాయి దుకాణం బడికి చాలా దగ్గర. బళ్లో పిల్లలంతా అక్కడికొచ్చి కొంటుం టారు. చంద్రయ్య కొట్టు ప్రక్కనే మరో మిఠాయి కొట్టు వుండేది. అది సుబ్బయ్యది. సుబ్బయ్య చేసే ప్రతి పదార్థం పసందుగా వుండేదని ప్రతీతి. బళ్ళో పిల్లలందరూ అతని దగ్గరే కొనేవాళ్ళు. చంద్రయ్య దగ్గరికి ఎవరూ వెళ్ళేవారు కాదు. ఆ విధంగా చంద్రయ్య సుబ్బయ్యతో పోటీ చేయలేకపొయ్యేవాడు. కానీ గంగయ్య దయవలన ఉపదేశము పొంది, అత విచ్చిన తక్కువరేటు నూనె, నెయ్యిలతో పదార్థాలు తయారు చేసి అమ్మడం మొదలెట్టాడు. దాంతో అందరూ చంద్రయ్య దగ్గర కొనడం మొదలెట్టారు. పాపం సుబ్బయ్య కొట్టూ, నోరూ మూసుకున్నాడు.

ఇక చంద్రయ్యకు పోటీ లేకపొయ్యింది. విజృం భించడం ప్రారంభించాడు. చిన్న దుకాణం అల్లా పెద్ద దుకాణం అయింది. వ్యాపారం పెరిగింది.

బళ్ళోపిల్లలు (డబ్బు వున్నవాళ్ళు మాత్రం) తెగ కొనుక్కుని తినడం మొదలెట్టారు – అన్నీ చౌక కావడంతో. కొంతమంది పిల్లలు రోజూ కొనుక్కోలేకపోయినా అప్పుడప్పుడూ కొనుక్కునే వాళ్ళు.

సోము రోజూ కొనుక్కుని తినేవాడు. వాళ్ల అమ్మా నాన్నకి లేక లేక కలిగినవాడు గావడంచేత రోజూ నాలుగైదు రూపాయలు తెచ్చుకొని చంద్రయ్య కొట్లో స్వీట్లూ, హాట్లు కొనుక్కుని తినేవాడు. ఎక్కువ డబ్బు తెచ్చినప్పుడు, మిగతా వాళ్లకు కూడా పంచేవాడు. సోము తల్లి అతనికి ఏనాడూ డబ్బు ఇవ్వడం మానలేదు. ఎప్పుడైనా మానితే ఎలా వుండేదో ?

* * *

ఏనుగులాంటి గంగయ్య ఏకులా అయి పోయాడు – డాక్టర్ చెప్పింది విని.

'ఏం చేసినా లాభం లేదండి. కాళ్ళూ చేతులూ పడిపోయాయి. ఎక్కువ కాలం బ్రతకడు కూడా.' అన్నాడు డాక్టర్ సోముని పరీక్షించి.

గంగయ్య గోలపెట్టాడు.

'ఏమైనా మరి కొద్దికాలం బ్రతకాలంటే ఈ మందులు వాడండి' అని వ్రాసియిచ్చాడు డాక్టర్.

'కల్తీ మందులు అమ్ముతారు జాగ్రత్త. కాని వాటిని వాడేముందు నాకు చూపించండి' అని హెచ్చ రించి వెళ్ళిపోయాడు డాక్టర్.

ఎప్పుడూ ఏడవని గంగయ్య ఏడ్చాడు ఆ క్షణం. ఎందరినో పరోక్షంగా ఏడ్పించిన గంగయ్య ఏడ్చాడు ఆ క్షణం. అది చెడుకి చెప్పుదెబ్బ తగిలిన క్షణం.

'నాయనా సోమూ ! నాతండ్రీ ! లేక లేక కలిగిన బిడ్డవి. నిన్ను ఎంతో పెద్దవాణ్ని చేద్దామను కున్నాను. విదేశాలకి పంపించి ఇంజనీరుగా ఇండియాకు రప్పిద్దామనుకున్నాను. నా డబ్బూ, పలుకుబడీ నీకోసమేరా ! నేను గొప్పవాడ్నయి నిన్ను మరింత గొప్పవాడ్ని చేద్దామనుకున్నాను చివరికి నిన్ను అవిటివాడ్ని చేసాను.' అని నెత్తీ నోరూ బాదుకున్నాడు గంగయ్య.

'వేసవి'

జె. విప్లవకుమార్

వండ భానుని గుండె
కనలి, అనలము నిండి,
ఒక కొమ్మ నింకొకటి
ఒరసి, రాసుకు మండి...

కర్కశార్కుని 'గ్రీష్మ
రథము' గతులను తప్పి,
వాసుంధరా ధరము
వణికి, నాల్కలు సాపి...

వాడలో ఒక మ్రోడు
తనకు మిగిలిన ఒక్క
స్నేహితుడు— 'తన నీడ'
ఏడి ? యేడని ఏడ్చె...

ఇసుక మేటలు విచ్చి
సెలయేరు జీర్ణమై,
ధాత్రి చెక్కిటి మీద
కన్నీటి చారికై...

జాబిల్లి వెల్గుకై,
జడివాన జల్లుకై,
హరివిల్లు హేలకై
లోక మల్లల్లాడి...



(16 వ పేజీ తరువాయి)

'ఇక చాలు. ఎప్పటినుంచి దగ్గు ?'

'మొన్నటి నుంచి'

'మరి మొన్ననే ఎందుకు రాలేదు ?'

'పనివల్ల కుదరలేదు సార్'

'నిన్నెందుకు రాలేదు ?'

ఈయన లాయరు కావాల్సినవాడు తప్పి డాక్టరయ్యాడనుకున్నాడు. ఏమీ జవాబివ్వ లేదు సుబ్బారావు.

'పని ఎక్కువా ? ఆరోగ్యం ఎక్కువా ?' గర్జించాడు.

'రెండోదే డాక్టర్' ఒప్పేసుకున్నాడు సుబ్బారావు.

హుం అంటూ ఒకసారి హుంకరించి ప్రిస్క్రిప్షన్ రాసాడాయన.

చెయ్యి చాపాడు సుబ్బారావు.

'ముందు కన్సల్టేషన్ ఫీ ఇవ్వండి. అప్పుడే ఇది ఇస్తాను' ఖచ్చితంగా అన్నాడు.

'ఇచ్చెయ్యండి. మీరు అశ్రద్ధ చేసారని డాక్టరు గారికి కోపం వచ్చింది. ఆయన తల్చు కుంటే ఇంకెక్కడా మందు పుట్టకుండా చేయగలరు' అంటూ జడిపించాడు పక్కనున్న కాంపౌండరు.

ఇది డాక్టరుగిరీనో దాదా గిరీయో అర్థం కాలేదు సుబ్బారావుకు. క్షణంలోనే గ్రహించింది అతని మనసు. ఈ వూరిలో ఈ డాక్టరు ఇంత పెద్దవాడు ఎలా అయ్యాడో!

* * *

''మెడికల్ ఫిట్‌నెస్'' సర్టిఫికేట్లు ఇచ్చే వాడు ఎలా డబ్బులు గుంజుతారో భాగాతెలుసు సుబ్బారావుకు. అయినా అదిరూడా ఓ మారు చూసొద్దామని డాక్టర్ దూర్వాసరావు దగ్గర కెళ్ళాడు.

చిన్న సైజు బంగళా అది.

అక్కడ చాలామంది వున్నారు. కొందరు విద్యార్థులు. కొందరు అప్పుడే ఉద్యోగంలో చేరబోతున్నవారు. అందరూ పాతికేళ్ల లోపు వారే.

ఓ గంటసేపు కాచుకున్నాక సుబ్బారావుకు పిలుపొచ్చింది.

'నీ పేరు ?'

ఏకవచన ప్రయోగానికి కోపం వచ్చింది సుబ్బారావుకు. తమాయించుకున్నాడు. పేరు చెప్పాడు.

'హైట్?'

'ఐదు, ఐదు'

'వెడల్పు?'

పరీక్షించేది తననా సిదినా మీ మాంసలో పడ్డాను.

'నీ ఛాతీ ఎంత ?' గద్దించాడు.

'ముప్పయి ఆరు'

'బరువెంత ?' మరో పిడుగు

'నూట పాతిక' అక్కసుగా అన్నాడు.

'పౌన్లా? కేజీలా?'

'కేజీలని వ్రాసుకోండి' ఒళ్లు మండి అన్నాడు.

షాక్ తిన్నట్లు చూసాడు. ఇలాంటి పెడ సరపు మనిషిని ఎక్కడా తనసర్వీసులో చూడ లేదు దూర్వాసుడు.

కళ్లలోకి బేటరీ వేసి చూసి పెదవి విరిచాడు. 'లాభంలేదు. యూ ఆర్ అన్‌ఫిట్'

ఎందుకు ?

'కలర్ బ్లయిండ్ వుంది'

సుబ్బారావుకు ఒళ్లు కుతకుతలాడింది. ఇలా లేనిపోనివి అంటగడతాడా ?

అక్కడే వున్న కాంపౌండరు(బోకరనొచ్చు)

చెవిలో గుసగుసలాడుతున్నాడు.

'ఓ యాభై ఇచ్చేయండి. డాక్టరుగారు మీ కేసులేదని వ్రాసిచ్చేస్తారు.'

'ఏం వ్రాసి నాకళ్ళు బాగులేదన్నారు ?'

'మీకేం చెబితే తెలుస్తుంది ?' విసురుగా లన్నాడు అతను.

'ఎందుకు తెలియదు ? నేనూ డాక్టర్నే' అన్నాడు ఓపిక నశించిన సుబ్బారావు. దూర్వాసుడు, కాంపౌండరూ కళ్ళు తేలవేసారు. వాళ్ళ మొహాలు రంగులు తిరగడం చూడకుండనే లేచివచ్చేసాడు సుబ్బారావు.

* * *

అయితే ఈ యాత్రలో సుబ్బారావు మంచి డాక్టర్లను కూడా చూడకపోలేదు. వచ్చిన వారిని సానుభూతితో పలకరించి అర్థం చేసుకొని మందులిచ్చి పంపే వాళ్ళున్నారు. వాళ్ళ కూడా మంచి పేరును, ధనాన్ని ఆర్జిస్తున్నారు. కానీ దేశంలో వీరి శాతం తక్కువగా వుందని సుబ్బారావు వాదం.

కొన్ని పట్టణాలలో డాక్టర్లు డిస్పెన్సరీతో బాటుగా ఒక మెడికల్ షాపును కూడా నడపడం కద్దు. సాధారణంగా ఆ డాక్టర్లు ఆ షాపులో దొరికే మందులే వ్రాస్తూంటారని లేక ఆ షాపులోనే కొనమని సలహా ఇస్తుంటారని ప్రజలలో ఒక అభిప్రాయం వుంది. అలాంటివి సుబ్బారావుకు కూడా బాగా తెలుసు కాని సుబ్బారావు తనెళ్ళిన ఓ వూరిలో విచిత్రమైన వార్త విన్నాడు.

డాక్టరు కుటిలేశ్వరరావు మందులు వ్రాసివ్వటమే గాకుండా తక్కువ ధరలకు ఆ మందులు కూడా ఆయనే ఇచ్చేస్తున్నారట. ఈయనగారు ఆ వూరిలో అంత మంచి పేరు సంపాదించడంలో ఆశ్చర్యమేమీలేదు అనుకున్నాడు సుబ్బారావు. కాని ఆశ్చర్యపడ్డ విషయమల్లా మందులు తక్కువ ధరకు ఎలా ఇస్తున్నాడని.

మున్న రోగిగా మారి కుటిలేశ్వరరావును కలిసాడు. అయన బాగానే మాట్లాడి తగిన మందులు వ్రాసిచ్చి, మందులు పక్కగదిలోంచి తెప్పించి ఇచ్చాడు. మందులు కొనుక్కొని ఇంటికొచ్చాడు సుబ్బారావు.

తీరికగా కూర్చుని మందు తాగుదామనుకున్న సుబ్బారావు కాకతాళీయంగా సీసాపై వ్రాసివున్న పదాలనుచూసి నోటమాట లేక నిలుచుండిపోయాడు.

అలా సుబ్బారావు నోటమాట లేకుండా చేసిన పదాలివి.

"ఫిజీషియన్ సాంపుల్. నాట్ టు బి సోల్డ్."

* * *

ఈ బాధలన్నీ ఎందుకు, హాయిగా గవర్నమెంటులో చేరిపోతే బాగుండునన్న ఆలోచన వచ్చింది.

అక్కడ నెల తిరిగేసరికి నాలుగు రాళ్ళు చేతిలోకొస్తాయి. అయితే వీళ్ళ ఇదేకాకుండా ఇంకా అనేక విధాలుగ సంపాదిస్తున్నారన్న సంగతి సుబ్బారావుకు తెలియంది కాదు.

కుంటే ఆయన ప్రైవేటు డిస్పెన్సరీ కెళ్ళి ముడుపు సమర్పించుకోవాలి. ఇది ఇచ్చుకోలేక జనరల్ వార్డ్ పాలనుకుంటే వాళ్ళ నరకాన్ని ప్రత్యక్షంగాచూడొచ్చు. దుప్పటి మార్చాలన్నా, గది శుభ్రం చేయాలన్నా, స్ట్రెచ్చర్ తేవాలన్నా, దాన్ని తోసుకెళ్ళాలన్నా ప్రతీదానికి డబ్బే.

సుబ్బారావు యాత్ర ముందుకు కొచ్చేయ సాగింది. అది అతని డైరీలో ఆఖరి వూరు.

ఆ వూర్లో డాక్టర్ మిస్. హాలం పెద్ద పేరు మోస్తున్న డాక్టరమ్మని ఆవిడ, హస్తవాసి చాలామంచిదని విని వెళ్ళాడు సుబ్బారావు.

మిస్. హాలం అందమైన వాళ్ళలోనే లెక్క...

ఆవిడ చేతులు తెల్లగా మెరుస్తూంటే దేనితోనైనా పోల్చాలనిపించి తెలియలేక తను కవికాకుండా డాక్టరయినందుకు తనను తానే తిట్టుకున్నాడు.

'ఏమిటి చెప్పండి' అందావిడ రిస్టువాచీ వైపు చూసుకుంటూ.

'కడుపు నెప్పి'

సుబ్బారావు అభిమానమైన జబ్బది.



భయం. అందుకని ఎప్పుడు డ్రిల్లు క్లాసన్నా బయటకు తెలియని నొప్పి కడుపునెప్పని అనేవాడు. ప్రతిమారు ఇలా తప్పించుకుంటుంటే అయన కనుమానమొచ్చి దగ్గరుండి ఓసారి పర్గేటివ్స్ మింగించారని తనే చెప్పి నవ్వుకుంటుంటాడు.

'ఆ ఖల్లమీద పడుకోండి'

పడుకున్నాడు సుబ్బారావు. కడుపంతా గట్టిగా నొక్కేసింది. నిజంగా కడుపు నొప్పి వచ్చేస్తుందేమోననిపించింది సుబ్బారావుకు. అయినా తొణకకుండా చిరునవ్వు మొహం మీదకు తెచ్చుకున్నాడు. అంటే తనెంత సహనవంతుడో అని అనుకోవాలని సుబ్బారావు ఉద్దేశ్యం. అతని నవ్వు అపార్థం చేసుకుని 'ఏం నవ్వులాటగా వుందా?' అని కసిరి 'నర్సయ్యా మిక్శ్చర్ పట్రా' అంది.

ఆ నర్సయ్య ఎపడో ఎర్రటిద్రవం పట్టుకొచ్చాడు. దాంట్లో తెల్లటిపొడి కలిపాడు. అది చూస్తూంటే పూర్వకాలం రాజులకు, శత్రువులకు విషప్రయోగం చేసే కథల సన్నివేశాలన్నీ కళ్ళముందు గిర్రున తిరిగేయి.

'నోరు తెరవండి'అంటూఇంకా సుబ్బారావు పూర్తిగా నోరు తెరవకముందే మందంతా ఒక్కసారి నోట్లో పోసేసింది.

ఇద్దరూ వచ్చి మళ్ళీ కుర్చీలలో కూర్చున్నారు.

'ఎలా వుంది?'

'మరీ హాలాహలం' అంత తెలుగు ప్రయోగించినందుకు తర్వాత తనలో తానే ఆశ్చర్యపోయాడు.

'యూ సిల్లీ. నే నడిగింది కడుపు నొప్పి గురించి'అంటూనవ్వింది.

'పోయింది' అన్నాడు సుబ్బారావు నవ్వుతున్నప్పుడు సొట్టలుపడినబుగ్గలనుచూస్తూ.

(44వ పేజీ చూడండి)

పెట్టిపుట్టనివాళ్ళు



చంద్రం

పెద్దకథ

తండ్రిమాట విన్నతర్వాత పిల్లల ముఖాలు సంతోషంతో అప్పుడే విచ్చిన తామర పువ్వుల్లా కళకళ లాడినాయ్.

బైటికి వెళ్లిన అవతారం ఏ పనీ లేకపోయినా బజార్లన్నీ వెడతిరిగేశాడు.

తను ఒట్టు అనగానే పిల్లల మొహాల్లో కనిపించిన తృప్తి, ఆనందం... ఎప్పుడూ వాటిని అలాగే చూడగలిగితే వోహ్... ఏమైనాసరే ఈ సారి మాట నిలబెట్టుకోవాలి అనుకున్నాడు అవతారం.

కాని, ఎలా ?

అమ్ముకోటానికి యింట్లో ఉపయోగపడేవేమీ లేవు. అప్పు తీర్చే అవకాశం లేని తను అప్పు చెయ్యాలనుకోవటం కోరి కొరివితో తలగోక్కున్నట్టేఅవుతుంది. అసలు అప్పు చెయ్యాలనుకుంటే మాత్రం తనకిచ్చే వాడెవడు ?

మరి ఎలా ?

పిల్లలు కోరిన ఒక్క కోరిక, సాధారణమైన కోరిక తీరుస్తానని ఒప్పుకొని, ఒట్టు వేసి తీర్చలేక పోతే వాళ్లకి మొహం ఎలా చూపించ గలుగుతాడు ? ఆ పరిస్థితిలో యింకతను బ్రతకటమే వ్యర్థం. నిజానికి యిలాంటివన్నీ వాళ్లచేత అడిగించుకొని తీర్చవలసిన అవసరాలు కావు. తనే ఎప్పటికప్పుడుగుర్తించి తీరుస్తుండాలి. ఆ బాధ్యత తనదే.

బాగా ఆలోచించాడు అవతారం.

సంక్రాంతి పండుగ వచ్చేది జనవరిలో. అంటే కొత్త సంవత్సరంలో. సంవత్సరంలో ఒకసారి 'ఫెస్టివల్ అడ్వాన్సు' తీసుకోవచ్చు. జరుగుతున్న సంవత్సరంలో ఎప్పుడో అడ్వాన్సు తీసేసుకోవటం, ఖర్చు పెట్టెయ్యటం కూడా జరిగిపోయింది. జనవరి ఒకటి నుండి కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది. కాబట్టి మళ్లీ 'ఫెస్టివల్ అడ్వాన్సు'కి దరఖాస్తు పెట్టుకోవచ్చుతను.

సంక్రాంతికి ఫెస్టివల్ అడ్వాన్సు కావాలని దరఖాస్తు పెట్టాడు అవతారం.

పద్మవ్యూహంలో సైంధవుడిలా ఆదిలోనే అడ్డు అడ్డుపడ్డాడు అయ్యగారు.

"వంద రూపాయలు అడ్వాన్సు తీసుకొని ఏం చేస్తావ్ మిష్టర్ అవ్‌టారం ?" అని ప్రశ్నించారు అయ్యగారు యింగ్లీషులో.

"నా శ్రాద్ధం పెట్టుకుంటాను" అనందామనుకున్నాడు అవతారం. కాని ఏళ్ల తరబడి అధికారుల ఎదు విధేయత అభినయిస్తున్న గుమాస్తా

(గత సంచిక తరువాయి)

అవతారం అలా అనలేక పోయాడు.

"పిల్లలకి కొత్తబట్టలు కుట్టించాలిసార్ ?" అన్నాడు. వినయ విధేయతలు వుట్టి పడుతున్న స్వరంతో, చేతులు నలిపేసుకుంటూ.

"ఆల్‌రైట్" అన్నారు అయ్యగారు.

"హమ్మయ్య" అనుకున్నాడు అవతారం.

సంక్రాంతి కని పెట్టుకున్న దరఖాస్తు గ్రాంటు అయింది. కాని, సంక్రాంతి వెళ్లిన వారం రోజులకు గాని డబ్బు చేతికి రాలేదు.

సంక్రాంతి పండుగనాడు అవతారం యిల్లు చేపల మార్కెట్ చేసి పారేశారు అతని పిల్లలు.

అవతారం ఎంతో వోర్పుగా పిల్లల్ని బుజ్జగించాడు.

"సంక్రాంతి, దీపావళి, ఉగాదీ... యివే కాదు బాబూ పండగలంటే మనం ఎప్పుడు పిండి వంటలు చేసుకొని, కొత్త బట్టలు కట్టుకొని, సంతోషంగా ఉంటామో అప్పుడే మనకు పండుగ" అని చాలా రకాలుగా పండుగలు గురించి చెప్పి చూశాడు అవతారం.

అతని మాటల్లోని సారాంశం పిల్లలకి బోధపడిందో లేదో తెలీదు గానీ రెండు రోజులు గోలపెట్టి మూడోరోజు వూరుకున్నారు.

డబ్బు చేతికి వచ్చిన రోజున రాత్రి పిల్లలంతా నిద్రపోయిం తర్వాత అవతారం, ఆదిలక్ష్మి కూచున్నారు. పిల్లల్ని సంతోష పెట్టటానిగ్గాను ఈ వంద రూపాయలు ఎలా ఖర్చుపెట్టాలి అన్న విషయం గురించి చాలా రాత్రి వరకూ తర్జన భర్జనలు జరిపారు. ఎన్నో ప్రతిపాదనలు చేశారు. చివరికి ఈ విధంగా అమలు పర్చాలని తీర్మానించుకున్నారు.

ఆదిలక్ష్మికి, కట్టుకోటానికి సరైన బట్టలు లేవు. కాబట్టి ఆమెకు చీరా, జాకెట్టు తీసుకోవాలి.

నలుగురు పిల్లలకి ఒక్కొక్కడికీ ఒక్కొక్క జత చొప్పున బట్టలు కుట్టించాలి.

అవతారాని గ్గూడా సరైన బట్టలేవు. కాని ఈ సారికి అతన్ని వదిలెయ్యటం జరిగింది. లేకపోతే డబ్బులు చాలవు.

గారెలు వండుకోవాలి.

పులిహోర, సేమ్యా పరమాన్నం చేసుకోవాలి.

ఆ సాయంత్రం అందరూ సరదాగా సినిమాకి వెళ్లాలి.

ఇవన్నీ ఆ వంద రూపాయల్లోనే సరిపెట్టుకోవాలి. అంచేత ఫలానా దానికింత, ఫలానాదీనికింతా అనిఅన్నీ విడివిడిగా ఒక కాగితం మీద నోట్ చేసుకోవడం గూడా జరిగింది.

అనుకున్న ప్రకారం ఆదిలక్ష్మికీ చీరా జాకెట్టు తీసుకున్నారు. నలుగురు పిల్లలకీ నాలుగు జతల బట్టలు కుట్టించారు.

* * *

ఒక ఆదివారం నాడు ఉదయం—

నలుగురు పిల్లలకీ తలంటి స్నానం చేయించింది ఆదిలక్ష్మి.

అప్పుడే కొత్త బట్టలు కట్టేసుకుంటామన్నారు పెద్ద పిల్లలిద్దరూ.

"ఇప్పుడే కట్టేసుకుంటే నలిగి పోతాయ్. సాయంత్రం సినిమాకి వెళ్తాం కదా. మధ్యాహ్నం కట్టుకుందురుగాని" అంది ఆదిలక్ష్మి.

"సరే" అన్నారు సినిమాక్కూడా వెళ్తాం అన్న ఆనందంలో వాళ్ళు.

అవతారం దగ్గిర కూచొని సాయం చేస్తుండగా పొయ్యి దగ్గర కూచుంది ఆదిలక్ష్మి.

గారెలు అయిపోయినయ్.

పులిహోర కూడా పూర్తైంది.

సేమ్యా అవుతూ వుండగా బైట ఆడుకుంటున్న పెద్ద కుర్రాడు "నాన్నోయ్" అని కేకవేశాడు.

"ఏవిటో"అని గబగబా బైటికివెళ్లాడు అవతారం.

ఇంటి ముందు రిక్షా ఆగింది.

రిక్షాలోంచి జయలక్ష్మి, ఆమె నలుగురు పిల్లలూ బిలబిలమంటూ దిగుతున్నారు.

రెండేళ్లక్రితం వచ్చి, తనకీ, పిల్లలకీ బట్టలు పెట్టలేదని అలిగి వెళ్లి పోయిన అవతారం ఏకైక తోబుట్టువు జయలక్ష్మి.

"కులాసా అమ్మా"? అన్నాడు అవతారం సంభ్రమంగా.

"కులాసా అన్నయ్యా" అంది జయలక్ష్మి.

"అత్తయ్య అత్తయ్య" అంటూ హుషారుగా కేకలు వెయ్యసాగారు పిల్లలు.

ఈ హడావిడికి ఆదిలక్ష్మి కూడా బైటికొచ్చింది.

అప్పటికే చెల్లెలి చేతిలోని చంటివాణ్ని అందుకొని ముద్దులాడసాగాడు అవతారం.

రాకరాక వచ్చిన ఆడపడుచుని చూసి ఆదిలక్ష్మి కూడా సంతోషపడింది. వెంటనే లోపలికెళ్లి చెంబుతో నీళ్లు తెచ్చి యిచ్చింది.

కాళ్లు కడుక్కొన్న జయలక్ష్మి "ఇదేంటన్నయ్యా బంగారం లాంటి ఆ యిల్లు వదిలేసి ఈ యిరుకు సందులో కొచ్చి పడ్డారు. వీరింకా అక్కడే వున్నా

రనుకొని, తిన్నగా అక్కడికే వెళ్ళాను. ఆ ఎదురింట్లో వున్నావిడ వీరిక్కడికి మారి పోయారని గుర్తులు చెప్పింది. ఐనా యిల్లు పట్టుకోవటం కష్టమై పోయింది. అదీ గుమ్మంలో మన సీనిగాణ్ని చూసి యిక్కడ ఆగాను గాని, లేకపోతే యింకా ముందుకి పోయేదాన్ని!'' అంది ఆయాస పడిపోతూ జయలక్ష్మి.

అప్పటికే టైము పదకొండు గంటలైంది.

పిల్లలంతా ఆవురావురుమంటున్నారు.

''ప్రొద్దు టెప్పుడు బయల్దేరారో భోంచేద్దురు గాని రండి'' అంది ఆదిలక్ష్మి.

''మరే'' అన్నాడు అవతారం.

అవతారానికి చెల్లెలంటే ఎంతో అభిమానం. పుట్టింటి తరపు నుంచి ఆమె పొందవలసిన ఆదరణ పొందలేక పోతోందని అతను బాధ పడుతుంటాడు. అందుక్కారణం తన అసమర్థతే అని విచారిస్తుంటాడు.

పిల్లలంతా వంటింట్లో పోయి కూచున్నారు.

''అందరూ ఒక్కసారే కూచుంటే కంచాలు చాలవు. ముందు అత్తయ్యా వాళ్ళు కూచుంటారు. తర్వాత తిందురు గాని'' అంది ఆదిలక్ష్మి

పెద్ద పిల్లలిద్దరూ తల్లివంక రుసరుస చూస్తూ బైటికి వెళ్ళి పోయారు.

చిన్న పిల్లల్ని ముందు గదిలోకి తీసుకుపోయి కబుర్లు చెప్పసాగాడు అవతారం.

''వాళ్ళని కూడా కూచోనివ్వక పోయావా వదినా'' అంది జయలక్ష్మి.

''ఒద్దులేమ్మా అల్లరి చేసి పారేస్తారు'' అంది ఆదిలక్ష్మి.

ఒక్కొక్క వంటకాన్ని రుచి చూస్తూ ''మేం వస్తున్నట్లు మీకు ముందే తెలిసిందేమిటి వదినా. పిండివంటలు కూడా చేసి అట్టే పెట్టావ్!'' అంది తృప్తిగా నవ్వుతూ జయలక్ష్మి.

ఆదిలక్ష్మి చిన్నగా నవ్వేసి వూరుకుంది.

ఇంకా కావాలంటే ఇంకా కావాలని జయలక్ష్మి పిల్లలు పోటీలు పడి గారెలూ బూరెలు పులిహోర వూదిపారేశారు. సేమ్యా పరమాన్నం గ్లాసుల్లో పోయించుకొని మంచి నీళ్ళు తాగినట్లు గ్లాసు మీద గ్లాసు పట్టించేశారు.

జయలక్ష్మి కూడా వంటకాలు బాగా నచ్చినయ్ ''చాలా రుచిగా వున్నాయి వదినా!'' అని వదినగార్ని మెచ్చుకుంది.

''ఇంకాస్త, ఇంకాస్త'' అంటూ కొసరి కొసరి తినిపించింది జయలక్ష్మిని ఆదిలక్ష్మి.

''చాలు చాలు'' అంటూనే సాధ్యమైనంత ఎక్కువగా తిని, తృప్తిగా త్రేన్చింది జయలక్ష్మి.

జయలక్ష్మి ఆమె పిల్లలూ భోజనాల దగ్గర నుంచి లేచేటప్పటికి ఇచ్చితంగా పన్నెండు గంటలైంది.

ముందు గదిలో ఆకలికి మెలికలు తిరిగి పోతున్న పిల్లల్ని చూసి అవతారం అనుభవించిన బాధ వర్ణనాతీతం.

''ఇంక మీరు రండి'' అని కేక పెట్టింది. భర్తనుద్దేశించి ఆదిలక్ష్మి. అంతవరకు హృదయములో అగ్ని పర్వతాలు బద్దలవుతున్నా నిండు కుండలా తొణక్కుండా వుంది ఆదిలక్ష్మి.

జయలక్ష్మి పిల్లల్ని తీసుకొని ముందు గదిలోకి వెళ్ళింది.

పిల్లల్ని తీసుకొని వంటగదిలోకి వచ్చాడు అవతారం వరసగా కంచాలు ముందు కూచున్నారు.

అందరి కంచాల్లోను ఒక్కొక్క గారె, గుప్పెడు పులిహోర వడ్డించింది. ఆదిలక్ష్మి. ఎందుకైనా మంచిదని వంటగదికీ ముందు గదికీ మధ్యనున్న తలుపులు దగ్గరగా చేరవేసి వచ్చింది.

చిన్న పిల్లలిద్దరూ కంచాల్లో వున్నది తినసాగారు. సీనిగాడు , నానిగాడు తల్లివంక ప్రశ్నార్థకంగా చూడసాగారు.

''తినండి'' అంది ఆదిలక్ష్మి.

''ఒక్కొక్కటేనా?'' అన్నాడు సీరియస్‌గా నానిగాడు.

''అలా అనకూడదు బాబూ! అత్తయ్య వాళ్ళు వచ్చారుగా'' అన్నాడు సాధ్యమైనంత నెమ్మదిగా అవతారం.

''అత్తయ్యా వాళ్ళు వస్తే!''నిలేశాడు నానిగాడు.

''అందరికీ సరిపోవాలిగా మరి'' అంది అనునయిస్తున్నట్లు ఆదిలక్ష్మి.

''చాలా వండావుగా!''

వాళ్ళకెలా నచ్చ చెప్పాలో అర్థం కాలేదు ఆదిలక్ష్మికి.

తన కంచంలో వున్న ఒక్క గారే తీసి నానిగాడి కంచంలో వేశాడు అవతారం. అది చూసి సీనిగాడు కూడా తండ్రివంక చూశాడు. పులిహోర తీసి సీనిగాడి కంచంలో వేశాడు.

''అల్లరి చేయకండా తినండి బాబూ!'' అన్నాడు ప్రాధేయ పడుతున్నట్టు.

పిల్లలచేత అల్లరి పడటం వాళ్ళకేం కొత్తకాదు. కాని జయలక్ష్మి ముందు యిలాంటి విషయాల్లో అల్లరి పడ్డం ఆ దంపతులకి యిష్టం లేదు.

ఏమనుకున్నాడో ఏమో నానిగాడింక మాట్లాడ లేదు.

సీనిగాడు కూడా తినడంలో లీనమై పోయాడు.

కాస్సేపక్కడే కూచొని, తర్వాత చెయ్యి కడుక్కొని, లేచి పోయాడు అవతారం.

చిన్న పిల్లలిద్దరికీ 'ఇదేమి'టని అడిగే వయసు లేదు. అంచేత మాట్లాడకుండా కంచంలో వేసింది తిన్నారు.

పెద్ద పిల్లలిద్దరూ గుర్తు తెలిసిన వాళ్ళవటం వల్ల వాళ్ళతోనే పెద్ద యిబ్బందై పోయింది అవతారానికీ. ఆదిలక్ష్మికీ. సీనిగాడు కాస్త ఫరవాలేదు. చెప్తే వింటాడు. నానిగాడు అలా కాదు. ప్రతీదానికి ఆరాలు తీసి, నిలేసి అడుగుతాడు. కొన్ని సందర్భాల్లో అలిగి అన్నం కంచం ముందుకి గెంటేసి, బైటికి వెళ్ళిపోయిన సంఘటనలు కూడా వున్నాయ్. అంచేత



వాడంటే జడుస్తుంటారా తల్లితండ్రులు. వాళ్ళు చేసుకున్న పుణ్యమనాలో, మరోటనాలో తెలీదుగాని భోజనాల దగ్గర యింకేమీ గొడవ పెట్టలేదు నానిగాడు.

చేతులు కడుక్కుని లేచి పోయారుగాని, పెద్ద పిల్లలిద్దరికీ ఏమీ తృప్తి కలగలేదు.

పిల్లలు నలుగురూముందుగదిలోకి వెళ్ళిపోయారు.

అవతారం ఆదిలక్ష్మి రహస్యంగా కాస్సేపేదో మాట్లాడుకున్నారు వంటగదిలో.

మధ్యాహ్నం కాస్త నడుం వాలుస్తానని చెప్పి ఒక వారగా చాప పరుచుకొని పడుకుంది జయలక్ష్మి.

పిల్లలంతా ఒక దగ్గిర గుంపుగా చేరి ఆడుకోసాగారు.

మూడు గంటలవేళ నానిగాడు తల్లిదగ్గరకొచ్చి "కొత్త బట్టలు బైటికి తియ్యి. కట్టుకుంటాం" అన్నాడు.

వెంటనే ఆదిలక్ష్మి వాడ్నిరెక్కపుచ్చుకుని

పెట్టి పుట్టని వాళ్ళు

పెరట్లోకి తీసికెళ్ళి పోయింది.

"కొత్త బట్టలు యివ్వాళ వద్దు నానీ. తర్వాత కట్టుకుందురు గానీ" అంది నెమ్మదిగా.

"ఏం సినిమాకెళ్ళవద్దా మరి!" అన్నాడు అమాయకుడు నానిగాడు.

"అత్తయ్యా వాళ్ళు వచ్చారుగా మరి ?" అంది ఆదిలక్ష్మి.

"అత్తయ్యా వాళ్ళు వస్తే సినిమాకెళ్ళగూడదా?'

"ఎలా వెళ్తాం వాళ్ళు మన చుట్టాలు కదా! వాళ్ళందర్నీ యింట్లో వదలిపెట్టి మనం సినిమాకెళ్ళి పోకూడదు."

"అయితే పోనీ వాళ్ళని కూడా మనతో సినిమాకి తీసికెళ్దాం."

ఆదిలక్ష్మికి సహనం పట్టుతప్పి పోయింది. 'ఇలాంటి బాధలు పగవాడిక్కూడా వద్దు భగవంతుడా!' అనుకుంది తెలిసీ తెలీని పిల్లలు. నయానచెపితే వినరు. కొడితే ఏడుస్తారు. ఇలాంటి పరిస్థితుల్లో అసలు వాళ్ళని కొట్టటానికి చేతులు కూడా రావు. కాని, కొట్టకపోతే పరువు దక్కనివ్వరు.

'చెప్తుంటే నీక్కాదు. మొండి ప్రశ్నలన్నీ వేస్తావ్?" అంది కాస్త కోపంగా ఆదిలక్ష్మి. పొద్దున కూడా చెప్పావుగా యివాళ సినిమా కెళ్దామని."

"అవును, యిప్పుడొద్దంటున్నానుగా. మాట వినిపించుకోవే!"

"నువ్వెప్పుడూ అంతే"—

"ఇంకోసారెప్పుడేనా వెళ్దాంలే నానీ!' అంది మళ్ళీ అనునయిస్తున్నట్టు గానే ఆదిలక్ష్మి.

కాని నానిగాడు అదేం వినిపించుకోలేదు. "నాకదేం కుదర్దు. నా బట్టలు నాకు తీసిచ్చేయ్." అంటూ మారాం చెయ్యసాగాడు.

ఆదిలక్ష్మికింక కోపం ఆగలేదు.

"మొండి వెధవా. ముద్దిస్తుంటే మరీ నెత్తికెక్కుతున్నావ్. చెప్పిన మాట వింటావా లేదా?" అంటూ నెత్తిమీద ఒక్క మొట్టికాయ మొట్టింది.

దాంతో పౌరుషం వచ్చింది నానిగాడికి. స్వరం కాస్త హెచ్చించి— "ఇందాకా అంతే. అన్నిగారెలూండి ఒక్కొక్కటే పెట్టావ్. ఇప్పుడు . . . " అని యింకా ఏదో అనబోయాడు.

"నోర్మూయ్యరా వెధవా" అని యింకో మొట్టికాయ కాస్త గట్టిగానే తగిల్చింది.

బుర్ర అదిరింది. నానిగాడికి. ఏడుపు లంకించుకున్నాడు.

"నోరెత్తావంటే చంపేస్తాను. మూసెయ్ నోరు." అంటూ అందుబాటులో ఉన్న ఒక్కర్ర ముక్క చేతిలోకి తీసుకుంది.

ఆ కర్ర ముక్కతో రెండు వడ్డించిం తర్వాత నోరు మూసేశాడు నానిగాడు.

"కిక్కురు మనకుండా పోయి వాళ్ళతో కలిసి ఆడుఆడుకో. ఆడుకుంటావా?"

ఆడుకుంటానన్నట్టు బుర్రవూపి, అక్కణ్నించి పిల్లలంతా ఉన్న చోటికి వెళ్ళిపోయాడు నానిగాడు.

పొంగి వస్తున్న దుఃఖాన్ని బలవంతాన ఆపుకొని, తనూ లోపలికి వెళ్ళిపోయింది ఆదిలక్ష్మి.

బట్టలేసుకువి బజారువెళ్తూ సీనిగాణ్ణి గూడా తనవెంట తీసుకెళ్ళాడు అవతారం.

దార్లో ఒకపది పైసలు పకోడీలు కొనిచ్చి, కాస్సేపు ఆ మాటా ఈ మాటా చెప్పి, సినిమా గురించి కొత్త బట్టలు గురించీ ఆ రోజున పేచీ పెట్టొద్దని గడ్డం పుచ్చుకొని బ్రతిమలాడాడు అవతారం సీనిగాణ్ణి.

పకోడీలు తినేసి 'అలాగే' అన్నాడు సీనిగాడు.


ఆ పూటకి కావలసిన కూరగాయలు కొనుక్కొని యింటికి తిరిగివచ్చాడు అవతారం.

రెండోరోజు సోమవారం.

ప్రొద్దున్నే చద్దన్నాలు తినేసి బడికి వెళ్ళిపోయారు సీనిగాడు, నానిగాడు.

ఆ రోజే తను వెళ్ళిపోతానని చెప్పింది జయలక్ష్మి. ఆ మాట రాత్రే చెప్పింది మాటల సందర్భంలో.

"మిమ్మల్ని చూసి చాలా కాలమైంది కదా అని


"GOKUL"
SANTOL
TOILET POWDER
T. S. R. & CO.
"GOKUL"
SANTOL
TOILET POWDER

కరణత్రయ తపస్సు - ధర్మపథం

అడవుల్లో ఏకాంతవాసం చెయ్యటం, ఉపవాసాలతో శరీరాన్ని కృశింప జేయడం మాత్రం తపస్సని అనిపించుకోదు. తపస్సుకు ప్రధాన లక్ష్యం ఏకాగ్రంగా ఉండటం. దానికి త్రికరణాలనూ స్వాధీనంలో ఉంచుకోవడం అవసరం. మనస్సు, వాక్కు, శరీరం అనే మూడున్నూ, కరణాలని ప్రసిద్ధి. వాటి ననుసరించి ఆచరించబడే తపస్సున్నూ మానసం, వాఙ్మయం, శారీరం అని మూడువిధాలు.

దేవతలను, ద్విజులను గురువులను విద్యావేత్తలను పూజించడం, శుచిగా ఉండడం, సత్త్వవర్తన కలిగి ఉండడం, బ్రహ్మచర్యం, హింస చెయ్యకుండా ఉండడం శరీర సంబంధమైన తపస్సుకు లక్షణాలని

'దేవ ద్విజ గురు ప్రాజ్ఞ
పూజనం శౌచ మార్జవమ్,
బ్రహ్మచర్య మహింసా చ
శారీరం తప ఉచ్యతే'

అనే శ్లోకం తెలియ జేస్తున్నది.

'అను ద్వేగకరం వాక్యం
సత్యం ప్రియ హితం చ యత్,
స్వాధ్యాయా భ్యసనం చైవ
వాఙ్మయం తప ఉచ్యతే.'

అనే శ్లోకాన్ని బట్టి యితరుల మనస్సుకు నొప్పి కలిగించకుండా సంభాషించడం, సత్యాన్నీ, ప్రియమైనదాన్నీ, హితంగా ఉండేదాన్నీ మాటాడుతూ ఉండడం, వేదాధ్యయనం చెయ్యడం వాక్సంబంధమైన తపస్సని తెలుస్తూ ఉన్నది.

"మనః ప్రసాద స్సౌమ్యత్వం
మౌన మాత్మ వినిగ్రహః,
భావ సంశుద్ధి రిత్యేతత్
తపో మానస ముచ్యతే."

అనే శ్లోకాన్ని అనుసరించి మనస్సు ప్రసన్నంగా ఉండుట, సౌమ్యమైన స్వభావం, ఆత్మ నిగ్రహం, అంతః కరణ పరిశుద్ధి— అనేవి మనస్సుకు సంబంధించిన తపస్సునకు లక్షణాలని తెలుస్తున్నది.

కరణ త్రయానికి సంబంధించిన యీ లక్షణాలు కల తపోనియమం ఉన్నవాడు దేని నయినా సాధించగలరు.

బులుసు వెంకటరమణయ్య



ఒకసారి చూసిపోదామని అనుకోకుండా బయల్దేరి వచ్చాను. మరుసటి రోజునే తిరిగి వచ్చెయ్యమని ఆయన చెప్పారు. ఇవ్వాళ వెళ్లకపోతే మళ్లీ ఆయనకి కోపం వస్తుంది" అంది జయలక్ష్మి.

మాట వరసకి, అనకపోతే బావుండదని, "ఇంక రెండ్రోజులుండవమ్మా" అని అన్నారు గాని ఎక్కువగా బలవంత పెట్టలేదు అవతారం, ఆదిలక్ష్మి.

సాయంత్రం బండికైతే పిల్లల్తో యిబ్బందిగా ఉంటుందని తొమ్మిది గంటల బండికే ప్రయాణ మైంది జయలక్ష్మి.

కాళ్లకి పసుపు, మొహాన కుంకుమబొట్టూ పెట్టి, కొత్తచీరా, జాకెట్టూ కట్టుకోమని యిచ్చింది ఆదిలక్ష్మి జయలక్ష్మికి.

పెట్టెలోంచి నాలుగు జతల బట్టలూ తీసి, జయలక్ష్మి పిల్లలకి తనే స్వయంగా తొడిగింది, ఆదిలక్ష్మి.

"ఇప్పుడివన్నీ ఎందుకు వదినా ?" అని పైకి అందిగాని, అన్నయ్య యింత జల్సాగా అందరికీబట్టలు పెడ్తాడనుకోలేదు. "పెద్దపిల్లలిద్దర్నీ కూడాతీసుకు రావల్సింది" అని లోపల బాధపడింది జయలక్ష్మి.

పోయినసారి బట్టలు పెట్టలేదని జయలక్ష్మి అలిగి వెళ్లి పోవటం అవతారానికి గుర్తొంది. ఆదిలక్ష్మికీ గుర్తుంది.

"పోయినసారి నువ్వు పిల్లల్తో వచ్చినప్పుడు ఏవీ పెట్టలేక పోయాం. రాకరాక వచ్చావు. ఈ సారిగూడా ఏవీ పెట్టకపోతే నలుగురూ ఏమను కుంటారు" అంది ఆదిలక్ష్మి అడపడుచుతో.

వయసులో కాస్త తేడాలు ఉన్నా అవతారం పిల్లలకని కుట్టించిన బట్టలు కాస్త అటూ యిటూగా జయలక్ష్మి పిల్లలకి సరిపోయినయ్.

కొత్తచీరె కట్టుకొని, జాకెట్టు తొడుక్కుంటూ

పెట్టి పుట్టని వాళ్లు

"మనిద్దరాదీ ఒకటే కొలతే, ఈ జాకెట్టు యింత బిగువుగా కుట్టించావేం ?" అందియిబ్బందిగా మొహం పెట్టి జయలక్ష్మి.

ఆదిలక్ష్మి కావాలని జాకెట్టు బిగువుగా కుట్టించుకుందో, లేక ఆ జాకెట్టు ఆదికి ఆమె శరీరం చిక్కిపోయిందో అంత వరకు గమనించనేలేదు జయలక్ష్మి.

"రెండ్రోజులుండమంటే ఉండ నంటుంటివి. ఉన్న పళంగా మనకి బట్టలెవరు కుట్టి పెట్తారు చెప్పూ !" అంది ఆదిలక్ష్మి. కొత్త చీర కట్టుకున్న జయలక్ష్మి వంకా, కొత్త బట్టలు తొడుక్కున్న ఆమె పిల్లల వంకా మార్చి మార్చి చూస్తూ.

రెండు రిక్షాలు పిల్చుకొచ్చాడు అవతారం.

ఒక రిక్షాలో జయలక్ష్మి చిన్న పిల్లలిద్దరూ ఎక్కారు.

రెండో రిక్షాలో పెద్ద పిల్లలిద్దరూ, అవతారం ఎక్కారు.

గుమ్మంలో నిల్చున్న ఆదిలక్ష్మితో "వెళ్లొస్తా వదినా ?" అంది జయలక్ష్మి రిక్షాలు కదుల్తుండగా.

"మంచిదమ్మా జాగ్రత్తగా వెళ్లిరండి" అనేసి గిరుక్కున వెనక్కి తిరిగి పోయింది ఆదిలక్ష్మి.

అంత వరకూ బలవంతంగా ఆపుకున్న కన్నీళ్లు ఒక్కసారే పెల్లుబికి బైటికి వచ్చేసినయ్.

ఆమె వెనకే బోసి మొలల్తో నిలబడి, అమాయకంగా చూస్తున్న చిన్నపిల్లలిద్దర్నీ రెండు చేతుల్తో ఒక్కసారే అక్కున చేర్చుకొని, వెక్కి వెక్కి ఏడ్చింది ఆదిలక్ష్మి.

సినిమా కని అట్టే పెట్టిన డబ్బుల్తో చెల్లెలికీ, పెద్ద మేనల్లుళ్లిద్దరికీ టిక్కెట్లు కొని, అందర్నీ బండెక్కించి, అట్నుంచటే ఆఫీసుకు వెళ్లిపోయాడు అవతారం.

స్కూలు నుంచి తిరిగి వచ్చి, కొత్త బట్టలు గురించి ప్రశ్నించిన పెద్ద పిల్లలిద్దరికీ ఆ తల్లి తండ్రులు ఏం సంజాయిషీ చెప్పుకుంటారు ఎలా సముదాయిస్తారు ?— అన్న ప్రశ్నలకి సమాధానం రచయితే చెప్పనక్కర్లేదు. ఆ మాత్రం పాఠకులు వూహించుకోగలరు. రచయితే చెప్పాలను కుంటే కథ మరి కాస్త పొడిగించటం అవుతుంది తప్ప, ఈ కథకి అదేంత మాత్రం ముగింపు కాదు.

ఇంకో మరో ముఖ్యమైన విషయం చెప్పవలసి ఉంది.

ఫెస్టివల్ అడ్వాన్సు పేరుతో గవర్నమెంటు వారి దగ్గర వంద రూపాయలు అప్పుగా తీసుకున్నాడు అవతారం. వందరూపాయలు ఖర్చై పోయినయ్. ఆ వంద రూపాయల్తో ఒక సుందర స్వప్నం నిర్మించుకొని ఒక్కరోజు—ఒక్కరోజే—పిల్లల్తో ఆనందంగా గడపాలని ఎంతగానో ఆశించాడు అవతారం. అతని ఆశ తీరినా, తీరక పోయినా గవర్నమెంటు వారి దగ్గర తీసుకున్న అప్పు తీర్చక తప్పదు.

ఆ మరుసటి నెలనుంచీ నెలకి ఇరవై రూపాయల చొప్పున ఐదు నెలలు ఐదు ఇరవైలు వందరూపాయలు, జీతంలోంచి కట్ చేసేసుకుంటారు.

ఉద్యోగస్థుడు ఏడాదిలో ఒక్కసారే ఫెస్టివల్ ఎడ్వాన్సు తీసుకోవటానికి అర్హుడు కాబట్టి, మరో కేలండర్ మారేంత వరకూ మళ్లీ ఫెస్టివల్ ఎడ్వాన్సు మాటఎత్తే అర్హతని కోల్పోయాడు అవతారం.


షేవర్ స్విష్
హైజాక్ చేసేవారిని హైజాక్ చేస్తాడు
విమానం గగన మార్గంలో ఉండగా కాక్‌పిట్ నుండి ఇంటర్‌కామ్ మీద ఒక ఉగ్రమైన కంఠస్వరం వినిపిస్తుంది
దాలా ప్రాణాలు అపాయంలో చిక్కు కున్నాయి..త్వరగా ఏదైనా చెయ్యాలి!
అందరూ నిశ్శబ్దంగా ఉండండి. ఈ విమానం హైజాక్ చేయబడుతోంది!
షేవర్ స్విష్ సహాయం! ఈ! ఈ!
ప్రయాణీకులు భయ కంపితులైనారు.
నాకు కావలసింది క్షౌర వాయి నిశ్శ బ్దవు-పొడుగు హ్యాండిల్ కలిగిన స్విష్ రేజర్‌తో తక్షణమైన క్షౌరం.
రెడి వల్ల—ద్విగుణం చేయబడి అత్యధిక పదును కలిగిన స్విష్‌ను మించిన బ్లేడు లేదు. 8 స్విష్ బ్లేడ్లు 5 సాధారణ బ్లేడ్ల పని చేస్తాయి.
Swish
STAINLESS
స్విష్‌తో క్షౌరం చేసుకునే వారిని ఎవ్వరూ ఓడించ లేరు.
డార్లింగ్ మీరు మమ్మల్ని రక్షించారు
దాని సంగతే అంత: స్విష్‌తో క్షౌరం చేసుకునే వారిని ఎవ్వరూ ఓడించ లేరు! కాని ఆయనతో కలిసి పని చెయ్యవచ్చును (ఆయన రాబోయే సాహస కృత్యంలో)

8

ఆనంద్‌కి అక్కడనుండి ఎంత త్వరగా పోతే అంత బావుండుననిపిస్తోంది.

"ఇంక మాటలనవసరం వీరయ్యగారూ. మా డబ్బు మాకిచ్చెయ్యండి వెళ్లిపోతాం" అన్నాడు రాధాకృష్ణ వినయంగా.

"అంత డబ్బు ప్రస్తుతం చేతిలో లేదు. మరో వారంలో డబ్బు పంపుతాను" అన్నాడు వీరయ్య నీరసంగా.

ముగ్గురు కదిలి వచ్చేశారు దారిలో రఘు ఏమీ మాట్లాడలేదు. అతని మౌనం మిగిలిన ఇద్దరికీ బాధగా వుంది.

కొంతసేపయాక ఆనంద్ అన్నాడు.

"మీరేం అనుకోకండి రఘూ. ఆయన నోటి తీరే అంత. దురుసు మనిషి"

"అవును. మీరలా మౌనంగా వుండకండి. మా కేం తోచదు. సరదాగానే వుండండి. అప్పుడే బావుంటుంది మాకు." అన్నాడు నవ్వుతూ రాధాకృష్ణ. రఘు కూడా నవ్వేసి "మీరేమీ అనుకోనంటే ఒక చిన్నమాట. పదండి అలా గాంధీ పార్కులోకి" అన్నాడు రఘు.

అలసి వున్నవారికి కాస్త విశ్రాంతి కావాలని పిస్తోంది.

మమతల వంతెన

(15వ పేజీ తరువాయి)

"పార్కెందుకు? హోటల్‌కి వెడదాం రండి. కాస్త కాఫీ తాగితేగాని బుర్రవేడి తగ్గదు" అన్నాడు ఆనంద్ పక్కవీధిలోకిదారి తీస్తూ.

కాఫీ తాగుతూ, తాగుతూ మనసులోని విషయం మాటల్లో చెప్పి బరువు తగ్గించుకున్నాడు రఘు. ఆశ్చర్యంతో తబ్బిబ్బయ్యాడు రాధాకృష్ణ.

"ఆలోచించే అంటున్నారా ఆ మాట" అడిగాడు రాధాకృష్ణ వింతగా రఘుని చూస్తూ.

"ఆహా...నా వైపు నుంచి అభ్యంతరం లేదు. మీరు చెప్పాలి"

"మీనాన్నగారు ఒప్పుకుంటారా?"ఆనంద్ ప్రశ్న.

"పెళ్లిచేసుకునేది నేను. నాకు ఇష్టమయి నప్పుడు నాన్నగారెప్పుడూ కాదనరు. తప్పు పనయితే మందలిస్తారు. అప్పుడు వినవలసిన అవసరం చిన్నవాళ్లకి వుంది. అంతేగానీ మంచిపని చేస్తున్నప్పుడు ఏమీ అనరు. ఇంక ఆలోచించుకోవలసింది మీరు ... "

"నాకయితే చాలా ఆనందంగా వుంది. కానీ మా పెదపాప."

"అవును ... ఆలోచించుకోమనండి. ఆ అమ్మాయికి డాక్టర్లంటే చాలా ఇష్టమని మీరేచెప్పారు. నన్ను ఒప్పుకుంటుందో లేదో మరి. కానీ ఒక్క విషయం ఆ అమ్మాయికి చెప్పండి. భర్తగా ఏ లోపమూ రానివ్వను. డబ్బు తెచ్చిన మనిషిగా కాక, మనసున్న వ్యక్తిగా హృదయం విప్పి నాలోకి ఆహ్వానించుకుంటాను. ఆ మాత్రం పౌరుషంగల ఆడపిల్ల నాకింతవరకు తటస్థపడలేదు. నిజంగా నేను చాలా ఇష్టపడుతున్నాను. ఆ వీరయ్యకి నిజంగా అభినందనలు చెప్పాలి." అన్నాడు రఘు చిన్నగా నవ్వుతూ.

"చాలా సంతోషం రఘూ"

రాధాకృష్ణకి, ఆనంద్‌కి ఆనందంగావుంది. ఈ సమస్య ఇంత అందంగా, ఆనందంగా పరిష్కరించ గలగటం గొప్ప విషయం అనుకున్నారు. అయితే కుసుమ ఏమంటుందో నన్న సందేహం వాళ్లని పీడిస్తోంది.

మరో రెండు రోజులు గడిచాయి.

అప్పుడే వచ్చిన ఉత్తరం చదివిన డాక్టరు శివరాం ఆశ్చర్యపోయాడు. రాధాకృష్ణ రాసిన ఉత్తరం ఆయనలో ఆలోచనని కూడా రేకెత్తించింది.

"నాకేం ఉత్తరాలు లేవా నాన్నా?" లత వచ్చి అడిగింది.

"అందరికీ కలిపే ఈ ఉత్తరం."

"ఏమిటా ఉత్తరం ?"

"రాధాకృష్ణ రాశాడు"

"అలాగా" తాపీగా అంది.

రాసేశాడన్నమాట.

"ఏమిటీ? నీకు ముందే తెలుసా ఈ విషయం ?" ఆశ్చర్యపోతూ అడిగాడాయన.

'వాళ్లమ్మాయి పెళ్లివిషయమేకదానాన్నా'.

"ఆ... ఆ... అవును."

"మొన్న రఘు చెప్పాడు... నీకు చెప్దా మనుకున్నాడు.సిగ్గుపడ్డా డేమో!"నవ్విందిలత.

"లోడు దొంగలు. అయితే రఘు ఇష్టపడ్డాడన్నమాట" ఆయన నవ్వేశాడు.

"ఆ. చాలా ఇష్టపడ్డాడు."

"అయితే ఇంకేం? కానిచ్చేద్దాం. అయినా లతా, నీ పెళ్లికాకుండా..."

"నా పెళ్లికేం తొందర్లేదు. అయినా ఇప్పుడే నేను చేసుకోను. అన్నయ్య పెళ్లి చేసెయ్యండి" అంటూ అక్కడినుండి వెళ్లిపోయింది లత.

అదృష్టం కలిసిరావడమంటూ జరిగితే కొబ్బరికాయలోకి నీళ్లలా వచ్చాయో అలా వస్తుందట. అలాగే జరిగింది కుసుమ విషయంలో. చక్కని మనసున్న ఇంట్లో, మమతకి ఆప్యాయతకి విలువనిచ్చే ఇంటి కోడలయే అదృష్టం కుసుమకి పట్టింది.

అనుకున్న ముహూర్తానికే కుసుమ పెళ్లి జరిగిపోయింది. రాధాకృష్ణకి, శారదకి కొండంత బరువు దిగింది. మాట అని మనసులు నొప్పిద్దామనుకున్న పెద్దమనుషులకి ఆ అవకాశం జారిపోయింది. (ఇంకా ఉంది)

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

జి. కె. ఆర్. హైదరాబాదు.

భార్య తెచ్చే నష్టం భర్త భరించాలా ?

సహజమేకదా—సార్, కోతిని పెంచినవాడేకదా — అవి పగులగొట్టే వాటి బాధ్యత వహించాలి !

పి. ఎస్. ఆకివీడు.

మీరు నిజాన్ని నిర్భయంగా ఉన్నదున్నట్లు మాట్లాడుతారు. మీతో కలం స్నేహం చేసి మీ ధైర్యంలో ఏందో ఏంతేనా పొందాలని ఉంది . . .

తమరి కోరిక బాగానే ఉంది. కాని నాకే ఆ ధైర్యం (అదేమిటో కలం స్నేహం !) లేకుండా ఉంది !

జి. ఎస్. హెచ్. పుత్తూరు.

ఆంధ్రులకు సహనం తక్కువ అని . . .

వింటే ఎవరేనా నవ్విపోగలరు. ఈ మధ్య జరిగిన ఆంధ్రోద్యమ నాటకంలో— ఆంధ్రులు తమ 'పరమ' నాయకుల పట్ల చూపిన సహనం తక్కువా ? ! ఆ నాయకులే యిప్పుడు హాయిగా 'సింహాసనాలపై' ఎక్కి ఆంధ్రకేసి అడుగేయకుండా ఉన్నా . . . అవగాహనచేసుకుని వూరుకున్న ఆంధ్రులకా— సహనం తక్కువ అంటున్నారు మీరు ? నేను నమ్మను.

ఎస్. ఆర్. పలమనేరు.

జీవితంలో కోరికలు ఎప్పుడు నశిస్తాయి ?

నశించవు. ఆశే యీ ప్రపంచానికి మూలస్తంభం. ఆశే మేలుకుంటున్న ప్రతి మనిషి కలా !

కె. ఆర్; కె. ఎస్. కె. జె; కె. ఎమ్. కె. పి. కాజూరు.

ఉపవాస ముండేవాడు యోగి, ఒంటి పూట భోంచేసేవాడు త్యాగి, రెండు పూటలా తినేవాడు భోగి, మరి మూడు పూటలా మెక్కేవాడు ?

తినమరిగి ! !

హల్లో రామలక్ష్మి అని ఎవరైనా స్టూడెంటు మిమ్మల్ని పిలిస్తే ఎలా ఉంటుంది మీకు ?

ఏం దీదీస్, అలా అడుగుతున్నారు ? మా ఆంధ్రా అమ్మాయిల్లా ముఖం మాడ్చుకోను— 'హాయ్' అని తిరిగి పల్కరించేసి నా దారిన నేను పోతాను.

సి. కె. ఆర్. మద్రాసు.

రచనలో ఏం డబ్బు వస్తుంది కాని సినిమాల్లో పాడకూడదా ?

కొంపదీసి మా వీధిలో కాపురం లేరుకద స్వామీ ! . . . మా పక్కింట్లో రోజుకో కుటుంబం మారుతూంటుంది ! . . . నా పాట వినో వినలేకో — తెలియదుమరి.

పి. వి. ఆర్. కొల్హాపూరు.

కష్టాల్లో ఆదుకోదుగాని చిన్న తప్పు చేస్తే వెక్కిరించే యీ సంఘాన్ని . . .

అదే పొరపాటు. సంఘం నీ తల్లికాదు. తోబుట్టువు కాదు. నీ భార్యకాదు. కనీసం స్నేహితుడుకాదు. అది సామూహిక బాధ్యతలకి— పూతపదం. మాత్రమే— దాన్ని తప్పు పట్టి ప్రయోజనం లేదు.

పి. ఆర్. ఎస్. రాయగడ.


అధిక స్నేహం ప్రాణహాని. చెడిపోయి స్నేహితునింటికి వెళ్లు అంటారు. ఎలా ?

అతి స్నేహం—గౌరవ హాని. చెడి స్నేహితునింటికి వెడితే కనీసం ఆదుకొంటాడు. చుట్టాలింటికి వెడితే— హీనంగా చూస్తారు.

పి. జి. కె. పి. వంశధార.

మానవ సేవయే మాధవ సేవ అన్నారు. గాని యీనాడో ?

మానవసేవయే మాధవ సేవ !



"అయ్యా ?"

"ఏంట్రా ?"

"ఇయాల నాతో ఆరిబాబు మాట్లాడాడయ్యా" చాలా సంతోషంగా చెప్పాడు రంగడు.

"ఎవురి బాబురా ?"

"ఎదురింటి మేడోరి చినబాబు"

"నీవాయి సాయినేనా ? ఏం మాట్లాడారురా ?" అడిగాడు సుబ్బన్న.

"నీవోరి కొడుకువని అడిగాడు. నీ కొడుకునని సెప్పాను. 'సుబ్బన్న గోడి కొడుకువా నువ్వు' అని, నాకేమన్నా ఆటలొచ్చా అని అడిగాడు. నాకొచ్చిన ఆటలన్నీ సెప్పాను. 'చీఛీ' అవి పాత ఆటలు అని అసయించుకుని రేపు సాయింకాలం వొత్తే కొత్త ఆటలు నేరుపుతానన్నాడు. రేపు ఎల్లాల" అన్నాడు రంగడు ఆశగా ఎటో చూస్తూ.

"యెలితే యెల్లుగాని ఆరికాడ నాకాడ అడిగినట్టు యికారం తెప్పించే మాటలు మాట్టాడబోక. సాలా జాగరతగా వుండాల' అన్నాడు సుబ్బన్న కొడుక్కి కలిమికి, లేమికి ఉన్న బేధాన్ని విప్పతూ.

"ఎందుకనయ్యా? ఏటికలా ఉండాల ?"

"అదుగో ఎదవ పెస్నలూ నువ్వు. ఆడబళ్లో సెప్పేది ఇంతేనంట్రా. పెతిసారీ మనం కూత్తికూడే ఎందుకు తినాల? ఆమేడోరు ఇయాల ఇంత అన్నం పారేశారు బయట, ఎందుకయ్యా" అంటూ సవట పశ్నలు – అదంతేరా ఆళ్లు గొప్పోళ్లు, మనం బడుగోళ్లం. ఆళ్లకాడ కిందే ఉండాలనిసెప్తే వినిపించుకోవాయిరి. ఆల్ల బాబుతో నువ్వు ఆడొద్దు కాని బుద్ధిగా గుడిసెకాడ పడుండు."

"ఆరినలా అడగనయ్యా. ఆరికి పత్తానని సెప్పాను. ఎల్లకపోతే నేనంటే జోడుగా ఉండరేమో, తప్పకుండా ఎల్లాలయ్యా."

"ఏటిరా. సీలోనే ఉందా ఆ రి బా బు పెపంచం. ఆయనతో ఆడుకునేవారే కరువయ్యారా యేంటి ?"

"అదికాదయ్యా. నన్నుపిలిచి రమ్మన్నారు గందా. నేనెల్లాల. నేనెలతానయ్యా" అంటూ లేచాడు రంగడు ఇంకా అక్కడుంటే సుబ్బన్న ఇంకా అడ్డంకులేమన్నా చెబుతాడేమోనని.

"ఎల్లుగాని ఆరితో పిచ్చిగా మాట్టాడకు. ఆరికిష్టంగా ఉంటే కసింతసేపు ఆడుకుని

వచ్చేయ్. నీగురించేమన్నా పెడుగా తెలిసిందా తాట ఒలిసేత్తాను జాగరత."

"సరేలే అయ్యా" విసుగుగా అంటూ అక్కడినుంచి వెళ్ళిపోయాడు రంగడు.

వాడెళ్ళిన వంకే చూస్తూ 'పిచ్చిఎదవ' అనుకున్నాడు సుబ్బన్న. 'ఈడికీ వొయిసులో ఎంత కోరికో, ఎంత ఆలోచనో'! అనుకున్నాడు. చుట్ట చుట్టుకోవడానికి పుగాకు కోసం బనీను జేబు తడుముకున్నాడు. అందులో లేకపోవటంతో 'ఏ ఎదవ బతుకు,' అనుకుంటూ తుపుక్కున ఉమ్మేశాడు.



ఆటలు-అంతస్తులూ

కోటభరణి శ్రీ

తెల్లవారిన దగ్గర్నించీ, ఎప్పుడు సాయంత్రం అవుతుందా, ఎప్పుడు ఆమేడ వాళ్లబ్బాయిని కలుసుకుందామా అని ఉవ్విళ్లూరాడు రంగడు.

ఆ సాయంత్రం రానేవచ్చింది. సుడిసె బయట నుంచున్నాడు రంగడు. రెండు మూడు సార్లు ఏదోపనిమీద బయటకివచ్చిన ఆ మేడ వాళ్లబ్బాయికి రంగడు చేయి ఊపాడు. ఆ అబ్బాయి గమనించాడో, లేదో కాని ఇటు రాలేదు. 'సూడలేదేమో'నని సరిపెట్టుకున్నాడు రంగడు. మరోసారి ఆఅబ్బాయి బయటకొచ్చినపుడు, చప్పట్లు కొట్టాడు.

ఆ అబ్బాయి వెనుదిరిగాడు. 'ఏమిటన్నట్లు చూసి, ఏదో గుర్తుకొచ్చిన వాడిలా రంగడు దగ్గరికొచ్చాడు. రంగడి మనసు ఆనందంతో నిండిపోయింది. రంగడు నవ్వాడు.

"నువ్వు సుబ్బన్నకొడుకునని చెప్పావుగదూ! నీకేమేమీ ఆటలొచ్చు ?"

"అదేటి, ఈన నిన్న అడిగినోడుగదా. మళ్లీగా అడుగుతాడేంటి ?" అనుకున్నాడు రంగడు నిరుత్సాహంగా. అయినా ఏవన్నా అడిగితే అయ్య 'ఎదవ పళ్ళల'ంటూ తంతాడనుకుని తనకొచ్చిన ఆటలన్నీ మళ్ళీ చెప్పాడు.

'అబ్బే, అవి ముసలమ్మ ఆటలు' తేల్చేశాడు.

"బాబూ మీపేరేటన్నారు బాబూ."

"బాబు"

"అదికాదు బాబు. మీ అసలుపేరు?"

అసలుపేరు, కొసలుపేరు ఉంటాయా. నా పేరు ఫణిబాబు."

"పనిబాబు, ఎంత బాసుండాది పేరు" అనుకున్నాడు రంగడు.

"మరి నీపేరేంటి."

"రంగారావు బాబూ, మా అయ్యా వోళ్ళు రంగడని పిలుత్తారు."

"ఒరేయ్ రంగా"

"ఈన ఒరేయ్ అంటాడేటి తను బాబూ అంటుంటే" – తన తండ్రి గుర్తుకొచ్చి మౌనంగా ఊరుకున్నాడు రంగడు.

"ఒరేయ్ నీకు అడుక్కునే ఆట వచ్చురా ?"

"అదేటాట బాబూ, అన్నాలాటా" నవ్వుతూ అడిగాడు రంగడు.

"ఓరి, అది ఆడపిల్లల ఆటరా" 'అడుక్కునే ఆట' అంటే చెప్తావిను. నేను అడుక్కునేవాణ్ణి అన్నమాట ! నీదగ్గరకొచ్చి అడుగుతాను. నువ్వులేవని కసురుకుంటావు. నేను నిన్ను బతిమాలుతాను. నువ్వప్పుడు విసుక్కుని డబ్బులు వేస్తావు' అంటూ ఆ 'అడుక్కునే ఆట'ను వివరించాడు ఫణిబాబు.

రంగడికీ ఆట బాగానేఉంది.

వెంటనే ఆ ఆట ప్రారంభించారు.

"బాబు. నిన్నటినుంచి అన్నంలేదుబాబూ. ఓ పైసా ధర్మం చెయ్యండి బాబు, మీకు పుణ్యం ఉంటుంది" అన్నాడు ఫణిబాబు.

"లేపు పోపో," అన్నాడు రంగడు.

"అంతేనా, ఇంకా గట్టిగా కసురుకోవాలిరా" – ఫణిబాబు రంగడి పైలాగుని సరిదిద్దాడు.

'బాబూ, నేను 'లేపుపోరా' అనొచ్చునా?'

'అనొచ్చురా ఊఁ ... కాని ధర్మం చెయ్యి బాబూ, ఆకలిగా ఉంది బాబూ'

'ఓరి, చెప్తుంటే నీక్కాదూ, నాకాడ పైసాలేదు. అంటున్నాపో."

"అంతేకాదురా, దుక్కలా బలిసిఉన్నావు. పనిచేసుకోలేవా అనాలి."

"సరేబాబు. దున్నపోతులా ఉన్నావు. ఆడేడన్నాబోయి పనిసేసుకోరాదూ".

"అలా అనొద్దు బాబయ్యా, మీరే రక్ష, మీరేదిక్కు. నువ్వు ఇప్పుడేం లేపు అనాలి".

"నాకాడ పైసాలేదు, పోపో"

"మీరుకాక ఎవరు వేస్తారుబాబూ ... నువ్విప్పుడు విసుక్కుని డబ్బులు వెయ్యాలి".

"నాకాడ పైసల్లేవు బాబూ"

"ఇదిగో ఈ పావలా తీసుకుని మళ్లీనాకు వెయ్యి"

"సరేబాబు. ఇదిగో అడుక్కో పటం

ఆటలూ – అంతస్తులూ

మరియాదకాదురా, ఈ పైసలు తీసుకుని మళ్లీ ఇటురాబోక."

" ఆఁ ... అదీ " అంటూ రంగడిని మెచ్చుకున్నాడు ఫణిబాబు.

"మళ్లీ ఆడదామా" అని అడిగాడు ఫణిబాబు. 'ఓ' అన్నాడు రంగడు. మళ్లీ, మళ్లీ ఆడారు. ఓసారి అడుక్కునేవాడు రంగడు. మరోసారి ఫణిబాబు.

"బాబూ అయ్యగారు పిలుస్తున్నారు." అంటూ ఎవడో పనిమనిషి వచ్చి ఫణిబాబుని ఎత్తుకున్నాడు. "వస్తానురా రంగా, రేపు రా మళ్లీ" అంటూ వాడితో వెళ్లిపోయాడు ఫణిబాబు. తనకోసం 'తన అయ్య పిలుస్తున్నాడంటూ' ఎవరూ రాకపోవటంతో తనే వాళ్ల గుడిసెవైపు బయల్దేరాడు రంగడు.

రోజూ ఫణిబాబు, రంగడు సాయంత్రం పూట కలుసుకునేవాళ్లు. ఫణిబాబు రోజుకో కొత్త ఆట నేర్పేవాడు. కుంటివాళ్ల ఆట! గుడ్డివాళ్ల ఆట! తాగిన వాళ్ల ఆట! ఇలా బోలెడు రకాల ఆటలు! వాళ్లిద్దరికీ జోడు కుదిరింది. రంగడికి అనేక ప్రశ్నలు వస్తూండేవి. కాని ఏవీ అడిగేవాడు కాదు.

ఫణిబాబు చదువుకోసం హాస్టల్‌లో చేరిన తర్వాత వారు విడిపోవటం జరిగింది.

అలా విడిపోవటం పోవటం, వాళ్లెక్కడ కలుసుకున్నారో తెలుసా ?

రంగడు స్వయం కృషితో, స్కాలర్‌షిప్పులతో 'ఇంటర్' ప్యాసయ్యాడు. ఉద్యోగం కోసం ఐదేళ్లనుంచీ తిరుగుతున్నాడు.

ఫణిబాబు. ఎవరి కృషివల్లో ఏమోగాని టక్కున ఓ ఆఫీసుకి ఆఫీసరైపోయాడు.

* * *

మామూలుగా 'గుడ్ మార్నింగ్ సార్' అంటూ లోపలికి అడుగుపెట్టిన రంగారావు 'టేక్ యువర్ సీట్' అన్న కంఠం విని తల పైకెత్తి, ఒక్కసారిగా విస్మయంలో పడ్డాడు. ఫణిబాబు! తనతో ఆడుకున్న పనిబాబు!! 'టేక్ యువర్‌సీట్'–మరోసారి అన్నాక బరుకుగా కూర్చున్నాడు రంగారావు.

"నేను ... రంగనండీ"

"ఓహో. రంగడివా. బాగా మారిపోయావురా. మీ వాళ్లంతా బాగున్నారా"

"అంతా బాగున్నారండి. మీ దయవల్ల"

"ఓరి... మాటకూడ మారిపోయిందే"

"నేనింకా చిన్నప్పటి రంగడినే అనుకుంటున్నట్లున్నారు. చాలా చక్కగా మాట్లాడుతున్నారు ఫణిబాబు. నేను అడిగితే నాకే ఇస్తారేమో ఈ ఉద్యోగాన్ని!" అనుకున్నాడు రంగారావు మనసులో.

"ఉద్యోగం ఒక్కటే ఉన్నట్లు ప్రకటించారు. మా సంగతి మీకు తెలుసుగదా. అమ్మని, నాన్నని మిగతా పిల్లల్ని పోషించాలి. నాకిప్పించండిబాబు ఆ ఉద్యోగం. మీ పేరు చెప్పుకుంటూరు."

"నో మిస్టర్ రంగా నా ఉద్యోగం కర్తవ్యం నేను నిర్వహించక తప్పదు. స్నేహానికి, బంధుత్వానికి అతీతమైనది ఉద్యోగ నిర్వహణ. నిజమే. ఒక 'పోస్టు' మాత్రమే ఉంది. 'మెరిట్'బట్టి ఇవ్వాలి. నీకు అన్ని క్వాలిఫికేషన్స్ ఉంటే నీకేవస్తుంది. ఆ సర్టిఫికెట్లు ఇలాఇవ్వు'.

రంగారావు సర్టిఫికెట్లిస్తుంటే చెయ్యి వణికింది. ఆ చేతొత్తే ఆటల్లో అనేకసార్లు పావలాలు, ఐదుపైసలు, ఫణిబాబు డబ్బే అయినా ఫణిబాబు కిచ్చాడు చిన్నతనంలో.

సిగిరెట్టు వెలిగించి పొగ వదులూత్త 'గుడ్' అన్నాడు ఫణిబాబు సర్టిఫికేట్లు చూస్తూ. రంగారావు మురిసిపోయాడు.

"యస్. యుకెన్‌గో" అన్నాడు ఫణిబాబు అధికారదర్పం గొంతు నిండా ధ్వనిస్తుండగా.

రంగారావు బరువుగా, ఉద్యోగం వస్తుందన్న ఆశ మనసులో చోటు చేసుకోగా బయటకు నడిచాడు.

ఫణిబాబు టేబుల్‌పై టెలిఫోను మ్రోగింది.

'హలో, ఫణిబాబు హియర్'

'హైదరాబాదునుంచి ట్రంకాల్ సార్'– ఆపరేటర్ గొంతు.

"కనక్షనివ్వండి"

... ...

"హలో, ఫణిబాబు హియర్"

"హలో, ఆఫీసరేనా?' – ఎవరో ప్రజానాయకుడి గొంతు.

"అవునండి. తమరు?"

"మీ డిపార్టుమెంటుమినిష్టరునయ్యా"

"అయ్యా, నమస్కారం సార్"

"అవునుగాని, మీ ఆఫీసులో ఏదో ఖాళీ ఉందటగా. మావాడొకడు ఉద్యోగం చేస్తానని ఒకటే గోల పెడుతున్నాడు. వాడికి..."

"ఆయన ఇంటర్‌వ్యూ కొచ్చిన వాళ్లల్లో ఉన్నారా సార్"

"లేదు. నాదగ్గరే ఉన్నాడు. రేపు అక్కడికి వస్తానంటున్నాడు. వాడికి ఉద్యోగం ఇచ్చేయ్."

"అలాగే సార్, మీరు చెప్పటమూ, కాదనటమూనా?"

అక్కడ ఫోను పెట్టేసినట్లు శబ్దమయ్యేసరికి తనూ రిసీవరు పెట్టేశాడు ఫణిబాబు.

కాలింగ్‌బెల్ కొట్టి బంట్రోతు రాగానే రంగడి సర్టిఫికేట్‌లు వాడికందించి, "స్టెనోపిస్టు కిచ్చి రిగ్రెట్ కార్డు కొట్టి దాంతోపాటే వీటినీ కవరులోపెట్టి తెమ్మను సంతకం చేస్తాను." అన్నాడు ఫణిబాబు.


యువతరం



కాలేజీలో ఫుట్‌బాల్, కబడ్డీ లాంటిఆటల్లో మంచి పేరు తెచ్చుకున్న వై. మహదేవశాస్త్రికి బి. కామ్. పూర్తికాగానే సి. ఏ. చేయాలనుంది. యువకులంతా వ్యాయామంచేయాలి మంచి అలవాట్లు చేసుకోవాలి అని వాదించటమే గాక, అలా తాను వుంటాడు కూడా. రాజకీయాలతనికి తెలియవు. వాటిల్లో తలదూర్చడు. నాటకానుభవం వుంది. రచన సరదా వుంది. ప్రేమ పెళ్లిళ్లపై గౌరవం గల యీ యువకునికి భాషను పెంపొందించుకోవాలన్న తహ తహ వుంది. అందుకోసం యింగ్లీష్,హిందీ పుస్తకాలు చదువుతాడు కాని తెనుగు అంటే వల్లమాలిన అభిమానం. విదేశాలు వెళ్లాలన్న ఆకాంక్ష వుంది కూడా అందుకని మాతృభాషతో పాటు తతిమ్మా భాషలు నేర్చుకుంటున్నాడు. క్రికెట్ కామెంటరీ వింటాడు – అమితాబ్ బచ్చన్, హేమమాలినీలను అభిమానిస్తాడు – మంచి సినిమాలన్నీ చూస్తాడు.

హార్లిక్స్: ఛాంపియన్‌లను తయారుచేసే పుష్టికర ఆహారం.
హార్లిక్స్ కుటుంబంలోని ఛాంపియన్ 'రాజు'ని చూడు.





రోగనిరోధక శక్తిని కల్గించి నిత్యం ఆరోగ్యాన్ని కాపాడుతుంది.


మంచి ఆరోగ్యం—రోజూ అభ్యాసం వల్ల రాజు ఛాంపియన్ అయ్యాడు. అతనలా వుండేందుకు సుచిత్ర రోజూ అతనికి సరైన బలవర్ధక ఆహారం హార్లిక్స్ ఇస్తుంది. ఇది అతని ఆరోగ్యబీమా అంటుంది.

జీవనాధార మాంసకృత్తులతోనూ, శక్తినీ బలాన్నీ యిచ్చే పోషక పదార్థాలతోనూ హార్లిక్స్‌ని తయారు చేశారు.

అందుచేతనే నూరేళ్ళకు పైగా తల్లులూ, డాక్టర్లూ హార్లిక్స్‌ని నమ్ముకున్నారు.

దీనిలో ఆరోగ్యముంది
హార్లిక్స్
మంచి పుష్టికరమైనది

హార్లిక్స్ రిజిష్టర్డ్ ట్రేడ్ మార్కు.



"నేనెరిగిన ఆరోగ్యవంతమైన కుటుంబాలు హార్లిక్స్‌ని నమ్ముకున్నాయి.

సహజమైన మాంసకృత్తులూ, కార్బోహైడ్రే ఖనిజాలూ, విటమిన్లతో హార్లిక్స్‌ని ప్రత్యేకంగా రూపొందించారు. ఇది రోగనిరోధక శక్తిని కల్గించి, నిన్ను ఆరోగ్యంగా వుంచుతుంది."



HMM 3375 (1) TEL

'అబద్ధం చెప్పకండి'

'నిజంగానే పోయింది డాక్టర్' కొంచెం కంగారుగా అన్నాడు.

'నేను నమ్మను. అసలంటూ వుంటే కదా పోవటానికి'

దొరికిపోయానని తెలిసిపోయింది సుబ్బారావుకు. క్షమాపణలు చెప్పకున్నాడు.

'ఐ లవ్ ది పేషంట్స్' అంది.

డాక్టర్ల కథలు....

(30 వ పేజీ తరువాయి)

అయితే తనూ ఒక పేషంటే. తనను కూడా ... సుబ్బారావు గుండె ఒక్కమారు కొట్టుకోవటం ఆగినట్లుగా అనిపించి తిరిగి వేగంగా కొట్టుకో సాగింది. ఈవిడ తనను ప్రేమిస్తోందన్న మాట. ఈ యాత్ర ఇలా పరిణమిస్తున్నది. తనెంత అదృష్టవంతుడు.

'కాని మీరు పేషంటు కారు'

సుబ్బారావు ఎవరెస్టు నుంచి అమాంతం కింద పడ్డాడు.

'వెళ్తానండి' లేచి నిలబడ్డాడు నీరసంగా.

'ఎలా వెళ్లగలరు ?'

తిరిగి మనస్సు ఆశల శిఖరాలను అధిరోహం చేస్తోంది.

'అవును. ఎలా వెళ్లగలను ?' అన్నాడు సుబ్బారావు ఆవేశంగా ఓ అడుగు ముందుకేసి.

'ఫీజు ఇవ్వనేలేదు. ఎలా వెళ్లిపోతానను కుంటున్నారు ? తెలిసొచ్చినా తెలియకొచ్చినా జబ్బు జబ్బే' అంది డాక్టర్ హలం గట్టిగా.

* * *

మెయిన్ రోడ్డులో ఇప్పుడు 'డాక్టర్ సుబ్బారావు' బోర్డు కనిపించటం మానేసింది. 'నా కెదురుగా ఎవరు నిలబడగలరు' అని మీసాలు మెలేసుకున్నాడు ఆ వీధిలోని ముసలి డాక్టరు. కాని ప్రస్తుతం ఆ బోర్డు ఓ పల్లెటూరిలో 'ఉచిత వైద్యశాల' అనే మరో బోర్డు కింద వేలాడుతోందని, సుబ్బారావు పేరు మెల్ల మెల్లగా దశ దిశలా వ్యాపిస్తోందని అతనికి తెలియదు.

అవీ ఇవీ అన్నీ

మణిపాల్ తెలుగు సమితి వార్షికోత్సవం

మణిపాల్‌లో తెలుగు సాంస్కృతిక సమితి ప్రథమ వార్షికోత్సవం కస్తూరిబా మెడికల్ కాలేజీలో జరుపబడింది. డాక్టరు ఎ. కృష్ణారావు అధ్యక్షులు. శ్రీ పి. వి. భట్ గారు వార్షిక సంచిక ఆవిష్కరించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. (ఒ.వి.)

వైణిక విద్వాంసునికి సన్మానం

ప్రముఖ వైణిక విద్వాంసులు శ్రీ కంభంపాటి అక్కాజీరావుకు ఏప్రియల్ 12 వ తేదీన విజయవాడలో పద్మశ్రీ మంగళంపల్లి బాలమురళి కృష్ణ అధ్యక్షతన సన్మానం జరిగింది. సభలో ప్రసిద్ధ విద్వాంసులు సర్వశ్రీ ఓలేటి, ఎం. ఎస్. బాలసుబ్రహ్మణ్యశర్మ, కుమారి శ్రీరంగం గోపాలరత్నం, కుమారి వింజమూరి లక్ష్మి, శ్రీ నార్ని కేదారేశ్వరుడు గారలు ప్రసంగించారు. అనంతరం శ్రీ అక్కాజీరావు వీణపై తమ ప్రతిభను ప్రదర్శించి శ్రోతలను తన్మయులను చేశారు. (ఒ. వి.)

Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna





సినీ బొమ్మల కొలువు



పైన:

'సత్యానికి సంకెళ్ళు'లో కృష్ణ, శు

పైది రెండో బొమ్మ: 'తులసి'లో
లక్ష్మి చంద్రా, కృష్ణ

ప్రక్కన:

'బంగారు కలలు'లో
వహిదా, అక్కినేని


యువతి లాగే
ఉండాలని
అభిలాష
యువతికి
DCM
హిండన్ రివర్ మిల్స్
భారత దేశంలోని అత్యంత
ఆధునికమైన
ఫుల్ వాయిల్ చీరలు
mcm/dcm/912